# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 28 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 263 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


హైదరాబాద్‌లో

## పింక్ పవర్ రన్ 3.0



2

## పెరగనున్న ధరలే ఫెస్టివల్ ఆఫర్స్




2

# దేశపు తొలి ఎల్ఎన్‌జీ రైలు




## సబర్మతి రైల్వే స్టేషన్‌లో ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్ షా

సబర్మతి, సెప్టెంబర్ 27: దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోడీ సమూలంగా మార్చారని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు. గుజరాత్ లోని సబర్మతి రైల్వేస్టేషన్లో దేశంలోనే మొట్టమొదటి ఎల్ ఎన్ జీ(లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్) రైలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ...మిగతా 2లో



## 2న నో యూపీఐ డే

ఎండీఆర్‌కు వ్యతిరేకంగా మొబైల్ రిటెయిలర్ల ఆందోళన

క్యూఆర్ కోడ్లపై నల్లటి వస్త్రం కప్పి నిరసన తెలుపుతాం

డిజిటల్ ఇండియా కావాలంటే జీరో ఎండీఆర్ ఉండాల్సిందే

ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ డిమాండ్



ఢిల్లీ, సెప్టెంబర్ 27: యూపీఐ లావాదేవీలపై విధించే మర్చంట్ డిస్కౌంట్ రేటు(ఎండీఆర్)ను మొబైల్ రిటెయిలర్లు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల తమ ఆదాయానికి గండిపడుతోందని పేర్కొంటున్నారు. దీనికి నిరసనగా అక్టోబర్ 2న (గాంధీ జయంతి) 'నో యూపీఐ డే' నిర్వహించనున్నట్లు ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ వెల్లడించింది. వ్యక్తులు ...మిగతా 2లో

# దశాబ్దాలుగా పెండింగులో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తులకు పరిష్కారం

## అర్హత ఉన్న కేసులను పరిశీలించి క్రమబద్ధీకరిస్తాం

22 ఏ చిక్కుముడులను ఒక్కొక్కటిగా విప్పుతున్న ప్రజా ప్రభుత్వం

శాసనసభలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు కార్యరూపం

రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 27: కొన్ని దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) దరఖాస్తుల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం 2016లోనే యూఎల్ సీ కింద పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జీవో జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు ఏండ్లతరబడి పెండింగులో ఉండిపోయాయని తెలిపారు. ఫలితంగా ప్రజలు తమ భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా సహచర క్యాబినెట్ మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలకు ఫాస్ట్ ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పొంగులేటి తెలిపారు.

**తాజా నిర్ణయం..**

తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యూఎల్‌సీ) కింద పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన ...మిగతా 2లో

## నేటి నుంచి బ్యాంకులు బంద్

సమ్మెతో 3 రోజుల పాటు నిలిచిపోనున్న బ్యాంకు సేవలు

5 రోజుల పని వారం, పెన్షన్, తదితర డిమాండ్లతో సమ్మె

యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలు పని చేస్తయ్




హైదరాబాద్, మనం ప్రతినిధి: నేటి నుంచి దేశవ్యాప్తంగా బ్యాంకులు మూడు రోజుల పాటు మూతపడనున్నాయి. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు ...మిగతా 2లో

## క్లోహీ కొట్టుడు.. తేలిపోయిన బౌలర్లు



9

### ట్రాయ్ చెప్పిన శుభవార్త..

# నెలకు 30 రోజులు ఇవ్వాల్సిందే

ఏడాదికి 13 సార్లు కాకుండా 12 సార్లే రీఛార్జ్

డేటా లేకుండా వాయిస్, ఎస్ఎంఎస్ ప్యాక్‌లు కూడా తప్పనిసరి

ప్రతి నెలా ఒకే తేదీన రెన్యూవల్ చేసుకునేలా ప్రత్యేక ప్లాన్




హైదరాబాద్, మనం ప్రతినిధి: దేశవ్యాప్తంగా ఉన్న ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) భారీ ఊరట కల్పించాయి. ఇకపై టెలికాం కంపెనీలు తప్పనిసరిగా 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లను అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. అంతేకాకుండా, డేటా అవసరం లేని వారి కోసం కేవలం వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన ప్లాన్లను కూడా అందుబాటులో ఉంచాలని నిర్దేశించాయి. ఈ మేరకు 'టెలికాం కన్స్యూమర్ ప్రొటెక్షన్ (పదమూడవ సవరణ) రెగ్యులేషన్స్, 2026'ను విడుదల చేశాయి.

అయితే, ఈ కొత్త నిబంధనల ప్రకారం, ప్రస్తుతం చాలా కంపెనీలు అందిస్తున్న 28 రోజుల ప్లాన్ల కారణంగా వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సి వస్తోంది. తాజా ఆదేశాలతో ఇకపై 30 రోజుల ప్లాన్ తప్పనిసరి కావడంతో, ఏడాదికి 12 రీఛార్జ్లు సరిపోతాయి. వినియోగదారులకు మరింత సౌలభ్యం కల్పించేందుకు, ప్రతి నెలా ఒకే తేదీన రెన్యూవల్ అయ్యేలా ఒక ప్రత్యేక ప్లాన్‌ను కూడా అందించాలని ట్రాయ్ టెలికాం సంస్థలను ఆదేశించింది. అయితే, ...మిగతా 2లో

## సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ నిరసనకు వాంగ్‌చుక్ మద్దతు



ఢిల్లీ, సెప్టెంబర్ 27: భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా సీజేపీ అక్టోబర్ 2న నిర్వహించబోయే నిరసనకు సామాజిక కార్యకర్త, పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ మద్దతును ప్రకటించారు. అయితే ఈ కార్యక్రమానికి తాను భౌతికంగా హాజరు కాలేకపోవచ్చని తెలిపారు. దేశ నాయకుల్లో జవాబుదారీతనం పెంచే ఎలాంటి కార్యక్రమానికైనా తన మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటిదని, అటువంటి ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగితే ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటుందని ఆయన ప్రశ్నించారు.

దేశంలో న్యాయం కోసం పోరాడే ప్రతి రాజకీయ పార్టీకి తాను ...మిగతా 2లో

## దసరా నాటికి సర్కారు చేతికి మెట్రో



హైదరాబాద్, సెప్టెంబర్ 27: దసరా నాటికి మెట్రో రైలు మొదటిదశ స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చకచకా ముందుకు కదులుతున్నది. కేంద్ర ప్రభుత్వం సూచించినట్లుగా మెట్రో ఈ బాధ్యతను ఎస్బీఐ క్యాప్స్ కు ఇదివరకే అప్పగించింది. ఈ సంస్థ ముంబయి, గుజరాత్ గిఫ్ట్ సిటీలోని బ్యాంకులతో సంప్రదింపులు జరిపింది. కానీ బ్యాంకులు చెప్పే వడ్డీయే ...మిగతా 2లో

## సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

సిరిసిల్ల పర్యటనకు ముందు ప్రశ్నల వర్షం

8 వేల ఎకరాల భూమి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలె

నేతన్నల బకాయిలు చెల్లించాలి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్

కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలన్న బీఆర్ఎస్ నేత

3

## అక్టోబరు 12 నుంచి తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



3

## దేశంలోని పోలీసు స్టేషన్లన్నీ అనుసంధానం

మెరుగుపడనున్న పోలీసింగ్

తుదిదశకు సీసీటీఎన్ఎస్



3

# పాక్ ఒక సీరియల్ ఉగ్రవాది

### ఐరాస వేదికగా ధ్వజమెత్తిన జైశంకర్



న్యూయార్క్ , సెప్టెంబర్ 27: ఐక్యరాజ్య సమితి వేదికగా పాకిస్థాన్ తీరును మరోసారి భారత్ ఎండగట్టింది. ఉగ్రవాద మహమ్మారిని సాధారణ విపత్తుగా పరిగణించడానికి.. దాని పర్యవసనాల నుంచి రక్షణను ఆశించడానికి పదేపదే ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న వారు చేస్తున్న వాదనలు చెల్లబోవని ఆ దేశానికి పరోక్షంగా స్పష్టం చేసింది. శనివారం ఐరాస సర్వ ప్రతినిధి సభ సమావేశంలో భారత విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ ప్రసంగించారు. ''ఉగ్రవాదాన్ని పదే పదే ఆచరణలో పాటిస్తున్నవారు.. శుక్రవారం ఇదే వేదికపై వాస్తవాలను వక్రీకరించారు. సీమాంతర ఉగ్రవాదం నుంచి మమ్మల్ని మేం రక్షించుకునే హక్కును కచ్చితంగా వినియోగించుకుంటాం. స్నేహం, సద్భావన ఉగ్రవాదంతో కలిసి ఉండలేవు. ఉగ్రవాదానికి పాల్పడేవారే తమ పద్ధతులను సరిదిద్దుకోవాలి. శాంతికి నిరంతర ముప్పుగా ఉగ్రవాదం పరిణమించింది. అది ఒక దేశ ప్రాయోజితమై.. సీమాంతర ...మిగతా 2లో

## నాలుగేండ్ల యుద్ధానికి సెటిల్‌మెంట్ సొల్యూషన్

- పుతిన్‌తో మాట్లాడి.. సెటిల్ చేసుకోండి
- జెలెన్స్కీకి ట్రంప్ సూచన



వాషింగ్టన్, సెప్టెంబర్ 27: నాలుగేండ్లకుపైగా రష్యా-ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో అవి మరింత తీవ్రమవుతున్నా యి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ...మిగతా 2లో

## ఒకటి కాదు.. రెండు సార్లు మొజ్తబాపై దాడులు

- శిథిలాల నుంచి ఆయన్ను వెలికితీశాం!
- ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్దరీ వెల్లడి



టెహ్రాన్, సెప్టెంబర్ 27: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించిన ప్రారంభంలోనే మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా కూడా మరణించినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. దాడుల నుంచి ఆయన త్రుటిలో బయటపడినట్లు ...మిగతా 2లో

# దేశపు తొలి ఎల్ఎన్ జీ రైలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగిస్తూ.. కాంగ్రెస్ తన పాలనలో కుంభకోణాలు తప్ప ఇంకేమీ చేయలేదని.. కానీ, గత 12 ఏండ్లలో మోడీపై ఎవరూ అవినీతి ఆరోపణలు చేయలేకపోయారని అన్నారు. అర్థరహితంగా మాట్లాడే హస్తం పార్టీని.. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా చర్చకు రావాలని సవాలు చేయాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. '2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. రైల్వే వ్యవస్థలో అనేక కొత్త సదుపాయాలను కల్పించి, దానిని ఆధునికీకరించారు. ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారు. హైడ్రోజన్ తో నడిచే రైలును ప్రారంభించడం ద్వారా.. ప్రపంచంలో ఆ సాంకేతికత కలిగిన నాలుగు దేశాల సరసన మోడీ భారత్ ను నిలిపారు. ముంబై నుంచి వడోదర వరకు మొట్టమొదటి లాంగ్ డబుల్ స్టాక్ కంటైనర్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్ ను నాలుగు ట్రాక్ ల నెట్ వర్క్ గా మారుస్తున్నాం'' అని అమిత్ షా వెల్లడించారు. '2015-16లో రైల్వేలు 293 కోట్ల లీటర్ల డీజిల్ ను వినియోగించాయి. 2024-25 నాటికి అది 108 కోట్ల లీటర్లకు తగ్గింది. 2030 నాటికి ఈ వినియోగాన్ని సున్నాకి తగ్గిస్తాం. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. 2010-11లో ఏటా కేవలం 75 కి.మీ. మేర రైల్వే మార్గాల విద్యుదీకరణ జరగగా.. 2023-24 నాటికి ఆ సంఖ్య 7,188 కి.మీ.కి పెరిగింది. 99.6 శాతం రైల్వే నెట్ వర్క్ విద్యుదీకరణ పూర్తయ్యింది'' అని అమిత్ షా వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఈ కొత్త రైలు ఎల్ఎన్జీ, డీజిల్ రెండింటిపై నడుస్తుంది. డీజిల్ వినియోగంలో సుమారు 40 శాతాన్ని ఎల్ఎన్జీతో భర్తీ చేస్తుంది. డీజిల్ వినియోగం, ఇంధన ఖర్చులు, ఉద్గారాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ రైలును అందుబాటులోకి తెస్తున్నట్టు హోంమంత్రి ప్రకటించారు.

# 2న నో యూపీఐ డే

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులకు రూ.2వేలు పైబడి చేసే లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటును విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 15 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. వ్యక్తిగతంగా చేసే లావాదేవీలకు, చిరు వ్యాపారులకు మినహాయింపు ఇచ్చారు. అయితే, ఈ రుసుముల వల్ల రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు యూపీఐ ద్వారా స్వీకరించే చిన్న వ్యాపారులపై సగటున రూ.2 నుంచి రూ.12వేల వరకు ఆదాయానికి గండిపడుతోందని అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తర్వీంద్ సింగ్ తెలిపారు. మొత్తంగా రిటైయిలర్లపై నెలకు రూ.40 కోట్లు, ఏడాదికి రూ.500 కోట్లు భారం కానుందని తెలిపారు. దీన్ని నిరసిస్తూ గాంధీ జయంతి రోజున 'నో యూపీఐ డే'ను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజు క్యూఆర్ కోడ్లపై నల్లటి వస్త్రం కప్పి ఉంచుతామని, యూపీఐ లావాదేవీలను అనుమతించబోమని స్పష్టంచేశారు. డిజిటల్ ఇండియా కావాలంటే జీరో ఎండీఆర్ ఉండాలని డిమాండ్ చేశారు.

డిజిల్ పేమెంట్స్ వృద్ధి చెందాలంటే రిటెయిల్ ఎకోసిస్టమ్‌పై ఎలాంటి ఛార్జీల భారం ఉండకూడదని తర్వీంద్ సింగ్ అన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో వ్యాపార, వర్తక సంఘాలు అక్టోబర్ 2న 'నో యూపీఐ డే'ను నిర్వహించ తలపెట్టడం ఈ సందర్భంగా గమనార్హం.

# నాలుగేండ్ల యుద్ధానికి సెటిల్‌మెంట్ సొల్యూషన్

(మొదటి పేజీ తరువాయి)

కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడి త్వరలో ఓ ఒప్పందానికి వస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో జెలెన్స్కీతో భేటీపై మీడియా వద్ద ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఇన్నేళ్లుగా పుతిన్, జెలెన్స్కీ సర్దుకుపోతూ వస్తున్నారు. త్వరలోనే వారు ఓ ఒప్పందానికి రావచ్చు. శీతాకాలానికి ముందే ఈ విషయంపై ప్రకటన వెలువడినా ఆశ్చర్యపోనక్కరలేదు.

ఎందుకంటే యుద్ధాన్ని ముగించాలని జెలెన్స్కీ బలంగా కోరుకుంటున్నారు' అని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు తమ దేశంపై రష్యా దురాక్రమణను అంతం చేయడానికి వైట్‌హౌస్ సాయం చేస్తోందని తాను విశ్వసిస్తున్నట్లు జెలెన్స్కీ పేర్కొన్నారు. ఆంక్షలు, వాణిజ్య పరిమితుల ద్వారా రష్యాకు వచ్చే ఆదాయాన్ని నిలిపివేయాలని.. తద్వారా యుద్ధాన్ని పొడిగించడానికి మాస్కోకు అవసరమైన డబ్బును అందకుండా చేయాలని ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేశారు.

**ఆగని పరస్పర దాడులు..**

యుద్ధం ముగింపు కోసం ఓ వైపు చర్చలు జరుపుతూనే మరోవైపు కీవ్, మాస్కో పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి.

శనివారం రాత్రి ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై రష్యా దాడులు చేయడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ కార్యాలయాలు, నివాస భవనాలు దెబ్బతినడంతో ఆస్తి నష్టం సంభవించింది. కీవ్‌లోని మొబైల్ ఇంటర్నెట్ సేవలు, స్టార్ లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్ల కోసం పనిచేసే ఓ డేటా సెంటర్ సైతం దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఉక్రెయిన్, రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు.. పారిశ్రామిక ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. ఈ డ్రోన్ దాడుల్లో ముగ్గురు మరణించగా.. పలువురు గాయపడ్డారు.

# నెలకు 30 రోజులు ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఈ మార్పుల వెనుక రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా కీలక పాత్ర పోషించారని చెప్పక తప్పదు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తాను ఈ విషయాన్ని మార్చి 11న పార్లమెంటులో ప్రస్తావించినట్లు ఆయన తెలిపారు. వినియోగదారులకు సౌకర్యవంతమైన, సరసమైన ఆప్షన్లు ఇవ్వాలని కోరానని, తన విజ్ఞప్తిని మన్నించి ఈ సమస్యను పరిష్కరించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయ్‌కు చద్దా కృతజ్ఞతలు సైతం తెలియజేశారు. గతంలో వాయిస్, ఎస్ఎంఎస్ ప్లాన్‌లపై నిబంధనలు తెచ్చినా, కంపెనీలు ఎక్కువ వ్యాలిడిటీ ఉన్న డేటా-బండిల్ ప్లాన్‌లనే ప్రోత్సహిస్తున్నాయని ట్రాయ్ గుర్తించింది. దీనివల్ల కేవలం వాయిస్ కాల్స్ కోసం మొబైల్ వాడే తక్కువ ఆదాయ వర్గాల వారు ఇబ్బంది పడుతున్నారని అభిప్రాయపడింది. వినియోగదారులకు వారి అవసరాలు, ఆర్థిక స్తోమతకు అనుగుణంగా రీఛార్జ్ చేసుకునే స్వేచ్ఛను కల్పించడమే ఈ కొత్త నిబంధనల లక్ష్యమని ట్రాయ్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 146 కోట్లా మంది ప్రీపెయిడ్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

# దశాబ్దాలుగా పెండింగులో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తులకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

జీవో నెం. 455, 456, 747, 92 కింద వచ్చిన పెండింగు యూఎల్‌సీ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే విధంగా ఆదివారం మెమో నెం.48062/ యూఎల్‌సీ/ఏ1/2026-1 జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. అర్హత కలిగిన కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి క్రమబద్ధీకరణ చర్యలు తక్షణం చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు శ్రీనివాస రెడ్డి చెప్పారు.

**2016లో జీవో..**

**అమలు మాత్రం శూన్యం**

అర్బన్ ల్యాండ్ సీలింగ్ సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 2016లో జీవో జారీ చేసినప్పటికీ, ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఏండ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు.

**22 ఏ సమస్యలకు**

**ఒక్కొక్కటిగా పరిష్కారం...**

ఈ నెల 16న శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్షన్ 22 ఏతో ముడిపడి ఉన్న 10-12 కీలక అంశాలను ఫాస్ట్ ట్రాక్ విధానంలో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే 22 ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం, ఆ తర్వాత జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ, ఆ వెంటనే జీవో76కు అనుగుణంగా మెమో ఇవ్వడం జరిగిందన్నారు. 22 ఏ లో ఉన్నప్పటికీ ఎఏఙ, ఏశ్రుఅ, ౄఖీఇ్క, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఉత్తరులు జారీ చేయడం జరిగిందన్నారు. తాజాగా దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న ఖౌఇ దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మిగిలిన అన్ని సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

**ప్రజల సమస్యల పరిష్కారమే**

**ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలన్నిటి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని, వారికి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రతి భూ సమస్యను పరిశీలించి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# నేటి నుంచి బ్యాంకులు బంద్

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు నేటి నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ఈ సమ్మె జరగనుంది. దీంతో బ్యాంకు బ్రాంచులలో అందించే పలు కీలక సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో పాటు పెన్షన్ ప్రయోజనాల్లో మార్పులు, ఇతర సర్వీస్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసమే 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' సమ్మెకు పిలుపునిచ్చింది. అయితే, ఈ సమ్మెలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రధానంగా పాల్గొంటున్నందున వాటిపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రైవేట్ రంగ బ్యాంకులపై ఈ ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉంది.

**నిలిచిపోయే సేవలు ఇవి..**

ఈ మూడు రోజుల సమ్మె వల్ల బ్యాంకు బ్రాంచులకు వెళ్లి చేసుకోవాల్సిన పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుంది.

ఇందులో ముఖ్యంగా బ్రాంచులలో నగదు డిపాజిట్లు, విత్ డ్రాలు, పాస్ బుక్ అప్డేట్, ప్రింటింగ్, చెక్ క్లియరింగ్, ఇతర చెక్ సంబంధిత లావాదేవీలలో జాప్యం, కొత్త డిమాండ్ డ్రాఫ్టులు (డీడీ) జారీ, కేవైసీ, అకౌంట్ వివరాల మార్పులు వంటి పనులు.. లోన్ దరఖాస్తులు, డాక్యుమెంటేషన్, వెరిఫికేషన్ ప్రక్రియ, బ్యాంక్ లాకర్ సేవలు నిలిచిపోనున్నాయి.

**యథావిధిగా పనిచేయనున్న సేవలు..**

బ్రాంచులలో ప్రత్యక్ష సేవలు నిలిచిపోయినా, డిజిటల్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని యూనియన్లు తెలిపాయి. యూపీఐ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ ద్వారా ఖాతాదారులు తమ లావాదేవీలను యథావిధిగా చేసుకోవచ్చు. అయితే, ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఏటీఎంలలో నగదు లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నగదు డిపాజిట్ మెషీన్లు కూడా పనిచేస్తాయి.

**ఆదివారం నో సెలవు.. పనిచేసిన బ్యాంకులు..**

ఇదిలాఉంటే, సమ్మె కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ అనుమతితో ఆదివారం కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను పనిచేయాలని ఆదేశించడంతో యథవిదిగా బ్యాంకులు పనిచేశాయి. దీంతో చాల మంది ఖాతాదారులు తమ అత్యవసర బ్యాంకు పనులను (నిన్న)ఆదివారమే పూర్తి చేసుకున్నారు.

# దసరా నాటికి సర్కారు చేతికి మెట్రో

(మొదటి పేజీ తరువాయి)

అసలు సమస్యగా ఉంది. మెట్రోరైలును స్వాధీనం చేసుకోవాలంటే.. బ్యాంకుల నుంచి ఎల్ అండ్ టీ తీసుకున్న రూ.13,600 కోట్ల రుణాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రుణాలపై సగటున ఏడెనిమిది శాతం దాకా వడ్డీ ఉన్నందున అంతకంటే తక్కువకే రుణాలు పొందగలిగితే భారం తగ్గుతుంది.ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్ సీ) వడ్డీరేటు 4 శాతం లోపే ఇచ్చేందుకు ముందుకొచ్చినా ఆఖరి నిమిషంలో రుణం ఆగిపోయింది. ఆ సంస్థ కొంత మొత్తం జపాన్ యెన్ల రూపంలో, మరికొంత మొత్తం రూపాయల్లో ఇచ్చేందుకు అప్పట్లో అంగీకరించింది. దీనివల్ల రెండూ కలిపి సగటు వడ్డీరేటు 4% లోపే ఉంటుంది. ఇదే తరహాలో తక్కువ వడ్డీకి అప్పులిచ్చే బ్యాంకుల కోసం ఎస్బీఐ క్యాప్స్ ప్రయత్నిస్తోంది. తాజాగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణం ఇచ్చేందుకు ముందుకొచ్చినా వడ్డీరేటు 7 శాతానికి పైనే చెబుతోంది.రుణ సమీకరణ యత్నాలు ఫలించకపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలేమిటని ప్రభుత్వం పరిశీలిస్తోంది. హెచ్ఎండీఏ నుంచి నిధులు సమకూర్చేందుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తోంది. ఐఆర్ఎఫ్ సీ రుణం కోసం కూడా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం రుణాలు విడుదల చేయాలని మెట్రో అధికారులు ఎప్పటికప్పుడు లేఖలు రాస్తూనే ఉన్నారు.

# ఒకటి కాదు రెండు సార్లు మొజ్తబాపై దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ వెల్లడించింది. ఫిబ్రవరిలో జరిగిన ఈ ఘటన గురించి ఇరాన్ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ సభ్యుడు మొహ్సెన్ హెయ్దరీ తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. తమ అగ్రనేతపై దాడి జరిగింది ఒకసారి మాత్రమే కాదని.. రెండు సార్లు అమెరికా ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. 'అలీ ఖమేనీ సహా కీలక నేతలు ఓ భవనంలో సమావేశమైన సమయంలో అమెరికా దాడులు చేసింది. ఈ ఘటనలో మాజీ సుప్రీం నేత ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మొజ్తబాను వైద్యం కోసం వెంటనే ఓ ఆస్పత్రికి తరలించాం. అనంతరం అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఆ ఆస్పత్రిపై కూడా విరుచుకుపడ్డారు. దీంతో అది పూర్తిగా ధ్వంసమయ్యింది. కొన్ని గంటల పాటు శ్రమించి మా బలగాలు శిథిలాల నుంచి మొజ్తబాను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను మరో సురక్షిత ప్రాంతానికి తరలించి చికిత్స అందించాం. బహిరంగంగా ప్రకటించే వరకు.. ఆయనను తదుపరి సుప్రీంగా ఎన్నుకున్న విషయం కూడా మొజ్తబాకు తెలియదు. తర్వాత దానిని ఆయన అంగీకరించక తప్పలేదు. ఇరాన్‌కు కొత్త నాయకుడిని ఎన్నుకోవడానికి నియమించిన కమిటీ నేతలను కూడా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యం చేసుకున్నాయి. వారు తరచూ సమావేశమయ్యే ఖోమ్ సెక్రటేరియట్‌పై దాడి చేశాయి. దీంతో వారిలో 8మంది ప్రాణాలు కోల్పోయారు. మొజ్తబాను సుప్రీం నేతగా ఎన్నుకోవడానికి రూపొందించిన నివేదికలు, సిఫార్సులు కాలి బూడిదయ్యాయి. అదే సమయంలో ఆయనను సుప్రీంగా ఎన్నుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. అయినప్పటికీ మొజ్తబానే దేశాన్ని ముందుకు నడిపించగలడని భావించి మా నాయకుడిగా ఎన్నుకున్నాం' అని మొహ్సెన్ హెయ్దరీ ఖతార్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

# పింక్ పవర్ రన్ 3.0

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:** హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డులో ఆదివారం పింక్ పవర్ రన్ 3.0 జరిగింది. మహిళల ఆరోగ్యం, ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించడంతో పాటు ముందస్తు ఆరోగ్య సంరక్షణ, ఫిట్ నెస్ పై చైతన్యం తీసుకురావడం కోసం ఈ రన్ నిర్వహించారు. ఎమ్ఈఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3కె, 5కె, 10కె, 20కె విభాగాల్లో నిర్వహించిన పరుగు పోటీల్లో 30 వేల మందికి పైగా పాల్గొన్నారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, మంత్రి సీతక్క, డీజీపీ సీవీ ఆనంద్, మాజీ మిస్ వరల్డ్ ఓపల్ సుచాత, నటుడు సిద్ధు జొన్నలగడ్డ, ఎమ్ఈఐఎల్ డైరెక్టర్ సుధా రెడ్డి తదితరులు హాజరయ్యారు.




# పెరగనున్న ధరలే ఫెస్టివల్ ఆఫర్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27:** పండుగల సీజన్లో వినియోగదారులకు గృహోపకరణాల ధరలు షాకివ్వనునానయి. అక్టోబర్ నుంచి ఏసీలు, టీవీ, తదితర ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలు 8 శాతం వరకు పెరగనున్నట్లు తెలుస్తోంది. దీనికి రాగి, స్టీల్ ధరల పెరుగుదల ప్రభావం కారణంగా చెబుతున్నారు. అక్టోబర్ 1 నుంచి ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్రిజ్జుల ధరలు 3% నుంచి 8% వరకు పెరిగే అవకాశం ఉంది. తర్జాతీయంగా రాగి, ఉక్కు, ప్లాస్టిక్ వంటి ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడమే ఈ ధరల పెంపునకు ప్రధాన కారణం. ముఖ్యంగా ఏసీల తయారీకి కీలకమైన రాగి ధరలు ఏకంగా 25-35శాతం వరకు పెరిగాయి.

అయితే, పాత స్టాక్ అందుబాటులో ఉన్నందున, దసరా, దీపావళి వరకు రిటైల్ ధరల్లో పెద్దగా మార్పు ఉండకపోయే అవకాశం ఉంది. కొత్త ధరలు దీపావళి పూర్తయిన తర్వాత పూర్తిగా అమల్లోకి వస్తాయి.

# సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ నిరసనకు వాంగ్ చుక్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుగా ఉంటానని సోనమ్ చెప్పారు. జీవితాంతం శాంతిమార్గంలో నడుచుకున్న మహాత్మ గాంధీ జన్మదినమైన అక్టోబర్ 2న నిర్వహించే నిరసన శాంతియుతంగా ఉంటుందన్నారు. గతంలో కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్కు వ్యతిరేకంగా సీజేపీ నిర్వహించిన నిరసనల్లో వాంగ్ చుక్ ప్రధాన పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

# పాక్ ఒక సీరియల్ ఉగ్రవాది

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంతో ప్రపంచానికి ప్రత్యక్ష సవాలుగా మారింది. అటువంటి ప్రభుత్వాలను జవాబుదారీ చేయాలని కోరుతున్నాం'' అని జైశంకర్ స్పష్టం చేశారు. సముద్ర నావికుల భద్రతకు భరోసా ఇవ్వాలని, అంతర్జాతీయ స్వేచ్ఛా నౌకా వాణిజ్యాన్ని పరిరక్షించాలని జైశంకర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## సహనం కోల్పోయిన మంత్రి..

# ప్రతిపక్ష ఎమ్మెల్యే సహాయకుడిపై దాడి

**ఢిల్లీ, సెప్టెంబర్ 27:** ఢిల్లీ ప్రజా పనుల శాఖ మంత్రి పర్వేశ్ వర్మ సహనం కోల్పోయారు. ప్రతిపక్ష ఆప్ ఎమ్మెల్యే జర్నాలి సింగ్ ఎదుటే.. ఆయన వ్యక్తిగత సహాయకుడి చెంప చెళ్లుమనిపించారు. ఈ ఘటన పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్లో చోటు చేసుకుంది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిలక్నగర్లో ఇటీవల రోడ్డు నిర్మించారు. అయితే, దీని నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ప్రజా పనుల శాఖ మంత్రిగా ఉన్న పర్వేశ్ వర్మ రోడ్డు తనిఖీ చేపట్టేందుకు వెళ్లారు. స్థానిక ఆప్ ఎమ్మెల్యే జర్నాలి సింగ్ కూడా ఆయనతో ఉన్నారు.

మంత్రి ఎదుటే.. ఎమ్మెల్యే జర్నాలి రోడ్డును చేత్తోనే తవ్వి ఓ పెళ్లను బయటకు తీశారు. 'చూశారా? మంత్రి గారూ.. మీరు ఎంత నాశిరకంగా రోడ్డు వేయించారో' అంటూ ఆయనకే చూపించారు. 'గత 15 ఏళ్లుగా మీరు అధికారంలో ఉన్నారు కదా.. అప్పుడు మీరు చేయలేని పని మేం చేశాం సంతోషించు' అని మంత్రి చెబుతుండగా.. 'అయితే.. కనీసం 15 రోజులైనా పూర్తవకుండానే చెడిపోయేంత నాశిరకంగా వేస్తారా?' అని ఎమ్మెల్యే ఎదురు ప్రశ్నించారు. ఆయన్ని సముదాయిస్తూ.. మంత్రి ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. రోడ్డు పెళ్లను చేత్తో పట్టుకొని ఎమ్మెల్యే ఆయన్ని అనుసరించారు. ఎదురుగా.. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు ఫోన్లో ఈ ఘటనను రికార్డు చేస్తున్నాడు. సహనం కోల్పోయిన మంత్రి ఫోన్ను పక్కకు నెట్టేసి.. అతడి చెంపపై కొట్టారు. అతడు కూడా మంత్రి మీదకి దూసుకెళ్లడంతో.. పోలీసు సిబ్బంది పక్కకి తీసుకెళ్లిపోయారు. అక్కడున్న ఆప్ నేతలు, కార్యకర్తలు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# మా క్యాంపస్‌ల్లోకి రాకండి

- **ఒరాకిల్ సహా 22 కంపెనీలకు హెచ్చరిక**
- **ప్రఖ్యాత సంస్థలకు ఐఐటీల నాన్ కోఆపరేషన్ షాక్**

**ఢిల్లీ, సెప్టెంబర్ 27:** మనదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) మా క్యాంపస్ లోకి అడుగు పెట్టవద్దంటూ ఒరాకిల్ తో సహా 22 కంపెనీలకు ఐఐటీలు అల్టిమేటం జారీ చేశాయి.

**ఆఫర్ లెటర్లు ఇస్తున్నయ్.. ఉద్యోగాలే ఇవ్వడం లేదు..**

ఐఐటీల నిర్ణయానికి తగిన కారణం లేకపోలేదు. 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన విద్యార్థులకు, ఆఫర్ లెటర్లు ఇచ్చినా.. ఉద్యోగాలివ్వడంలో ఆయా కంపెనీలు విఫలం కావడమే ఇందుకు కారణం.

అందుకే మరో రెండు ప్లేస్ మెంట్స్ సీజన్ల వరకు ఆయా కంపెనీలకు తాము సహకరించబోమని ఐఐటీలు కుండబద్దలు కొట్టాయి. సాధారణంగా ఇంజినీరింగ్ చివరి సంవత్సరం మధ్యలోనే కళాశాలల ప్రాంగణాల్లో కంపెనీలు ఎంపికలు జరిపి, ఆఫర్ లెటర్లు ఇస్తుంటాయి.

ఇప్పుడు కూడా ఈ ప్రక్రియకు కంపెనీలు సిద్ధమవుతున్న తరుణంలో ఐఐటీలు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.




**150 ఉద్యోగాలు ఇవ్వనందునే**

ఈ నెల మొదట్లో ఐఐటీ గువాహటిలో జరిగిన సమావేశంలో ఆల్ ఐఐటీస్ ప్లేస్మెంట్ కమిటీ (ఏఐపీసీ) ఈ నిర్ణయం తీసుకుంది. అన్ని ఐఐటీలకు కలిపి పేస్ మెంట్లు, ఇంటర్న్‌షిప్ కు బాధ్యత వహించే ఏఐపీసీ, ఈ నెలాఖరులో అధికారికంగా తమ నిర్ణయం గురించి ఆయా కంపెనీలకు లేఖలు రాయనుందని సమాచారం. అయితే 'బ్లాక్ లిస్టింగ్' అనడానికి బదులుగా, 'నాన్ కోఆపరేషన్' అని దీన్ని ఆ ఐఐటీలు వ్యవహరిస్తున్నాయి. 23 ఐఐటీల్లో 150కి పైగా ఉద్యోగ ఆఫర్ లెటర్లను ఈ కంపెనీలు, నెరవేర్చలేకపోవడమే ఇందుకు నేపథ్యం. కొన్ని కంపెనీలు 10-15 ఆఫర్లను ఉపసంహరించుకున్నట్లు ఏఐపీసీ కన్వీనర్ జాన్ జోస్ చెప్పినా, కంపెనీల పేర్లను వెల్లడించలేదు. క్యాంపస్ వర్గాల కథనం ప్రకారం, అందులో అమెరికాకు చెందిన ఒరాకిల్ కూడా ఉంది. ఈ కంపెనీ 40 ఉద్యోగ ఆఫర్లను గౌరవించడంలో విఫలమైందని సమాచారం. ఈ సంస్థ మనదేశంతో పాటు అంతర్జాతీయంగా వేలకొద్దీ లేఆఫ్ లను ప్రకటిస్తుండడం గమనార్హం. ప్రకటిస్తోంది. ఐఐటీల ఈ 'నాన్ కోఆపరేషన్' జాబితాలో పలు అంకురాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

**పోయిన సంవత్సరం కూడా..**

ఆఫర్ లెటర్లు ఇచ్చి, ఉద్యోగాలు ఇవ్వని కంపెనీలను నేరుగా ఆయా ఐఐటీలు గతేడాది సంప్రదించాయి. 10-11 కంపెనీలు ఉద్యోగాలివ్వడంలో విఫలమయ్యాయని, ఈ ఏడాది మరిన్ని ఎక్కువ కంపెనీలు ఆ బాట పట్టడంతో అన్ని ఐఐటీలూ కలిసి ఏఐపీసీ ద్వారా సంప్రదింపులు చేపట్టాయని జోస్ వివరించారు. ఉద్యోగాలు రాకుండా ఉన్న విద్యార్థుల సీవీలను ఇతర కంపెనీలకు పంపామని, అందులో 20-30% మందికి ఉద్యోగాలు రావొచ్చని జోస్ చెబుతున్నారు.

# కాలిబూడిదైన కారు

## శంషాబాద్ వద్ద కారులో చెలరేగిన మంటలు

## అప్రమత్తమై బయటకు దూకిన డ్రైవర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** శంషాబాద్ సమీపంలో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రయాణిస్తున్న ఓ కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదు. అయితే, కారు మాత్రం పూర్తిగా కాలి బూడిదైంది. ఏం జరిగింది? ఎలా జరిగింది? పూర్తీ వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారులో శంషాబాద్ వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంజిన్ భాగం నుంచి పొగలు రావడాన్ని డ్రైవర్ వెంటనే గమనించాడు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా కారును రోడ్డు పక్కకు ఆపి, వాహనం నుంచి కిందకు దిగిపోయాడు. కొన్ని క్షణాల్లోనే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడి కారును పూర్తిగా చుట్టుముట్టాయి.రహదారిపై వెళుతున్న ఇతర ప్రయాణికులు ఈ ఘటనను చూసి భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే, వారు వచ్చేసరికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఇంజిన్ వేడెక్కడం లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.





# సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

## సిరిసిల్ల పర్యటనకు ముందు ప్రశ్నల వర్షం

### 8 వేల ఎకరాల భూమి ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలె

### నేతన్నల బకాయిలు చెల్లించి, నిలిచిన పథకాలు పునరుద్ధరించాలని డిమాండ్

### కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తేదీలను ప్రకటించాలన్న బీఆర్ఎస్ నేత

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు.

**ఆ 8 వేల ఎకరాలు ఏది?**

'ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**బకాయిలు ఎప్పుడు చెల్లిస్తరు?**

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. 'నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి' అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

**అన్నదాత హామీ ఏమైంది?**

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. 'ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

**అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం**

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# శంకరన్న పాత్రపై కేటీఆర్ ప్రశంస

- 'ది ప్యారడైజ్' సినిమా చూసిన కేటీఆర్
- నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు అభినందనలు
- ప్రియదర్శి నటనకు ప్రత్యేక మెచ్చుకోలు
- 'రామన్న' ప్రేమకు రుణపడి ఉంటా : ప్రియదర్శి కృతజ్ఞతలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** నాని 'ప్యారడైజ్' సినిమాపై, అందులో ప్రియదర్శి నటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఈ అభినందనలకు ప్రియదర్శి కృతజ్ఞతలు తెలుపుతూ స్పందించారు. వీరిద్దరి మధ్య సోషల్ మీడియాలో జరిగిన ఈ సంభాషణ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' చిత్రాన్ని వీక్షించిన కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను పోలిన పాత్రలో నటించిన ప్రియదర్శికి కేటీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'చావు నోట్లో తల పెట్టయినా... మీకు గుర్తింపు తెస్తా!!' అనే డైలాగ్‌ను గుర్తుచేస్తూ.. 'ఆ డైలాగ్ చెప్పింది ఎవరో మీకు తెలుసు కదా' అని వ్యాఖ్యానించారు. 'ఆత్మగౌరవ పోరాటం, అణచివేతపై తిరుగుబాటు. అవసరమొస్తే గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారతాయని సందేశాన్నిచ్చిన తమ్ముడు శ్రీకాంత్ ఓదెలకు మనస్ఫూర్తిగా అభినందనలు. హీరో నాని తన మిత్రుడని, కథానాయకుడి పాత్రలో జీవించారని కొనియాడారు. తమ్ముడు ప్రియదర్శికి ప్రత్యేక అభినందనలు' అని కేటీఆర్ పోస్ట్ చేశారు. కేటీఆర్ ప్రశంసలపై ప్రియదర్శి స్పందిస్తూ.. 'పెళ్లిచూపుల నుంచి ప్యారడైజ్ వరకు నా సినిమాలపై మీరు చూపిస్తున్న ప్రేమకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీకు నేను రుణపడి ఉంటాను రామన్నా' అని బదులిచ్చారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో ప్రియదర్శి 'ఎమ్మెల్యే శంకరన్న' పాత్రను పోషించారు. ఈ పాత్ర ఆహార్యం, హావభావాలు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలి ఉన్నాయంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అయితే, ఇది తెలంగాణలో తన అనుభవాల ఆధారంగా అల్లుకున్న కల్పిత కథ అని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల గతంలోనే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శంకరన్న పాత్రను కేటీఆర్ ప్రత్యేకంగా మెచ్చుకోవడం సినిమాపై రాజకీయ చర్చను మరింత పెంచింది.అయితే, సినిమాలో మాజీ సీఎం కేసీఆర్‌ను పోలిన పాత్ర ఉండటంతో విడుదలకు ముందే బీఆర్ఎస్ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే.

# కేదార్ నాథ్‌లో విరిగిపడిన కొండచరియలు

## చిక్కుకుపోయిన తెలుగు యాత్రికులు



**డెహ్రాడూన్, సెప్టెంబర్ 27 :** కేదార్ నాథ్ సమీపంలోని గౌరీకుండ్ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా పెద్ద ఎత్తున మట్టి పెళ్లలు పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 10వేల మందికిపైగా యాత్రికులు అక్కడ చిక్కుకున్నట్లు సమాచారం. వారిలో 40 మంది తెలుగు యాత్రికులు ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు హైదరాబాద్ నుంచి వెళ్లిన వారు కూడా ఉన్నారు. చిక్కుకున్న వారిలో తూర్పుగోదావరి జిల్లా రాయవరానికి చెందిన పీవీ కృష్ణారెడ్డి ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వాహనాల్లోనే వేచి చూస్తున్నట్లు ఆయన తెలిపారు. రాకపోకలు పునరుద్ధరించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు చెప్పారు.

# దేశంలోని పోలీసు స్టేషన్లన్నీ అనుసంధానం

### మెరుగుపడనున్న పోలీసింగ్

### తుదిదశకు సీసీటీఎన్ఎస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మెరుగైన పోలీసింగ్ అందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్)తో ఇది సాధ్యమైంది. 15 ఏళ్ల క్రితమే ఈ వ్యవస్థకు అంకురార్పణ జరిగినా రకరకాల కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడం, రాష్ట్రంలో డీజీపీ సీవీ ఆనంద్ క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తుండటంతో తుదిదశకు చేరుకుంది. కృత్రిమ మేధ సాంకేతికతను వాడుతుండటం సీసీటీఎన్ఎస్ పనితీరును మరింత మెరుగుపరుస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న 17 వేలకుపైగా పోలీసు స్టేషన్లను అనుసంధానం చేయడం సీసీటీఎన్ఎస్ ముఖ్య ఉద్దేశం. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో దీన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో సీసీటీఎన్ఎస్-2 పేరుతో కొత్త హంగులు అద్దుతున్నారు.

దేశవ్యాప్తంగా వేల మంది నేరస్థుల వేలిముద్రలు ఇందులో పొందుపరుస్తారు. తద్వారా నేరాలు, నేరస్థులకు సంబంధించిన సమాచారం చిటికెలో పొందే వీలుంటుంది. నేరం జరిగినప్పటి నుంచి దర్యాప్తు పూర్తి చేసి న్యాయవిచారణ వరకూ సమస్త సమాచారాన్ని అవసరమైన వారందరికీ తక్షణమే అందేలా చూడటం దీని ముఖ్య ఉద్దేశం. ఈ సమాచారాన్ని పోలీసులు తమ ఫోన్లోనే చూసుకోవచ్చు. పట్టుబడ్డ అనుమానితులు, నిందితుల వేలిముద్రలు లేదా పేరు, ఆధార్ నంబర్, ఫొటో వంటివి సీసీటీఎన్ఎస్లో నమోదు చేస్తే... దేశవ్యాప్తంగా అతడిపై ఎక్కడెక్కడ, ఎలాంటి కేసులు ఉన్నాయో క్షణాల్లో తెలుస్తాయి. అన్ని కేసుల గుట్టు వీడుతుంది. ఇక కనిపించకుండా పోయిన వారి పేరు, ఫొటో, ఇతర వివరాలు ఈ నెట్వర్క్ లో నమోదుచేస్తే... గుర్తు తెలియని మృతదేహాలతో ఈ వివరాలను పోలుస్తుంది. ఎక్కడైనా పోలీసులకు దొరికితే ఆ వెంటనే ఫిర్యాదు నమోదు చేసిన స్టేషన్ కు సందేశం వస్తుంది. చోరీ అయిన వాహనాలను పట్టుకోవడానికీ ఇలానే ఉపయోగపడుతుంది. ఈ నెట్వర్క్ వల్ల పోలీసు సిబ్బందిపై పనిభారమూ తగ్గనుంది. నేరం జరిగిన చోటు నుంచే దర్యాప్తు అధికారి ఫొటోలు, వీడియోలు, సాక్షుల వివరాలు అప్లోడ్ చేయొచ్చు. దర్యాప్తులోని ప్రతి దశను పర్యవేక్షణ అధికారులు చూసి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. ఫోరెన్సిక్ ల్యాబొరేటరీకీ అనుసంధానమై ఉండడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

## అక్టోబరు 12 నుంచి తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**తిరుపతి, సెప్టెంబర్ 27 :** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం మూడేండ్లకోసారి అధికమాసం వస్తుంది.

ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుంచి 9 గంటల వరకు, గరుడవాహనసేవ రాత్రి 6.30 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుంది.

# బీజేపీ.. ఓటు చోరీతో పాటు ప్రజలను మోసమూ చేసింది

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం



**సూర్యాపేట, సెప్టెంబర్ 27 :** బీజేపీ ఓటు చోరీ చేసి ప్రజలను మోసం చేసిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని దేశం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు. నిస్సందేహంగా రాహుల్ ప్రధాని కానున్నారని చెప్పుకొచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి ఉత్తమ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పేదలకు మంచి క్వాలిటీ సన్నబియ్యాన్ని తాము అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో దేనికి పనికిరాని దొడ్డు బియ్యం అందించారని.. వాటిని అందరూ అమ్ముకునేవారని అన్నారు. దేశంలో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉందని.. కానీ ఎక్కడ లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యాన్ని కాంగ్రెస్ మాత్రమే అందిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 90 శాతం మంది పేదలు సన్నబియ్యం తింటున్నారని చెప్పుకొచ్చారు.

**బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు..**

బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఎందుకు ఇవ్వలేదని మంత్రి ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లాలో మూడు లక్షలపై చిలుకు కొత్త కార్డులు అందిస్తున్నామని స్పష్టం చేశారు. పది లక్షల మంది సన్నబియ్యం తీసుకుంటున్నారని వెల్లడించారు. ఈ నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తవి లక్ష పైచిలుకు కార్డులు అందించామని తెలిపారు. దీని ద్వారా మూడు లక్షల మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

# 20 ఏండ్లకైనా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు

## ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** తెలంగాణ అస్తిత్వం అంటే అమరవీరులు మాత్రమేనని, కేసీఆర్ కాదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్ వేదికగా ఆయన బీఆర్ఎస్ పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. చావు నోట్లో కేసీఆర్ తలకాయ పెడితే తెలంగాణ వచ్చిందనేది అబద్ధమని చెప్పారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ ఎక్కడ తలకాయ పెట్టినా ఉపయోగం ఉండదని విమర్శించారు. తెలంగాణ అంటే తామే అన్న కల్వకుంట్ల కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి పాతాళానికి తొక్కారన్నారు. అలాగే ఈ సెప్టెంబర్లోనే రేవంత్ అడుగు సిరిసిల్లలో పడబోతోందని తెలిపారు. బంధువులు, అనుచరులతో కేసీఆర్ నిర్మించుకుంటున్న సామ్రాజ్యాన్ని బద్దలు కొట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ కేటీఆర్ ను కూడా తీవ్రంగా విమర్శించారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తానని చెప్పి.. కేటీఆర్ తెలంగాణ ద్రోహిగా మారారని ధ్వజమెత్తారు. 'కేటీఆర్ మమ్మల్ని బెదిరిస్తావా..? ముందు నీ భవిష్యత్తు చూసుకో. రెండేండ్లే కాదు ఇరవై ఏండ్ల తరువాత కూడా మీ పార్టీ అధికారంలోకి రాదు'అంటూ ఆయన ఫైరయ్యారు. బీఆర్ఎస్ నాయకులు అవినీతితో సంపాదించిన డబ్బుతో విష ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో దళితుణ్ని సీఎం చేస్తానన్న కేసీఆర్.. గెలిచిన తరువాత ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దళితులకు భూమి ఇవ్వకపోగా.. వారికి ఇందిరమ్మ ఇచ్చిన భూములను బీఆర్ఎస్ నేతలు లాక్కున్నారని మండిపడ్డారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు, ప్రభుత్వ భూములు.. ఇలా వేటినీ వదలకుండా బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించారని ఆయన ఆరోపించారు. అలాంటి కోట్ల రూపాయల విలువ చేసే భూములను హైడ్రా విముక్తి చేసిందని చెప్పారు. భూములను ఆక్రమించుకున్న తెలంగాణ ద్రోహులను కేసీఆర్ పక్కన పెట్టుకుని తిరుగుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# దీప్తిరెడ్డి కుటుంబానికి సజ్జనార్ ప్రశంసలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** మహిళా సాధికారతే లక్ష్యంగా స్వచ్ఛంద సంస్థలను స్థాపించి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన యువ మహిళా పారిశ్రామికవేత్త మడుగుల దీప్తిరెడ్డి బ్రెయిన్ డెడ్ కావడం అత్యంత బాధాకరమని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. పుట్టెడు దుఃఖంలోనూ ఆమె కుటుంబం తీసుకున్న నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'తీవ్ర విషాదంలోనూ మానవత్వాన్ని చాటుతూ ఆమె భర్త, సినీ దర్శకుడు ప్రదీప్ రెడ్డి తీసుకున్న మహోన్నత నిర్ణయంతో.. దీప్తిరెడ్డి గుండె, కాలేయం, రెండు కిడ్నీలను అవయవదానం చేశారు. ఫలితంగా మృత్యువు అంచున ఉన్న నలుగురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. దీప్తిరెడ్డి భౌతికంగా మనల్ని వీడినా.. నలుగురి ప్రాణ దానం చేసి సజీవంగా నిలిచారు. ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్న వారి కుటుంబ సభ్యుల ఔదార్యం గొప్పది. మరణం తర్వాత కూడా జీవించేందుకు అవయవదానాన్ని మించిన మార్గం లేదు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలి. విలువైన ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని కోరుతున్నా' అని సజ్జనార్ పోస్టు చేశారు.



సినీ దర్శకుడు ప్రదీప్ సతీమణి దీప్తి రెడ్డి మాడుగుల (42) బ్రెయిన్ స్ట్రోక్ తో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. ప్రదీప్ మాడుగుల.. అద్వైతం, బిల్లా రంగా, ఛాంపియన్ చిత్రాలకు దర్శకుడిగా పనిచేశారు. ఆయన సతీమణి దీప్తిరెడ్డి పలు సేవా సంస్థల వ్యవస్థాపకురాలిగా, పర్యావరణ అనుకూల వ్యాపారాల ద్వారా గుర్తింపు పొందారు.

# మణికొండలో చెడ్డీ గ్యాంగ్ కలకలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధి మణికొండ ప్రాంతంలో చెడ్డీ గ్యాంగ్ సంచారం కలకలం రేపింది. నెక్నాంపూర్ లోని ఫ్లోటిల్లా అపార్ట్మెంట్ వెనుక చెరువు వైపున ఉన్న ఫెన్సింగును కత్తిరించి.. సుమారు ఆరుగురు దొంగలు లోపలికి చొరబడ్డారు. సీ బ్లాక్ లోని మెట్ల మార్గం ద్వారా ఓ ఫ్లాట్లోకి వెళ్లి విలువైన వస్తువులను అపహరించారు. అదే సమయంలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించిన అపార్ట్మెంట్లోని ఓ వ్యక్తి వారిని ప్రశ్నించగా.. దురుసుగా ప్రవర్తించి ఆయుధాలతో దాడికి యత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ.. నిందితుల కదలికలను గుర్తించే పనిలో ఉన్నారు. నెక్నాంపూర్, అల్కాపూర్ టౌన్షిప్ పరిసరాల్లో రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఢిల్లీలో 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం

- ఎంపీ మల్లు రవి

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 :** దేశ రాజధానిలో ఈ నెల 29న దళిత, ఆదివాసీ ఆత్మాభిమాన సమావేశం నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి తెలిపారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ భేటీలో దళిత, ఆదివాసీల సమస్యలు, హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాలపై చర్చించనున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు మల్లు రవి తెలిపారు. అలాగే కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఇటీవల ఉత్తరాఖండ్లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జరిగిన అవమానకర ఘటనపైనా చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'ఖర్గేను అవమానించడం అంటే యావత్ దళిత వర్గాన్ని అవమానించడమే' అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, సామాజిక వివక్ష, వారి రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఎంపీ రవి తెలిపారు. అలాగే ఆయా అంశాలకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కోరనున్నట్లు ఎంపీ మల్లు రవి వెల్లడించారు.

# 29న నెల్లూరుజిల్లాకు సీఎం, డిప్యూటీ సీఎం

- పల్లెల్లో అభివృద్ధి వెలుగులు
- పల్లె పండుగ 3.0 కార్యక్రమం ప్రారంభం
- గ్రామాల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయింపు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. 29న నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీరి పర్యటనతో రామాపురంలో సందడి వాతావరణం నెలకొంది.



**అమరావతి, సెప్టెంబర్,27,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 29న ఎన్టీఆర్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొననున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 29వ తేదీన ఉదయం 10:20 గంటలకు విజయవాడ స్వరాజ్ మైదాన్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో జరిగే 'మిషన్ కర్మయోగి' ప్రాంతీయ వర్క్‌షాప్‌కు హాజరవుతారు.

రాష్ట్రంలోని పల్లెల రూపురేఖలను సమూలంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల భారీ బడ్జెట్ను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, పారిశుధ్యం మెరుగుపరచడం, తాగునీటి సౌకర్యం, రహదారుల నిర్మాణం వంటి కీలక పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ గ్రాంట్లు, గ్రామీణాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభా ప్రాంగణం, భద్రతా చర్యలు, పార్కింగ్ సౌకర్యాలను నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్ స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పర్యటన షెడ్యూల్...

29వ తేదీన మధ్యాహ్నం 1:15 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్లో నెల్లూరు జిల్లాకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2:15 గంటలకు వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలోని హెలిప్యాడ్కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:35 గంటలకు కాకొల్లువారిపల్లిలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలిస్తారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో కలిసి 'శ్రమదానం' కార్యక్రమానికి హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3:05 నుంచి సాయంత్రం 5:20 వరకు రామాపురంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5:30 గంటలకు రామాపురం నుంచి హెలికాప్టర్లో తిరుగు ప్రయాణమై.. 6:30 గంటలకు ఉండవల్లి నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకోనున్నారు.

## స్వయం కృతపరాధం

ఈ మధ్య కాలంలో ఎందుకో?
ఎదురు గాలి బలంగా వీస్తుంది
వ్యతిరేక దిశలో వ్యాపిస్తుంది!
బలమైన స్వరాన్ని
బలవంతంగా మూస్తుంది
కనిపించే నిజాన్ని కళ్ళకు
గంతలు కట్టి దాస్తుంది!
ప్రతి ఘటించే వారిపై ప్రతీ
కారచర్యకు దిగుతుంది
అహంకారంతో రగిలిపోతు
అణిచివేతలకు గురిచేస్తుంది!

నీతి లేని పాలనతో ప్రజలను
పాలిస్తూ మోసం చేస్తుంది
నిరుపేదలను నీరు గార్చేలా
పరిపాలనతో పీడిస్తుంది!
రైతుల ఉసురు తీస్తు కొత్త విధి
విధానాలకు ఊతం ఇస్తుంది
వాడి వేడి వాదనలతో
భీభత్సవం సృష్టిస్తుంది!
ధీటైనా మాటలతో మైకులను బద్దలు
కొట్టి నేల కేసి విసిరి కొడుతుంది
ప్రజాస్వామ్య బద్ధంగా నడవకుండా
నోటికోచ్చినట్టు వాగుతుంది!
అనైతికమైన పనులకు ఒడిగడుతు
మాటలతో యుద్ధం చేస్తు వాగ్వివాదం
పెంచుతోంది!
అసంతృప్తి జ్వాలాలు పెరిగేకొద్ది ప్రజల
నుండి వచ్చే వ్యతిరేకతను తట్టుకోలేక
భయంతో పరుగులు తీస్తూ
తోక ముడిచి పారిపోతుంది!

యువత సృష్టించిన సునామికి తట్టుకోలేక
ఖంగుతిని కళ్ళు తేలేస్తూ విస్తు పోయి చూస్తుంది!
స్వయంకృతపరాదాన్ని అంగీకరిస్తూ స్మశాన
వైరాగ్యాన్ని అనుభవిస్తుంది!!

**-ఎస్. జవేరియా**
9849931255

# విశ్వ నరుడు గుర్రం జాషువా



ఒక అంటరాని వాడు, హిందూగ్రంథాలు, కావ్యాలు చదువుతున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడై వుండి హిందూ నాటకాలు రాసి హిందూమత ప్రచారానికి తోడ్పడుతున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైనాడు జాషువా. ఒక వంక దార్రిద్యం, మరోవంక కుల మత వివక్ష. బాల్యంనుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవ హేళనల్ని, ఛీత్కారాలను ఎదుర్కొన్నాడు. చిన్నతనం నుంచే తిరగబడే తత్త్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశ నుంచే వ్యంగ చిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం, లలితకళల పట్ల ఆసక్తి పెంచు కొన్నాడు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరి కొందరు జాషువాను కులం పేరుతో తీవ్రంగా అవమానించారు. జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కులం తెలుసుకొని అవమానించినా, ఆవేదనకు లోనైనా, నిరుత్సాహ పడక, 'కళకు కుల మతాలున్నాయా?' అని ప్రశ్నిస్తూ, ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు. 'విశ్వనరుడ నేను' అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటాడు. పుట్టుకతో దళితుడైనా, పట్టుదలతో కవిశేఖరుడై, నవ యుగ కవిచక్రవర్తి, కవితా ప్రతిభతో తెలుగు సాహితీ లోకంలో ప్రజ్వరిల్లిన తేజోమూర్తి జాషువా. సమకాలీన కవిత్వ ఒరవడి యైన భావ కవిత్వపు రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడు. జాషువా 1895, సెప్టెంబర్ 28 న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించాడు. మూఢాచారాలతో నిండిన నాటి సమాజంలో అవమానాలకు లోనైనాడు. అయినా జాషువా ఊరుకొనే వాడు కాదు, తిరగ బడేవాడు. అగ్రవర్ణాల పిల్లలు కులం పేరుతో హేళన చేస్తే, తిరగబడి వాళ్ళను కొట్టాడు. 1910లో మేరీని పెళ్ళి చేసుకున్నాడు. అయినా ఆయన కుటుంబాన్ని క్రైస్తవ సమాజం నుండి బహిష్కరించారు. మిషనరీ పాఠశాలలో నెలకు మూడు రూపాయల జీతంపై ఉద్యోగం చేసేవాడు. తర్వాత రాజమండ్రి వెళ్ళి 1915-16 లలో అక్కడ సినిమా వాచకుడిగా పని చేసాడు. తరువాత గుంటూరులోని లూథరన్ చర్చి నడుపుతున్న ఉపాధ్యాయ శిక్షణాలయంలో ఉపాధ్యాయుడిగా 10 సంవత్సరాల పాటు పనిచేసాడు. తరువాత 1928 నుండి 1942 వరకు గుంటూరు లోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసాడు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పనిచేసాడు. 1957-59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేసాడు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బాల్య స్నేహితుడూ, రచయితా అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సాహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్ఛాస్త్రి వద్ద మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నాడు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసాడు. వాటిలో ప్రముఖ మైనవి. క్రీస్తుచరిత్ర, గబ్బిలం, పిరదౌసి, రుక్మిణీ కళ్యాణం, శ్మశానవాటిక, వివేకానంద, జేబున్నీసా, నాగార్జునసాగరం, కాందిశీకుడు.'నా కథ'పేరుతో ఆత్మకథను కూడా రాసుకున్నారు. కళకు కులమతాలున్నాయా? అంటూ జాషువా ప్రశ్నిస్తూ.. 'నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి భళీభళీ.. యన్నవారే, మీదేకుల మన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో బాకున గ్రుమ్మినట్లగున్ పార్థివ చంద్ర! వచింప సిగ్గగన్!' అంటూ వెంకటగిరి రాజా గారికి తన ఆవేదన చెప్పుకున్నాడు. 'కుల మతాలు గీచుకున్న గీతలు జొచ్చి పంజరాన గట్టు వడను నేను నిఖిలలోక మెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను' అంటూ నిటారుగా నిలుచున్నాడు. కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడ్డాడు. జాషువా, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడు. అగ్రవర్ణ దురహంకారాలను చవి చూసిన జాషువా సౌమ్య పదజాలం తోనే వాటిని ఎదిరించాడు. ఓ సందర్భంలో ఆయనే చెప్పినట్లు 'నాకు గురువులు ఇద్దరు... పేదరికం, కులమత బేధం. ఒకటి సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది. ఆయన కవిగా, వ్యక్తిగా విరాట్రూప ప్రదర్శనకు నేపథ్యాలు. ఆయన క్రమంగా ఆయన నాస్తికత్వం వైపు జరిగాడు. ఆయన మనోభావాన్ని దళిత యువకుడి ద్వారా చక్కగా చెప్పాడు. 'వాని నుద్ధరించు భగవంతుడే లేడు, మనుజెడెట్లు వాని గనికరించు, వాడు జేసికొన్న పాప కారణ మేమో యింత వరకు వాని కెరుకలేదు.'ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి యినుపగజ్జెల తల్లి జీవనము సేయు, గసరి బుసకొట్టు నాతని గాలిసోక నాల్గు పడగల హైందవ నాగరాజు'. ఇలా చెప్పుకుంటూ పోతే, ప్రతి పద్యాన్ని ఉదహరించవచ్చు. 'సుకవి జీవించు ప్రజల నాల్కల యందు' అనే ఈ పద్యంలో కవిలోకానికి జాషువా సముచిత స్థానం కల్పించాడు. తిరుపతి వెంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి, జాషువా కాలికి గండ పెండేరం తొడిగి 'ఈ కవీశ్వరుని పాదం తాకి నా జన్మధన్యం చేసుకున్నాను' అన్నాడు. అది తనకు లభించిన 'అత్యున్నత పురస్కారం' గా జాషువా భావించాడు. 1964లో క్రీస్తు చరిత్రకు 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' లభించింది. అనంతర కాలంలో ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యునిగా నియమితుడయ్యాడు. 1970లో ఆంధ్ర విశ్వ విద్యాలయము కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. భారత ప్రభుత్వము పద్మభూషణ పురస్కారం అందజేసింది.

విశ్వనాథ సత్యనారాయణ... జాషువా ఒక మధుర కవి అని, ఒకానొక మాధుర్యం ఆయన కవిత్వంలో శారదాదేవి అను గ్రహం చేత లభించిందని అన్నాడు. ఆయన వ్రాసిన శిశువు (పాపాయి) అనే ఖండికను ఘంటసాల గానం చేశారు. ఈ సందర్భంలో ఈ పాట రికార్డింగ్ జరిగే సమయంలో జాషువా, ఘంటసాల యింటికి వెళ్ళి, బయట అరుగు మీద కూర్చు న్నారట. ఘంటసాల బయటకువచ్చి, 'ఏమిటండీ! బయ టనే కూర్చున్నారు' అని అడిగితే, 'నేను అంటరాని కులమునకు చెందిన వాడను, మీరు బ్రాహ్మణులు, మీ అనుమతి లేకుండా లోపలి ఎలా రాగలను?' అన్నారట జాషువా. అందుకు, ఘంటసాల 'నాకు అటువంటి పట్టింపులు లేవు, మీరు స్వేచ్ఛగా లోపలి రావచ్చు. పైగా మీరు సరస్వతీ పుత్రులు. మీరు అంటరాని వారైతే, సరస్వతీ దేవి కూడా అంటరానిదనే కదా అర్థం!' అని చెప్పియింటి లోకి సాదరంగా ఆహ్వానించాడు ఘంటసాల. కవితా విశారద, కవికోకిల, కవి దిగ్గజ.. నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధు డయ్యాడు. 'వడగాల్పు నా జీవితమైతే, వెన్నెల నా కవిత్వం' అని జాషువా అన్నది అక్షర సత్యం. 'రాజు మరణించె నొక తార రాలిపోయె, సుకవి మరణించె నొక తార గగనమెక్కె, రాజు జీవించు రాతి విగ్రహముల యందు, సుకవి జీవించు ప్రజల నాల్కల యందు'.

'సత్కవీంద్రుని కమ్మని కలము, నిప్పులలోన గఱగిపోయె ! యిచ్చోట.. నే భూమి లేలు రాజన్యుని యధికార ముద్రిక లంత రించె! యిచ్చోట.. నే లేత యిల్లాలి నల్లపూసల సౌరు, గంగలో గలిసిపోయె! యిచ్చోట.. నెట్టి పేరెన్నికం గనుగొన్న చిత్ర లేఖకుని కుంచియ, నశించె! ఇది పిశాచులతో నిటాలేక్షణుండు గజ్జె గదలించి యాడు రంగస్థలంబు.. ఇది మరణ దూత తీక్ష ణమౌ దృష్టు లొలయ నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు'.. స్మశానవాటికలోని ప్రతిపద్యం మన గుండెలను పిండుతుంది.
'చిక్కిన కాసుచేఁ దనివిఁ జెందు నమాయికుఁ డెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మరచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కఁడు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై' నాడు.
'ముప్పుఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండఁగాఁ!
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ! భరతావని వీని సేవకున్!' ఈ నరుడు సేవలకు భారతావని ఈ నాటికి కూడా అప్పు పడ్డది.

**సెప్టెంబర్ 28... కవి కోకిల జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# జ్ఞానాన్వేషణలో సిద్ధార్థుడు

## దమ్మయాత్ర .. 4

అనోమా నదిని దాటి సన్యాసిగా మారిన సిద్ధార్థుడు దగ్గరలోని అనుపియా మామిడి తోటలో ఒక వారం రోజులున్నాడు. ఇది మల్ల రాజ్య సరిహద్దులో ఉంది. ఇక్కడ సన్యాసిగా ఎలా ఉండాలో ఆయన అలవాటు చేసుకున్నాడు. మా బృందం ఈ మామిడి తోటను దర్శించుకుంది. ప్రస్తుతం ఇది ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉంది.

సిద్ధార్థుడు ఏడు రోజుల తర్వాత కాలినడకన రాజగృహ(రాజ్‌గిర్) కు బయలుదేరాడు. రాజ్‌గిర్‌లో భిక్షాటన చేస్తుంటే ప్రజలు ఆయన అందమైన, దృఢకాయాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. ఆ వార్త బింబిసార మహారాజుకు తెలిసింది. రాజు వచ్చి పాండవ పర్వతం దగ్గర ఉన్న సిద్ధార్థుడిని కలిసి 'ఇంత చిన్న వయసులో సన్యాసం వద్దు, నా రాజ్యంలో సగం ఇస్తాను తీసుకో..' అన్నాడట. అప్పుడు సిద్ధార్థుడు..'నేను శాక్యవంశ యువరాజును. జ్ఞానాన్వేషణకొరకు బయలుదేరాను' అన్నాడు. రాజు కోరిక మేరకు జ్ఞానోదయం పొందిన తర్వాత రాజ్‌గిర్‌కు తిరిగి వస్తానని మాట ఇచ్చి సిద్ధార్థుడు వైశాలి వైపుగా నడక సాగించాడు.

వైశాలిలో అతనికి ఆళార కాలాముడి పరిచయం కలిగింది.

అతడు ప్రసిద్ధ సాంఖ్య శాస్త్ర తత్వవేత్త, శ్రమణుడు. అంటే స్వయంగా సత్యాన్ని అన్వేషించే వాడు. ఆ కాలంలో అత్యంత గొప్ప ధ్యాన గురువు. అతడి ధ్యాన శక్తి ఎంత గొప్పదంటే.. ఒకసారి ధ్యానంలో ఉండగా పక్క నుంచి ఐదువందల బళ్ళ కాన్వాయ్ శబ్దం చేసుకుంటూ వెళ్ళినా అతనికి వినిపించలేదట. బుద్ధుడు తర్వాత తన శిష్యులకు ఈ కథ చెప్పేవాడు. అక్కడ బుద్ధుడు తన మొదటి గురువు ఆళార కాలాముడి వద్ద కొన్ని నెలలు ధ్యానంలోని ఏడవ ధ్యాన స్థితిని నేర్చుకున్నాడు. దీనిని బౌద్ధ పరిభాషలో 'ఆకించ నాయతనం' అంటారు. అంటే ఏమీ లేని శూన్య స్థితి. సిద్ధార్థుడు స్ఫురద్రూపి కావడం దీనిని తక్కువ రోజుల్లోనే నేర్చుకున్నాడు. ఆళారుడు ఆశ్చర్యపోయి, తన సంఘంలో తనతో సహ గురువుగా

ఉండమని కోరాడు. కానీ బుద్ధుడికి శూన్యస్థితి ఎంత ప్రశాంతంగా ఉన్నా, అది తాత్కాలికమే. ధ్యానం నుండి బయటకు రాగానే మళ్ళీ కోరికలు, దుఃఖం చుట్టుముడతాయి. కాబట్టి దానిని సున్నితంగా తిరస్కరించి మరింత లోతైన జ్ఞానాన్వేషణ దిశగా బయలుదేరాడు.






సిద్ధార్థుడు తిరిగి రాజ్‌గిర్ చేరుకున్నాడు. అక్కడ ఉద్ధకరామ పుత్రుడు కలిసాడు. ఈయన రాముడు అనే మహర్షికి ముఖ్య శిష్యుడు. గురువు మరణానంతరం అతని ఆశ్రమాన్ని ఉద్ధకుడు నిర్వహించేవాడు. రాజ్‌గిర్ దగ్గర అడవిలో ఉన్న ఆ ఆశ్రమంలో అప్పట్లో ఏడువందల మంది శిష్యులు ఉండేవారట.

సిద్ధార్థునికి ఆళార కాలాముడి ధ్యానంలో ఏడో స్థితి నేర్పితే, ఉద్ధక రామపుత్రుడు ఇంకా పై స్థాయి అయిన ఎనిమిదవ ధ్యాన స్థితిని నేర్పించాడు. బౌద్ధ గ్రంథాలననుసరించి దాని పేరు 'నేవా సన్నానా ఆయతనా'. అంటే సంజ్ఞ ఉంది అనడానికి, లేదు అనడానికి ఉండే స్థితి. ఇది మామూలు మనిషి ఊహించలేని స్థితి. మనసులో ఆలోచన ఉందో లేదో కూడా తెలియనంత సూక్ష్మమైన సమాధి స్థితి. దాదాపు అచేతనకు దగ్గరి స్థితి. సిద్ధార్థుడు దీనిని కూడా తొందరగా నేర్చుకున్నాడు. అయితే ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే ఉద్ధకుడు కూడా ఈ స్థితిని పూర్తిగా పొందలేదు. అతని గురువైన రాముడు మాత్రమే ఈ స్థితిని పొందాడు. అది గ్రహించిన ఉద్ధకుడు సిద్ధార్థునికి ఏడువందల శిష్యులతో పాటు తన గురు పీఠాన్ని అప్పగించడానికి పూనుకున్నాడు. ఆళారుడు సహ గురుస్థానమిస్తే, ఉద్ధకుడు తన గురువు స్థానాన్ని ఇచ్చాడు. అయితే సిద్ధార్థుడు మాత్రం దానిని స్వీకరించడానికి సిద్ధంగా లేడు. ఈ జ్ఞాతాజ్ఞాత స్థితి మరింత ప్రశాంతంగా ఉంది, కానీ జనన మరణ చక్రంనుండి విముక్తి కాదని, ఆ స్థితి నుంచి బయటకు రాగానే మళ్ళీ దుఃఖం మొదలవుతుందని, కాబట్టి ఇది కూడా అశాశ్వతమని భావించి, వినయంగా గురుపీఠాన్ని తిరస్కరించి, తన జ్ఞానార్జన నిమిత్తం ఉరువేల వైపుగా నడకను కొనసాగించాడు.

ప్రాచీన కాలంలో ప్రస్తుత బోధ్ గయ దాని చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతాన్ని 'ఉరువేల' అని పిలిచేవారు. బుద్ధుడి కాలంలో ఇది నిరంజన లేదా ఫల్గు నది ఒడ్డున ఉన్న అందమైన గ్రామం. బుద్ధుడు ముందుగా ఈ ప్రాంతానికి చేరుకొని, సమీపంలోని దుంగేశ్వరి పర్వతం మీదున్న గుహలలో ఆరు సంవత్సరాలపాటు అత్యంత కఠినమైన ఉపవాస దీక్ష చేసాడు. ఆ తర్వాత శరీరాన్ని శుష్కింప చేయడంవల్ల జ్ఞానం లభించదని గ్రహించి ఆ కొండదిగి ఉరువేల గ్రామంలోని ఒక బోధివృక్షం కింద స్థిరపడ్డాడు.

అదే నేటి బోధ్ గయ. బీహార్ రాష్ట్రంలో ఉంది. ఇక్కడి నుంచి దుంగేశ్వరి గుహలు పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ట్రెక్కింగ్ కాబట్టి నాకు ఉత్సాహంగా ఉంది. కొండ ఎక్కాలి కనుక.. మేం ఉదయమే బయలుదేరాం. స్థానిక యువకులు కొందరు డోలీ సౌకర్యం కల్పించి జీవనోపాధి పొందుతున్నారు. రానూ పోనూ ఒక్కరికి వెయ్యి రూపాయలు తీసుకున్నారు. మా బృందంలో కొంతమంది డోలీలో కొండ పైకి వెళ్ళారు. ఇప్పుడిప్పుడే రోప్ వే పనులు కొనసాగుతున్నాయి. అది అందుబాటులోకి వస్తే మంచిదే కావచ్చు కానీ స్థానిక యువత ఆదాయ మార్గం కోల్పోతుంది అనిపించింది. ఇరవై రూపాయలకు ఒక కర్రను అద్దెకు తీసుకొని నేనూ అనితా మరి కొందరం నడక మొదలుపెట్టాం. సుమారు నలభై నిమిషాలు పట్టింది. మా బృందంలో డెబ్భై ఎనిమిదేళ్ళ వృద్ధ మహిళ సీత గారు మాతోపాటు నడిచి కొండపైకి రావడం స్ఫూర్తిదాయకం. ఆమె చాలా శాంత స్వభావి. తన వయసు చేత ఎవరిమీదా పెత్తనం చేయలేదు. అది ఆమె గొప్పతనం.

ఒక గుహలో దుంగేశ్వరి మాత విగ్రహం ఉంది. కూచుని, జాగ్రత్తగా లోపలికి వెళ్ళాలి. చీకటిగా ఉంది. ఆ పక్కనే మరో గుహలో బుద్ధ విగ్రహం ఉంది. అప్పటిదాకా నేను చూసిన పలు బుద్ధ విగ్రహాలు ఆజానుబాహువులతో అత్యంత అందంగా ఉన్నాయి. ఆరేళ్ళు అన్నపానాదులు మానేసి కఠోర ఉపవాస దీక్ష చేయడం వల్ల శుష్కించిన శరీరంతో, పొట్ట వెన్నుకు అంటుకుపోయి అస్థిపంజరం లాగా ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుడిని చూసి ఒక క్షణం స్థాణువైపోయాను. ఇలాంటి బుద్ధ విగ్రహం ఇక్కడ మాత్రమే ఉంటుందని అనుకుంటాను. సహజమైన కొండగుహకు ముందు భాగంలో గోడలు నిర్మించి, రంగులు వేయడం వల్ల సహజ సౌందర్యం కోల్పోయిందని అనిపించింది. ఇదే అభివృద్ధి అనుకుంటారు కాబోలు. ఇది నాకొక కొత్త అనుభవం. ఏది ఏమైనా నా మనసు అలా అస్థిపంజరం లాగా ఉన్న బుద్ధుడిని అంగీకరించలేదు. కొండపైన అన్నీ తిరిగి చూసి ప్రశాంతమైన వాతావరణంలో కాసేపు విశ్రాంతి తీసుకొని కిందికి వచ్చాం.

**-గిరిజ పైడిమర్రి**
9949443414

# వెనుకబడిన కులాల వేదన



సుమారు ఐదు వేల సంవత్సరాల చరిత్ర, వైవిధ్యభరితమైన సంస్కృతి, అనేక కులాలు-మతాలకు నిలయమైన భారతదేశం, సింధు లోయ నాగరికత కాలం నుంచి జనపదాలు, మహాజనపదాల పరిపాలనా కాలాన్ని కలుపుకొని, నేటి 21వ శతాబ్దపు ప్రజాస్వామ్య పరిపాలన వరకు అనేక పరిణామాలను చవిచూసింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ప్రజలు తమ తమ వృత్తులను, జీవన విధానాలను కొనసాగిస్తూ భారతీయ సామాజిక-సాంస్కృతిక జీవనశైలిని నిర్మించుకున్నారు. అయితే కాలక్రమేణా సమాజంలో కుల అంతరాలు, కుల వివక్షలు బలపడుతూ వచ్చాయి. దీని ఫలితంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు ఎన్నో అవకాశాలకు దూరమయ్యాయి.

స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ ఈ.వి. రామస్వామి వంటి మహనీయులు కుల, మత భేదాలకు అతీతమైన మానవ సమాజ నిర్మాణం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వారు విశేష కృషి చేశారు. వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు విద్యావంతులై, సామాజికంగా చైతన్యవంతులై, తమ హక్కుల కోసం అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ, కుల ఆధారిత అసమానతలు, వివక్షలు వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సామాజిక నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటాడే కలాలు - వేటాడే వెనుకబడిన కులాలు అనే పుస్తక సంకలనాన్ని సుమారు 25 సంవత్సరాల క్రితం జూలూరి గౌరీ శంకర్ 23 మంది కవులతో కలిసి రూపొందించారు. భారతీయ సామాజిక, సాంస్కృతిక, సంప్రదాయ జీవన విధానంలో కుల వ్యవస్థకు ఉన్న స్థానం, దాని ప్రభావం, కుల వివక్ష, అణచివేత, వెనుకబడిన వర్గాల జీవన అనుభవాలు వంటి అంశాలను ఈ సంకలనం సాహిత్య దృష్టితో ముందుకు తీసుకువచ్చింది.

ఈ సంకలనంలోని కవిత్వం కేవలం బాధను వ్యక్తీకరించడమే కాకుండా, సామాజిక చైతన్యాన్ని రగిలించే స్వరంగా నిలుస్తుంది. వెంటాడే కలాలు - వేటాడే వెనుకబడిన కులాలు అనే శీర్షికలోనే ఒక బలమైన సామాజిక ప్రశ్న దాగి ఉంది. ఈ సంకలనం ఒక కాలానికి చెందిన కవితా సంకలనం మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం కోసం సాగిన సాహిత్య ప్రయాణానికి ఒక ముఖ్యమైన గుర్తుగా చూడవచ్చు. జిల్లేడు పువ్వు పేరుతో అంబటి వెంకన్న రాసిన కవిత శైలి ప్రకృతి పరమైన కుల సామాజిక జీవితాన్ని తెలియజేస్తుంది. నీ అలు పెరగని కళ్ళతో/నాకోసం ఎదురెక్కిన చాప వై/ఈ శ్లోకాలకు కొంపలో చిక్కినందుకు/నా కంట్లో మౌన సముద్రాన్ని ఒదిగింది/బండలు పగిలే ఎండలకు/వంగి వంక్లు దిరిగిన కమ్మరి/కొండ కాల్చే తుప్పర్లకు/కన్నీటి పొటుక్ బడైతే. ఈ కవితలో కులవృత్తి ఒక సామాజిక చరిత్రగా కనిపిస్తుంది. కవి ఈ వాస్తవాన్ని ప్రకృతి ప్రతీకలతో, మానవీయ అనుభూతులతో కలిపి వ్యక్తీకరించారు.




అనిశెట్టి రజిత ముడత కులచీరా శీర్షికతో పెద్దింటి అమ్మలు దయతో ఇచ్చిన/చీర గట్టనోలోని పీలికల్ని చించేసి/ముచ్చటగా ముడతకు లేసి కట్టి/చుట్టుకుందామే చీర...మూడు రంగుల మన జెండా గోచికట్టు. మూడు రంగుల జాతీయ జెండాను గుర్తుచేసే గోచికట్టు- ఇవన్నీ పేదరికం లోనూ కనిపించే జీవన సౌందర్యాన్ని, ఆత్మగౌరవాన్ని వ్యక్తం చేస్తాయి. దేవదాసి శీర్షికతో ఏ దుర్గాప్రసాద్ కవిత శైలిమట్టికుండల మీదే ఆడిన/బతుకాటని భగ్నం చేసిన/కళాశాస్త్రాన్ని కళంకం చేసిన/హైందవ పురుష అహంకారా దాడిలో/చితికిపోయిన మన జాతి...ఈ కవితలో కవి దేవదాసి వ్యవస్థ వెనుక దాగి ఉన్న కుల, లింగ వివక్ష, మతాధిపత్యం, పురుష అహంకారం వంటి సామాజిక దోపిడీని తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. బాణాల శ్రీనివాసరావు కుంపటి కవిత ఇన్నాళ్లు...../మా మూగ నోళ్లకు తాళ్లు కట్టి గంగిరెద్దుల్లా ఆడించారు/మా సహనానికి సంకెళ్లు వేసి/నాన్న చాకిరి చేయించారు... ఇప్పుడు పదునైన గొంతులో సవరించుకుంటాము/పగిలిన మా గుండెల్ని ధైర్యంగా మేమే అతికిం చుకుంటాం. ఈ కవితలో అణచివేతకు గురైన ప్రజల బాధ, సహనం, ఆవేదన, తిరుగుబాటు చైతన్యం, ధైర్యం వ్యక్తమవుతాయి. మట్టి వారసత్వాన్ని అంటూ బెల్లి యాదయ్య కవిత శీర్షికతోమట్టి కాళ్లతో పిట్టగూళ్ళు చేస్తాను/మట్టి పుల్లలతో బొమ్మరిల్లు కట్టేస్తాను/మట్టి ఒడిలో ఆట వెలగలు తేటగీతలు వారి శ్రమ సౌందర్యాన్ని కీర్తిస్తాను. మట్టితో పిట్టగూళ్లు, బొమ్మరిల్లులు నిర్మించుకోవడం నుంచి మట్టి కడవల్లో మజ్జిగ, పాలు తాగడం వరకు గ్రామీణ జీవితంతో మట్టికి ఉన్న అనుబంధాన్ని కవి గుర్తుచేస్తున్నారు. పోదిలో కత్తి శీర్షికతో జీవి విజయలక్ష్మి వివక్షతను ప్రశ్నిస్తున్నారు. మంగలి వెంకట్ గాడివి నువ్వు/కొండ మంగలి గాడి పెళ్ళాన్ని నేను/నాయి బ్రాహ్మడివే/అన్యాయం అని అరవ లేవు.. ఈ కవితలో కుల వివక్ష, వృత్తి ఆధారిత అవమానం, పురుషాధిక్యత, స్త్రీలపై హింస వంటి అన్యాయాలను కవయిత్రి ధైర్యంగా ప్రశ్నిస్తున్నారు.

మేము లేకుండా/శతాబ్దాలకు శ్వాస/కాలానికి కాళ్లు చేతులు/ఆకాశపు గడియారానికి శబ్దలోకాలులేవు/భూమిని పిండి చేసి/నా చేత్తో మట్టికి ఒంటినిచ్చి/చాచిన వేళ్ళు మేడలు/నదికి జీవితాన్నిచ్చి/నీళ్లకు నడక నేర్పి/వేటను వెంటాడి వేటాడి/నిలబడ్డ గడపను నేను/అంటూ గౌరీ శంకర్ రాసిన ఈ కవితలో ప్రకృతి, శ్రమ, అణగారిన కులాల జీవన పోరాటం పరస్పరం మమేకమై కనిపిస్తాయి. ఇక్కడ గృహన్వేషణ కంటే/కొలంబస్లా/మరో దేశాన్ని ఆవిష్కరించడమే/సులభసాధ్యం...మనిషి జీవితంలోని ప్రతి మలుపులో కులం వెంటాడుతున్న వాస్తవాన్ని తన పదునైన కలంతో ఆవిష్కరించారు మందవరపు హైమావతి. 'వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు' పుస్తకం ఆర్థిక, రాజకీయ మరియు సాంఘిక వ్యసనాలను అర్థం చేసుకునేందుకు అత్యంత ప్రయోజనకరం. ఈ సంకలనం భారతదేశంలో ఆధునికత వెనుక దాగి ఉన్న కుల సంస్కృతి వైపరీత్యాన్ని ప్రశ్నిస్తుంది. శ్రమజీవుల వేదనను అక్షరీకరించడమే కాకుండా, సమానత్వం, సామాజిక న్యాయం మరియు ఆత్మగౌరవం సాధించడానికి 'సాహిత్య పోరాటం' ఏ విధంగా దోహదపడుతుందో ఈ కవితలు నిరూపిస్తాయి. ప్రజాస్వామ్య సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు లభించినప్పుడే ఈ శ్రమ సంస్కృతికి సరైన న్యాయం జరుగుతుంది.

**డా. పూసపాటి వేదాద్రి**
9912197694

# మానవత్వపు మకరందం 'మరచిపోకుమా'

ఒక మంచి కవిత మనసును తాకాలి. ఒక గొప్ప కవిత్వం మనిషిని ఆలోచింపజేయాలి. కానీ కొన్ని పుస్తకాలు మాత్రం మనతో పాటు మన వెంట నడుస్తాయి. వాటిలోని భావాలు, ప్రశ్నలు, ఆవేదనలు, సందేశాలు మన అంతరంగంలో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. అలాంటి అరుదైన అనుభూతిని కలిగించిన కవితా సంపుటే కవి సురేంద్ర రొడ్డ గారి మరచిపోకుమా.

నేటి పరుగుల జీవితంలో మనిషి అనేక విషయాలను గుర్తుంచుకుంటున్నాడు. కానీ మానవ బంధాలను, విలువలను, బాధ్యతలను మాత్రం క్రమంగా మరచిపోతున్నాడు. ఆ మరు పుని ప్రశ్నిస్తూ, మనిషిలోని మనిషిని మేల్కొల్పే ప్రయత్నమే ఈ కవితా సంపుటి.

ఈ పుస్తకంలోని ప్రతి కవిత ఒక భావజీవి హృదయం నుంచి జాలువారిన అనుభూతిలా అనిపిస్తుంది. ఎక్కడా ఆర్భాటం లేదు. అర్థంకాని పద జాలం లేదు. హృదయానికి హత్తుకునే సరళమైన భాషలో లోతైన జీవిత సత్యాలను ఆవిష్కరించారు. అందుకే ఈ కవితలు చదవడానికి మాత్రమే కాదు, మననం చేసుకోవడానికి కూడా అనువుగా నిలుస్తాయి. అంతర్లోచనం కవితలో జీవితం పట్ల ఆశావహ దృక్పథాన్ని అందించిన కవి, ఎప్పటికీ రుణగ్రస్తున్నే కవితలో మన జీవితాన్ని నిర్మించిన వ్యక్తుల పట్ల కృతజ్ఞతాభావాన్ని గుర్తుచేస్తారు. నీలా నీవు బతకలేవు కవితలో మనిషి వ్యక్తిత్వానికి అద్దం పడితే, అంకితం కవితలో మనిషి మనిషికి తోడుగా ఉండాల్సిన అవసరాన్ని స్పృశించారు. ప్రతి కవిత ఒక ప్రత్యేకమైన సందేశాన్ని మోస్తూ పాఠకుడిని ఆలోచనలో ముంచెత్తుతుంది.

సమాజంలో చోటుచేసుకుంటున్న అనేక సమస్యలపై స్పందించిన తీరు ప్రశంసనీయం. రైతు కష్టం, తల్లి ప్రేమ, మానవ సంబంధాలు, యువత బాధ్యత, దేశభక్తి, సామాజిక చైతన్యం వంటి అనేక అంశాలు ఈ కవితల్లో సహజంగా ఒదిగిపోయాయి. కేవలం కవితలు రాయాలనే ఉద్దేశంతో కాకుండా, సమాజానికి ఏదో చెప్పాలనే తపనతో ఈ అక్షరాలు పుట్టాయని మనకి చదువుతుంటే అర్థం అవుతుంది. ఈ సంపుటిలో నాకు ప్రత్యేకంగా నచ్చిన అంశం. మనకి ఏదో చెప్పడానికి ప్రయత్నిం చలేదు. ఆలోచింపజేయడానికి ప్రయత్నించారు. అదే ఈ పుస్తక బలం. చదివే ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని ఒకసారి వెనక్కి తిరిగి చూసుకునేలా చేసే శక్తి ఈ కవిత్వానికి ఉంది.

మరచిపోకుమా కేవలం ఒక కవితా సంపుటి కాదు. ఇది మానవీయ విలువల పట్ల ఒక పిలుపు. బంధాల పట్ల ఒక జ్ఞాపకం. మనిషిలో మసక బారుతున్న మానవత్వాన్ని మళ్లీ వెలిగిం చాలనే ఒక సాహిత్య ప్రయత్నం.

సాహిత్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరి దగ్గర ఉండదగిన పుస్తకం ఇది.

చదివిన తర్వాత మనకు మనసులో ఒక మంచి ఆలోచన మిగిలితేనే అది ఒక రచనకు సార్థకత. ఆ సార్థకతను సంపూర్ణంగా అందుకున్న కవితా సంపుటిగా మరచిపోకుమా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు.. కవి సురేంద్ర రొడ్డ గారికి హృదయపూర్వక అభినందనలు. మరిన్ని విలువైన రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలని ఆకాంక్షిస్తున్నాను.




**- ఎన్. లహరి**
9885535506

# త్వరలో నీ ఫామ్ హౌస్‌ను ముట్టడిస్తాం పుట్ట మధు!

**శ్రీధర్ బాబు పై చౌకబారు ప్రకటనలు చేస్తే సహించేది లేదు**

**నువ్వు దోచుకున్న భూములను దళితులకు పంచే బాధ్యత కాంగ్రెస్ పార్టీదే**

**ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకో**



**మంథని సెప్టెంబర్27(మనం న్యూస్):** త్వరలో మీ ఫామ్ హౌస్ ను ముట్టడిస్తామని,మంత్రి శ్రీధర్ బాబు పై చౌకబారు ప్రకటనలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఆదివారం మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిన్నటి రోజున కమాన్ పూర్ మాజీ జడ్పిటిసి పుట్ట మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండిస్తూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ ప్రెస్ మీట్ ను ఉద్దేశించి మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్,ఎలక్ట్రిసిటీ బోర్డ్ మెంబర్ శశిభూషణ్ కాచే,మున్సిపల్ చైర్మన్ వోడ్నల శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న,మాజీ మున్సిపల్ చైర్మన్ పెంద్రు రమ,మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ లు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల.శ్రీధర్ బాబు పైన అనుచిత వైఖ్యాలు చేస్తే సాహించబోమని,గత పది సంవత్సరాల కాలంలో ఎంత దోచుకున్నావో ప్రజలందరూ గమనించి,మీకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.అయినా కూడా తమరు మారకుండా ఇష్టరాజ్యంగా అబద్ధపు ప్రచారాలు చేసుకుంటూ పబ్బం కడుపుతున్నావనీ వారు ఆరోపించారు.తమరు వెంకటాపూర్ గ్రామంలో ఎన్ని ఎకరాల భూములు సంపాదించినావో,అక్కడ కేసీఆర్ సంపాదించుకున్నాడు భూములు,ఇక్కడ మీరు సంపాదించుకున్న భూములు ఎవరు సంపాదించుకోలేదన్నారు.10 సంవత్సరాల కాలంలో దళితుల భూములను తక్కువ ధరకు గుంజుకున్నవన్నారు. రచ్చపల్లి కొందరు గ్రామస్తులు ఆర్ఆర్ ప్యాకేజీతో వచ్చిన డబ్బులతో వెంకటాపూర్ లో భూములు కొనుక్కుంటే వాటిని మీ అల్లుళ్ళతో బెదిరించి భూములను రిజిస్ట్రేషన్ చేపించుకున్న ఘనత నీదన్నారు.శ్రీధర్ బాబు భూములపై మాట్లాడుతున్నావ్, అవి ఎక్కడ ఉన్నాయో,ఏందో అనేది కూడా మా నాయకులకు తెలవదని,వారు భూములు పంచే వ్యక్తిగా ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నారని,వారికి ప్రజల బాగోగులు తప్ప ఎలాంటి కబ్జాలు చేయలేదని,బహిరంగంగా తెలుపుతున్నామన్నారు.దళితులకు మూడెకరాల భూమి అనే హామీలు ఇచ్చారేతప్ప,దళితుల భూములు గుంజుకున్న మీరు ఈరోజు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని వారు హెచ్చరించారు.మహనీయుల గురించి మాట్లాడుతున్నావ్, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహనీయులకు పెద్దపీట వేసిందని, వారి జయంతి,వర్ధంతులకు సంబంధించి ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ప్రజా ప్రభుత్వం వారికి ఘన నివాళులు అర్పిస్తూ వారి ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.మంథని బస్టాండ్ ప్రెస్ మీట్ పెట్టి ప్రజలను మహిళలను తప్పు త్రోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నామని ఇది సరైనది కాదని ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు.ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పెద్దపీట వేస్తుందని వారు తెలిపారు.మీరు వెంకటాపూర్ లో ఫామ్హౌస్ గాని, బయట వివిధ ప్రాంతాల్లో ప్లాట్లు గాని,రాజ గృహ ఎలా నిర్మించుకున్నావో ప్రజలందరికీ తెలిసే నీయొక్క బుద్ధి మార్చుకోవాలనే ఉద్దేశంతో నిన్ను ఎన్నికల్లో చిత్తుగా ఓడగొట్టి గుణపాఠం చెప్పారని వారు ఆరోపించారు.ఇకనైనా నీ బుద్ధి మార్చుకుని కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను చూస్తూ ఉండాల్సిందేనని,రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి ప్రజల ముందుకు వెళ్తామని వారు తెలిపారు.

వెంకటాపూర్ లో ఎన్ని ఎకరాలు అటవీ భూమిని,దళితుల భూమిని కబ్జాలు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకొని ప్రజలను బెదిరింపులకు గురి చేసి తక్కువ ధరకు గుంజుకున్న మీరు ఈరోజు మాట్లాడుతున్నావా... ఇంకోసారి మా నాయకులు శ్రీధర్ బాబు పైన గాని,శ్రీనుబాబు పైన గాని అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.ఆర్టీసీ కార్మికులను తప్పుదోవ పట్టించి కార్యక్రమం చేస్తా ఉన్నావు,పుట్ట మధు మీ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే మీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదనీ,ఆర్టిసి కార్మికులు దాదాపు 30 మంది అమరులైన కూడా మీరు వారికి ఎలాంటి హామీలు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆర్టిసి కార్మికులు సమ్మెకు సంబంధించిన నోటీసు ఇవ్వగానే వారిపై సబ్ కమిటీ వేసి వారి సమస్యలు విని త్వరలోనే ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేస్తామని వారికి తెలపడం జరిగిందన్నారు. ఆర్టీసీ కార్మికులకు కావలసిన సౌకర్యాలను అందుబాటులోకి మా ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు.

మా నాయకులు శ్రీధర్ బాబు వారి స్వంత ఖర్చులతో పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసి వారి భవిష్యత్తులో అత్యున్నత స్థానంలో ఉండాలనే ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ అందజేయడం గాని, కోచింగ్ సెంటర్లో అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఎంతమంది దళితులకు భూమి ఇచ్చారో తెలుపాలన్నారు.కాంగ్రెస్ పార్టీ,మా నాయకులు స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు,శ్రీధర్ బాబు,ఎస్సీ,ఎస్టీ బలహీన వర్గాల పేదబిడ్డల ఎంతోమందికి భూములను వారి చేతి మీదగా పట్టాలు అందజేసిన ఘనత వారిదే అన్నారు.ఇప్పటికైనా మా నాయకులపై అసత్యపు ఆరోపణలు,చౌకబారు ప్రకటనలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఆరెల్లి కిరణ్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్,నాయకులు బూడిద శంకర్,పేరవేణ లింగయ్యయాదవ్, మంతెనశ్రీనివాస్, అక్కపాకసదానందం, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ ఆఫ్ తామర ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్



**జగిత్యాల, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** జగిత్యాల పట్టణంలోని పుల్లూరి నారాయణదాసు ఆశ్రమం బంకిట్ హాల్లో హౌస్ ఆఫ్ తామర హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఎగ్జిబిషన్ను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష, శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో సంప్రదాయ కళలు, వస్త్రాలు, ప్రత్యేకమైన సాంప్రదాయ సేకరణలు, మహిళలను ఆకట్టుకునే వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన హౌస్ ఆఫ్ తామర ఎగ్జిబిషన్ను జగిత్యాల పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని జ్యోతి లక్ష్మణ్ పేర్కొన్నారు. సంప్రదాయ కళలు, వస్త్రాలు మరియు సాంప్రదాయ సేకరణలకు ప్రోత్సాహం లభించేలా ఇటువంటి ఎగ్జిబిషన్లు నిర్వహించడం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మనపురి పవిత్ర మహేష్, కో ఆప్షన్ వీరబత్తిని పద్మజ, రాజేందర్, మరియు నిర్వాహకులు, మహిళలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



- మహనీయుల ఆశయాలను కొనసాగించాలి
- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్

**జగిత్యాల, సెప్టెంబర్ 27 (మనం ప్రతినిధి):** ఆదివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ తొలిదశ ఉద్యమ నాయకుడు,స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిజాం పాలనలో వందేమాతరం పాడితే శిక్షించే రోజుల్లో బాధితుల తరుపున లాయర్ గా వాధించి ఎంతో మంది ప్రాణాలను కాపాడిన యోధుడు అని కొనియాడారు. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా పోరాటం చేసి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవికి సైతం స్వచ్ఛందంగా రాజీనామా చేసిన తెలంగాణ వాది.తన చివరి శ్వాస వరకు తెలంగాణ కోసమే పోరాటం చేసిన ఉద్యమకారుడు అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించినప్పుడే మనం అయనకిచ్చే నిజమైన నివాళి అని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో బి.సి సంక్షేమ శాఖ అధికారి, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## దళిత, బహుజనుల హక్కులను పరిరక్షించాలి

- ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- వివిధ సంఘాల నాయకుల డిమాండ్
- ఘనంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమం



**జగిత్యాల సెప్టెంబరు 27(మనం న్యూస్):** దళిత, బహుజన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించాలని వివిధ అంబేద్కర్, దళిత, బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఈ వారం ముఖ్య అతిథులుగా హాజరై సుంకర పెల్లి అశోక్ పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుంకర పెల్లి అశోక్ మాట్లాడుతూ వివిధ దళిత, దళిత, బహుజన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ ప్రయోజనాలు అర్హులైన వారికి ఎలాంటి వివక్షకు తావులేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే ప్రజలను సమీకరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సంఘాల నాయకులు హెచ్చరించారు. దళిత, బహుజన వర్గాల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు విద్య, చైతన్యం, సామాజిక ఐక్యత అవసరమని, యువత ఆయన బాటలో నడిచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి జేఏసి రాష్ట్ర కార్యదర్శి, పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కంటే అంజయ్య, వీరశైవ సమాజం సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు ఏ ఎస్ ఐ చంద్రశేఖర్ , మారం వీరయ్య, సిద్ధాంతి శ్రీనివాస్, క్యాతం మహేందర్, కంది శివకుమార్, మూలస్తం శివకుమార్, ఊడే రాజశేఖర్, ఊడే శివయ్య, ఊడే జితేందర్, గంటె శ్రీనివాస్, మారెల్లి బుచ్చన్న, టి డబ్ల్యు జే ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనం జిల్లా ప్రతినిధి మేనేని రవిందర్ రావు, తెలంగాణ శక్తి ఎడిటర్ ఆనంతుల కాంతారావు,మట్టిపూలు పత్రిక సంపాదకులు తక్కళ్ళ దేవయ్య,మాల మహానాడు అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, జిల్లా కోశాధికారి గిద్దె శంకర్,దళిత క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముద్దమళ్ళ ఆనంద్ ప్రవీణ్ కుమార్,దాసరి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ దాసరి లచ్చయ్య, రుద్ర మనోహర్, సంకె మహేష్, దళిత సంఘాల సీనియర్ నాయకులు దుమాల గంగాధర్, అంబేద్కర్ వాదులు, తదితరులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

### ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మంథని, సెప్టెంబర్27(మనం న్యూస్):** కొండ లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని,ఆయన చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,టి.పి.సి.సి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబుల ఆదేశాల మేరకు ఆదివారం మంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వర్గీయ కొండలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి,ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్,మున్సిపల్ చైర్మన్ వోడ్నల శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ పెంద్రు.రమలు మాట్లాడుతూతెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుడు,తెలంగాణ తొలి తరం ఉద్యమ నాయకుడు,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు.కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశం కోసం పోరాడటమే కాకుండా,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారని వారు కొనియాడారు. పదవుల కంటే ప్రజాసేవకే ప్రాధాన్యతనిచ్చిన గొప్ప త్యాగశీలి అని,వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన సామాజిక ఉద్యమకారుడని, వారి ఆశయలను రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముందుకు తీసుకువెళ్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ అభిమానులు,అనుబంధ సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన సింగిల్ విండో చైర్మన్



- పలు సమస్యల పరిష్కారానికి వినతి

**మంథని సెప్టెంబర్27(మనం న్యూస్):** రాష్ట్రఐటీ,పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఆదివారం హైదరాబాద్లోని ఎమ్మెల్యే క్వార్టర్స్లో మంత్రి శ్రీధర్ బాబును కలిసి మంథని ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంథని ప్రాంత అభివృద్ధి,ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి శ్రీధర్ బాబుకు వివరించినట్లు కొత్త శ్రీనివాస్ తెలిపారు. సమస్యలను సావధానంగా విన్న మంత్రి వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

## తిమ్మమ్మ మర్రిమాను వేదికగా అంగరంగ వైభవంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- ప్రపంచ పర్యాటక పటంలో తిమ్మమ్మ మర్రిమాను
- నియోజకవర్గాన్ని టూరిజం సర్క్యూట్గా అభివృద్ధి చేస్తాం
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్

**కదిరి,సెప్టెంబర్27మనంన్యూస్:** ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిమ్మమ్మ మర్రిమాను ప్రకృతి, వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసేలా పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేకంగా హాజరై పర్యాటక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

### మూడు కిలోమీటర్ల ఎకో హెరిటేజ్ వాక్

ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా తిమ్మమ్మ మర్రిమాను ప్రధాన ద్వారం నుంచి ఈశ్వరమలై కొండ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఎకో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ ఎకో హెరిటేజ్ వాక్ను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రకృతి పరిరక్షణ, పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యత, మన వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యతను తెలియజేసేలా ఈ వాక్ సాగింది.

### ఆస్క్ఏఐ స్కానర్ ఆవిష్కరణ

తిమ్మమ్మ మర్రిమాను ప్రధాన ద్వారం వద్ద పర్యాటకులకు మరింత ఆధునిక సమాచారాన్ని అందించేలా ఏర్పాటు చేసిన ఆస్క్ ఏఐ స్కానర్ను అతిథులు ఆవిష్కరించారు. సాంకేతికతను పర్యాటక రంగంతో అనుసంధానం చేస్తూ సందర్శకులకు తిమ్మమ్మ మర్రిమాను, పరిసర ప్రాంతాల గురించి సమాచారం అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

### ఈశ్వరమలై కొండపై బెలూన్ సెర్మనీ

ఎకో హెరిటేజ్ వాక్ అనంతరం ఈశ్వరమలై కొండపైకి చేరుకున్న అతిథులు అక్కడి నుంచి తిమ్మమ్మ మర్రిమాను అందాలను పరిశీలించారు. అనంతరం బెలూన్ సెర్మనీలో భాగంగా కొండపై నుంచి రంగురంగుల బెలూన్లను గాలిలోకి ఎగరవేసి ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణను తీసుకువచ్చారు.

### బొటానికల్ గార్డెన్ ఏర్పాటుకు భూమిపూజ

తిమ్మమ్మ మర్రిమాను ప్రధాన ద్వారం ఎదురుగా పర్యాటక అభివృద్ధిలో భాగంగా బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ నిర్వహించారు. తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతాన్ని ప్రకృతి, పర్యాటకం, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మరింత అభివృద్ధి చేసే దిశగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

### ప్రకృతి పరిశీలన – సందర్శకుల అభిప్రాయ సేకరణ

ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా వాలంటీర్లచే సందర్శకులకు స్లిప్పులు పంపిణీ చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ (ఎఫ్ ఈ ఎస్ ) సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి పరిశీలన, పర్యాటకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు ప్రభుత్వం కృషి

- తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం
- జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల, సెప్టెంబర్ 27(మనంప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అన్నారు. ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు,స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా పరితపించిన తొలితరం ఉద్యమ నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి సందర్భంగా రాయికల్ పట్టణంలో వారి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ సమాజానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలకు తగిన గుర్తింపు కల్పించే దిశగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హ్యాండ్ లూమ్,టెక్స్టైల్ యూనివర్శిటీ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ప్రకటించడం జరిగింది. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ప్రభుత్వ కార్యక్రమాలు,సంస్థల ద్వారా చిరస్థాయిగా నిలిపే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ముందుకు సాగుతోందని డా. సంజయ్ కుమార్ తెలిపారు. మహాత్మా గాంధీ తర్వాత బాపూజీ గా కొండా లక్ష్మణ్ బాపూజీ నీ పిలుస్తాం అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గం లో అన్ని కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి,కమిషనర్ మనోహర్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు,వైస్ చైర్మన్ రమాదేవి, పాక్స్ చైర్మెన్ ఏనుగుమల్లారెడ్డి,పద్మశాలి సంఘం అధ్యక్షులు రాజేశం,కౌన్సిలర్ లు కో ఆప్షన్ సభ్యులు సర్పంచులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడి ప్రాణాలు కాపాడిన బ్లూకోట్స్ సిబ్బంది

- బ్లూ కోలట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ను అభినందించిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల సెప్టెంబరు 27 (మనం ప్రతినిధి):** కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని బ్లూకోట్స్ సిబ్బంది తక్షణమే స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు.కొడిమ్యాల మండలం దొంగలమర్రి చెక్పోస్ట్ సమీపంలో శంకర్రావుపేట గ్రామానికి చెందిన వంశీ, వయస్సు 23 సంవత్సరాలు, కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు 112 డయల్కు సమాచారం అందింది.సమాచారం అందిన వెంటనే కొడిమ్యాల బ్లూకోట్స్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి తక్షణమే చేరుకుని కాపాడడం తో పాటు పరిస్థితిని గమనించి యువకుడికి ధైర్యం చెప్పడంతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించి, అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టారు. విధి నిర్వహణలో అప్రమత్తత, సమయస్ఫూర్తి, మానవత్వంతో స్పందించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ అన్నారు.బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్ వేగంగా స్పందించి ఒక విలువైన ప్రాణాన్ని కాపాడడం అభినందనీయమని కొనియాడారు.అలాగే, ఆత్మహత్య ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, జీవితంలో ఎలాంటి కష్టాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు లేదా వ్యక్తిగత ఒత్తిడులు ఎదురైనా ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.

# బాపూజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి

● ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి

ములుగు, సెప్టెంబర్ 27(మనంన్యూస్): శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, అభ్యున్నతికి కృషి చేసిన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని బాపూజీ విగ్రహానికి గౌరవనీయ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి బాపూజీ సేవలను స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి సేవలను నేటి తరం ఎప్పటికీ మరువకూడదని అన్నారు. గౌరవ ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి మాట్లాడుతూ... శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి, ప్రజల



సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న అనేక మంది సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు. వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం దేశం అభివృద్ధి రెండో దశలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఉపకులపతి అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నిరంతరం శిక్షణ కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు



అందిపుచ్చుకుని, తమ నైపుణ్యాలను నవీకరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (అఐ), రిమోట్ సెన్సింగ్, ఎఐఖి, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉద్యాన రంగంలో వినియోగించడంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సాంకేతికతను నేర్చుకోవడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయడం ద్వారా విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాలు చూపే విధంగా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు కొనసాగాలని డా. దండ రాజిరెడ్డి అన్నారు. ఉద్యాన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని నవీకరించుకోవాలని సూచించారు. బాపూజీతో పాటు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, సేవలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. ఎన్. సీనివాసన్, సహాయ కంప్ట్రోలర్ చెంచు రామయ్య, ఎ. ఇ. రమేష్, విద్యార్థులు, బోధన, బోధనేతర, అవుట్సోర్సింగ్, ఒప్పంద సిబ్బంది పాల్గొన్నారు.



## పితృపక్షాల దినోత్సవం సందర్భంగా అల్పాహార పంపిణీ

గజ్వేల్ సెప్టెంబర్ 27 మనం న్యూస్: పితృపక్షాల దినోత్సవం సందర్భంగా అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారము ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా తోట బిక్షపతి నంగునూరు సత్యనారాయణ మాట్లాడుతూ పితృపక్షాల దినోత్సవం 15 రోజులపాటు ఉంటుందన్నారు. ఈ 15 రోజులపాటు మరణించిన వారి జ్ఞాపకార్థం నిర్వహించే పుణ్య కార్యాలతో వారి ఆత్మ శాంతించి వారి కుటుంబం సంతోషంగా ఉంటుందని నమ్మకంతోనే ఈ దానధర్మాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే 15 రోజులపాటు ప్రతిరోజు పట్టణంలోని ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. దాతల సహాయ సహకారాలతో ఈ పరిహారం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్యాద లింగం అయితసత్యం ఆదిమూలం నారాయణ ఉప్పలపు సంజయ్ దొంతుల సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



● టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

గజ్వేల్ సెప్టెంబర్ 27 మనం న్యూస్: టిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టతకు సైనికుల్లా పనిచేయాలని టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత సూచించారు. ఆదివారం నాడు గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన ఇంద్ర గౌడ్ తన అనుచరులతో కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కవిత ఇంద్ర గౌడ్ కు గజ్వేల్ నియోజకవర్గం లో పార్టీ పటిష్టతకు పూర్తిస్థాయిలో పనిచేయాలని అలాగే టిఆర్ఎస్ పార్టీ అవలంబించనున్న పంచ సూత్రాలను ప్రతి ఒక్కరికి అందేలా సూచించాలని సూచించడం జరిగింది. గ్రామ గ్రామాన ఇప్పటికే పూర్తిస్థాయిలో కార్యకర్తలు ఉన్నారని వారిని ఉత్తేజపరుస్తూ మరింత పటిష్టంగా పనిచేసే రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ జండా ఎగిరేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని కవిత తెలిపినట్లు తెలిసింది.

## తెలంగాణ ఉద్యమ యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




పటాన్‌చెరు, సెప్టెంబర్ 27 (మనం న్యూస్): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో అలుపెరగని పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతిని పురస్కరించుకుని పద్మశాలి సంఘం పటాన్చెరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మూడు తరాల పాటు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. సమాజం, జాతి కోసం ఆయన చేసిన సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పటాన్చెరులో కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసే అవకాశం తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాపూజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగుతూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయ కులు నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, వంగరి అశోక్, కంకర శీనయ్య, వెంకటేష్, శంకర్, పద్మశాలి సంఘం ప్రతినిధులు రఘురాములు, ధర్మచంద్, పశుపతి, గీతా వెంకట్, మధు, లక్ష్మణ్, కృష్ణ, వరప్రసాద్, రాములు, జగదీష్, నాగరాజు, సతీష్, విజయ్తో పాటు పట్టణ నాయకులు, కార్యకర్తలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ బహుజన పక్షపాతి

● ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి



గజ్వేల్, సెప్టెంబర్ 27 మనం న్యూస్: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా లోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ప్రభుత్వ లాంచనాలతో అంగరంగ వైభవంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చందన, రవీందర్ హాజరై మాట్లాడుతూ 'కొండా లక్ష్మణ్ బాపూజీ 'ఒక గొప్ప మహనీయుడని నిస్వార్థ నాయకుడని స్వాతంత్ర సమరయోధుడని తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త అని కొనియాడినారు. తెలంగాణ ఉద్యమ సింబల్, బహుజన పక్షపాతి అని కొనియాడినారు. బాపూజీ చూపిన మార్గం , సత్యం, అంకితభావం, నిస్వార్థ సేవ, అనే మార్గంలో నడవడమే మనం ఆయనకు ఇచ్చిన గొప్ప నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మ, బూరుగుపల్లి ప్రతాప్ రెడ్డి , యువ నాయకులు సర్దార్ ఖాన్, నర్సింగ్ రావు కౌన్సిలర్లు కాముని మురళి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ మరియు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కౌన్సిలర్ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొల్లి బత్తుల దేవదాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, మార్కండేయ దేవాలయం అధ్యక్షులు గడ్డమీద ఆంజనేయులు, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గాడిపల్లి శ్రీనివాస్, తలకొక్కుల దుర్గాప్రసాద్, దేవులపల్లి రాజారాొ, ప్రముఖ అడ్వకేట్ తలకొక్కల రాజు, కాళీ ప్రసాద్, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, గాడి పల్లి విజయ్, చేనేత సహకార సంస్థ దొంతుల ప్రసాద్, సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సంయుక్త కార్యదర్శి పాషికంటి శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, ఉపాధ్యక్షులు షేర్ల నర్సింలు, రాచకొండ శ్రీనివాస్, సూర లింగం, స్వర్గం రాములు, చంద్రమౌళి, మంగళపల్లి సత్యనారాయణ,సబ్బని నరేష్ , తుమ్మ ఉపేందర్, రాచకొండ మహేష్, కుడికాలు రమేష్ చక్రధర్, బత్తిని నరేష్, దేవసాని పోశెట్టి, నల్ల శివకుమార్, పద్మశాలి కుల కులస్తులు మరియు వివిధ రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## విద్యార్థుల సృజనాత్మకతకు టాస్క్ కొత్త పునాది

● సెల్ ఫోన్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు
● వివిధ కళాశాలలకు చెందిన 56 మంది విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ
● టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



కల్వకుర్తి సెప్టెంబర్ 27(మనం న్యూస్): మన చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్ తో అద్భుతాలను సృష్టించవచ్చని సెల్ ఫోన్ ఇతరులతో మాట్లాడేందుకు, ఫొటోలు తీసేందుకు మాత్రమే కాదనీ సృజనాత్మకతను పునాది వేయవచ్చని టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఆదివారం హైదరాబాద్ నగరంలోని టాస్క్ కార్యాలయంలో మొబైల్ ఫిల్మ్మేకింగ్ అండ్ సినిమాటోగ్రఫీపై టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వర్క్షాప్ నిర్వహించారు.ఈ వర్క్ షాప్ లో వివిధ కళాశాలలకు చెందిన 56 మంది విద్యార్థులు పాల్గొన్నారని మొబైల్ ఫిల్మ్మేకింగ్, ఫోటోగ్రఫీ ప్రాథమిక అంశాలు, కెమెరా టెక్నిక్స్, ఫ్రేమింగ్, లైటింగ్, విజువల్ స్టోరీటెల్లింగ్, ప్రాథమిక సినిమాటోగ్రఫీ తదితర అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్గా వివరించినట్లు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సాంకేతికత యువతకు అనేక కొత్త అవకాశాలను అందిస్తోందన్నారు. ఫిల్మ్మేకింగ్, ఫోటోగ్రఫీకి గతంలో ఖరీదైన కెమెరాలు,ప్రత్యేక పరికరాలు అవసరమయ్యేవని, ఇప్పుడు చేతిలో ఉండే స్మార్ట్ఫోన్తోనే మంచి ఆలోచనను, కథను,విజువల్ను ప్రపంచానికి చూపించే అవకాశం ఉందని అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచుకోవాలని ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వర్క్షాప్లో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు కేవలం శిక్షణకే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాలని సూచించారు. కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి, సృజనాత్మక ఆలోచన, నిరంతర సాధన ఉంటే ఏ రంగంలోనైనా అవకాశాలను అందుకోవచ్చని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం వర్క్షాప్ను విజయవంతంగా పూర్తి చేసిన 56 మంది విద్యార్థులకు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫిల్మ్మేకింగ్ శిక్షకుడు రోషన్,తోపాటు టాస్క్ ప్రతినిధుల బృందం,వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను భావితరాలకు అందించాలి

● జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



నల్లగొండ -సెప్టెంబర్ 27( మనం ప్రతినిధి ): నీతి, నిజాయితీగా ముక్కు సూటిగా వ్యవహరిస్తూ న్యాయం, ధర్మం కోసం పోరాడిన గొప్ప పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. వారి ఆదర్శాలు భావితరాలకు అందించాల్సి ఉందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన నల్గొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్ లో పాల కేంద్రం వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1942 లో మహాత్మా గాంధీ స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ, అనంతరం తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని,స్వాతంత్ర్యానంతరం ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేశారని, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారని తెలిపారు. నిక్కచ్చిగా, నీతి,నిజాయితీలతో ముక్కు సూటిగా వ్యవహరించిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ న్యాయాన్ని, ధర్మాన్ని పాటించాలని, ఆయన ఆశయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తూ ఆయన సేవలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్యం, తెలంగాణ కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. భువనగిరి నుంచి శాసనసభ్యుడిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి,జిల్లా బీసీ సంక్షేమ అధికారి సంజీవ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , కార్పొరేటర్ మామిడి కార్తీక్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు పొట్టబోతుల సత్యనారాయణ,బిసి జాతీయ నాయకుడు మిర్యాల యాదగిరి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దూకుడు సత్యనారాయణ, పున్నా కైలాస్ నేత, ఎంబీసీ జాతీయ నాయకులు కొండూరు సత్యనారాయణ, ఎన్సిపి నాయకులు రషీద్, అధికారులు, బిసి సంగం నాయకులు పాల్గొన్నారు.

## రెండు కుటుంబాలను పరామర్శించిన కాట శ్రీనివాస్ గౌడ్



● పెద్దకంజర్లలో సంజీవ్ రెడ్డి కుటుంబానికి ఓదార్పు
● బాధలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పిన కాంగ్రెస్ నేత కాట

పటాన్చెరు, సెప్టెంబర్ 27 (మనం న్యూస్): పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆదివారం రెండు వేర్వేరు కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూ వారికి మనోధైర్యం కల్పించారు.

ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామ మాజీ ఉపసర్పంచ్ రజినీకాంత్ తండ్రి ఇటీవల మృతి చెందారు. అనివార్య కారణాల వల్ల అంత్యక్రియలకు హాజరు కాలేకపోయిన కాట శ్రీనివాస్ గౌడ్ ఆదివారం వారి నివాసానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, జరిగిన విషయంపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

అదేవిధంగా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ్ రెడ్డి తల్లి సత్యమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా ఆకురాతి కన్వెన్షన్లో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. సత్యమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ఈ సమయంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. రెండు కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పటాన్ చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, మాదాస్ రాజశేఖర్, రాజీ రెడ్డి, భుజంగ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వాసురెడ్డి

● ఎంపీపీగా సేవలందించి.. పార్టీ బలోపేతానికి నిరంతర కృషి
● వాసురెడ్డికి అభినందనల వెల్లువ



పెనుమంట్ర, సెప్టెంబర్ 27, మనం ప్రతినిధి: పెనుమంట్ర మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖ సీనియర్ నాయకుడు నిగర్వి, నిస్వార్థ సేవాపరుడు, కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి)కి పార్టీ అధిష్ఠానం రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు వాసురెడ్డిని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ శుక్రవారం పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలే పెనుమంట్ర ఎంపీపీగా తన పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న వాసురెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి వాసురెడ్డి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ వివిధ బాధ్యతలను నిర్వహించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. పెనుమంట్ర మండల పరిషత్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజాప్రతినిధిగా అందుబాటులో ఉంటూ గ్రామాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారు.ఎంపీపీగా ఉన్న సమయంలో మండల పరిషత్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లే నాయకుడిగా వాసురెడ్డికి గుర్తింపు ఉంది. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు.రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా తనను నియమించిన సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డికి, మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ ఇన్చార్జి చెరకువాడ శ్రీరంగనాథరాజుకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు, ఇతర పార్టీ పెద్దలకు వాసురెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.వాసురెడ్డికి రాష్ట్ర స్థాయి బాధ్యతలు లభించడంపై పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.



## పేద యువతులకు వాకర్స్ క్లబ్ సాయం

పాలకొల్లు, సెప్టెంబర్ 27,మనం ప్రతినిధి: ఆపన్నులను ఆదుకోవడంలోనే ఆనందం దాగుందని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు కొత్త కుళాయి చెరువు వద్ద ఇద్దరు పేద యువతులకు వారికి అవసరం అయిన సాయం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిన్నూరు గ్రామానికి చెందిన సిర్రా యామిని రాజమహేంద్రవరంలో క్యాత్ ల్యాబ్ ట్రైనింగ్ కోర్సు చేస్తుంది. తండ్రి దివ్యాంగుడు .ఆమెకు కావలసిన మూడు జతల బట్టలు ఒక ట్రంకు పెట్టె ఆమె కోరిన మీదట అందించడం జరిగింది. అదేవిధంగా పాలకొల్లు మండలం పెదగరువు కు చెందిన గూడపాటి అనూష డయాబెటిస్ తో బాధపడటంతో పాటు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం క్లబ్ దృష్టికి తీసుకు రావడం తో ఆమెకు 5 వేల రూపాయలు విలువైన నిత్యవసర వస్తువులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు,కోశాధికారి పోతుల ఉమా శంకర్రావు సభ్యులు సోమంచి శ్రీనివాస శాస్త్రి, కాపా చిరంజీవి, మండపాక రాంబాబు, సీరం ఆనంద కృష్ణ, బొండాడ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవో పనితీరుకు ప్రభుత్వ గుర్తింపు

● అభినందనలు తెలిపిన కూనపరెడ్డి



నరసాపురం, సెప్టెంబర్ 27 (మనం న్యూస్) : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సచివాలయాల పడితీరులో నరసాపురం మండల సచివాలయాలు 31 వ స్థానం సాధించినట్లు మండల సచివాలయాల అధికారి, డిప్యూటీ ఎంపీడీవో ఆనందబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను ఆయన నివాసంలో యర్రంశెట్టివారి పాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, నరసాపురం మండల సర్పంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఆనందబాబును నరసాపురం ఎంపీడీవోగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రింది స్థాయి అధికారులు కూడా ప్రజలకు సచివాలయాల ద్వారా తమ సేవల అందించి మంచి పేరు సంపాదించుకోవాలని రంగారావు కోరారు.

# మార్చి కల్లా నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలి

## బోనకల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, సెప్టెంబర్ 27(మనం న్యూస్): వచ్చే మార్చి కల్లా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురం లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను క్షేత్ర స్థాయిలో డిప్యూటీ సీఎం, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి పరిశీలించారు. నిర్మాణాల్లో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ స్ట్రక్చర్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఆకాడమిక్ 3, 4 బ్లాకుల ఫ్రొంట్, బ్యాక్ వింగ్ లు పూర్తయినట్లు, 1, 2 బ్లాకుల్లో బ్యాక్ వింగ్ పూర్తి అవగా, ఫ్రొంట్ వింగ్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సీనియర్ హాస్టళ్లు 9 లో 3 హాస్టళ్లు పూర్తవగా, 2 హాస్టళ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా, 4 హాస్టళ్ల నిర్మాణాలు బేస్ మెంట్ వరకు జరిగాయని అన్నారు. జూనియర్ 4 హాస్టళ్లకు సంబంధించి నిర్మాణాలు పూర్తయినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. పేరెంట్స్ వెయిటింగ్ హాల్ నిర్మాణం స్లాబ్ పూర్తయినట్లు, కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణాలు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడ ఆలస్యం అలసత్వం ఉండకూడదని గుత్తేదారులకు, అధికారులకు తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల పనులను మరింత వేగవంతం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. నిర్మాణ కార్మికుల సంఖ్యను పెంచుకుని, పనులను మరింత వేగవంతం చేసి, మార్చి కల్లా పూర్తి స్థాయిలో పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న తరగతి గదులను, హాస్టల్ సముదాయాలను, సైన్స్, కంప్యూటర్స్ ఇతర ల్యాబ్ భవనాలను డిప్యూటీ సీఎం పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్ లో జరుగుతున్న నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం దక్కుతుందని, ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని డిప్యూటీ సీఎం అన్నారు. అక్షరమే ఆయుధంగా మలుచుకొని తెలంగాణ బిడ్డలు చదువుకొని బాగా ఎదగాలన్నారు. అక్షరం ద్వారానే అంతరాలు లేని సమాజం నిర్మాణ అవుతుందన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరూ ఒకేచోట చదువుకోవాలని లక్ష్యంతోనే ఈ పాఠశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఒకే చోట విద్యను అభ్యసిస్తే వసుదైక కుటుంబ భావన అందరిలోనూ ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ ఎస్ ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ..



## రూ. 7.90 కోట్లతో పర్యాటక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన

### గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

### అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షించాలి

### సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### మహిళల ఆర్థిక బలోపేతానికి వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం

### చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

చింతకాని, సెప్టెంబర్ 27(మనం న్యూస్): పర్యాటక వసతుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభ తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్లతో కలిసి డిప్యూటీ సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. చింతకాని మండల కేంద్రంలోని చెరువు వద్ద రూ.7 కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పర్యాటక వసతుల కల్పన పనులకు, పందిళ్లపల్లి నుండి అనంతసాగర్ మీదుగా చింతకాని జడ్పీ రోడ్డు వరకు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జగన్నాథపురంలో ఖమ్మం-బోనకల్ ఆర్అండ్బీ రోడ్డు నుండి న్యూ మార్కెట్ మీదుగా మత్కేపల్లి- పందిళ్లపల్లి వరకు రూ. 4 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, చింతకాని పరిధిలోని నరసింహాపురం ఎస్సీ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, నాగులవంచ గ్రామంలో నాగులవంచ నుండి రైల్వే కాలనీ ఆర్ అండ్ బీ రోడ్డు అండర్పాస్ వరకు రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటి సీఎం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో మౌళిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా గత 34 నెలలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామనితెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని, ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.60 పైగా విలువైన సన్న బియ్యాన్ని రాష్ట్రంలోని కోటి 6 లక్షల కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గతంలో ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ. 5 లక్షలు జమ చేస్తున్నామని తెలిపారు.

మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండవ విడతలో మరో రెండున్నర లక్షల ఇండ్ల మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీ లేని రుణాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి బస్సులు, సౌర విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం




భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 27(మనంప్రతినిధి): జిల్లా కేంద్రానికి సమీపంలోని లక్ష్మి దేవి పల్లి మండలంలోని కారుకొండ రామవరం బౌద్ధ గుహల వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 వేడుకలు విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన పర్యాటకం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సుస్థిర పర్యాటకం ప్రాధాన్యతను ప్రధానంగా వివరించారు. కారుకొండ రామవరం బౌద్ధ గుహలు మరియు అక్కడి బౌద్ధ సాంస్కృతిక నిర్మాణాల చారిత్రక ప్రాధాన్యత, వాటి పరిరక్షణ ఆవశ్యకతపై బుద్ధిస్ట్ సొసైటీ సభ్యులు అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విద్యార్థులలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణహిత జీవన విధానం మరియు బాధ్యతాయుత ప్రవర్తనపై అవగాహన కల్పించేలా స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా ఉంచడంలో విద్యార్థులు మరియు యువత భాగస్వామ్యం కీలకమని ఈ సందర్భంగా వివరించారు.

పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు భద్రత, మార్గదర్శకత్వం అందిస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్న టూరిజం పోలీసులను జిల్లా పర్యాటక నోడల్ అధికారి బి. అనూష ఘనంగా సత్కరించి, వారి అంకితభావాన్ని అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలన్నింటినీ బాధ్యతాయుతమైన, పర్యావరణహితమైన మరియు సుస్థిరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించే విధంగా నిర్వహించారు. చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను కాపాడుతూ, పరిశుభ్రతను పాటిస్తూ, స్థానిక సమాజ భాగస్వామ్యంతో పర్యాటక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మరియు డి ఆర్ డి ఓ ఎం. విద్యా చందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కారుకొండ రామవరం సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు లక్ష్మీదేవిపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వైద్యానికి పెద్దపీట వేసేది కమ్యూనిస్టు దేశాలు మాత్రమే..

### సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు సోమయ్య

### పోరాటాలలోనే కాదు సేవలో కూడా కమ్యూనిస్టులే ముందుంటారు

### విజయవంతంగా కొనసాగిన బి సి ఆర్ ట్రస్ట్ మెడికల్ క్యాంప్



భద్రాచలం, సెప్టెంబర్ 27( మనం న్యూస్): కరోనా కాలంలో అగ్రరాజ్యాలు సరిహద్దులను మూసుకొని లాక్ డౌన్ విధించుకుంటే కమ్యూనిస్టు దేశాలైన క్యూబా, రష్యా వియత్నాం వంటి అనేక దేశాలు తమ వైద్యులను ఇతర దేశాలకు పంపి మరి వైద్య సేవలు అందించారని, ఈ ప్రాంతంలో కూడా కరోనా సమయంలో అన్ని రాజకీయ పక్షాలు ఇండ్లకు పరిమితమైతే, సిపిఎం మాత్రం ఐసోలేషన్ సెంటర్లను నిర్వహించి ప్రజల ప్రాణాలను కాపాడిందని సిపిఐ ఎం సీనియర్ నాయకులు సోమయ్య అన్నారు. ఆదివారం బిసిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల,నెల వైద్యం లో భాగంగా స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ఆవరణలో చేపట్టిన మెడికల్ క్యాంప్ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు అధ్యక్షతన జరిగిన సభకి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టులు అంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించడమే కాదు. వైద్యానికి కూడా పెద్దపీట వేస్తారని సోమయ్య అన్నారు.

**పోరాటాలలోనే కాదు సేవలను కమ్యూనిస్టులే ముందుంటారు....**

**సిపిఐ ఎం సీనియర్ రాష్ట్ర నాయకురాలు బత్తుల హైమావతి...**

కమ్యూనిస్టులు అంటే ప్రజల కష్టాలలో అండగా ఉంటారని, మరోసారి బి సి ఆర్ ట్రస్ట్ ద్వారా నిరూపితమైందని సిపిఎం సీనియర్ నాయకులు బత్తుల హైమావతి అన్నారు. సమస్యలు ఉన్నచోట కమ్యూనిస్టు లు ఉంటారని రుజువు చేస్తూ, నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరాయంగా పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం కార్యకర్తలు ఇప్పుడు బి సి ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమంలోనూ తమదే పైచేయని నిరూపిస్తున్నారని అన్నారు. ప్రతినెల చక్కెర, రక్తపోటు బాధితుల కోసం మెడికల్ క్యాంపు నిర్వహించడం మందులను అందించటం ఎంతో అభినందనీయమని హైమావతి అన్నారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిలో కుంజా బుజ్జి సున్నం రాజయ్య, మీడియం బాబురావు వంటి ప్రజాప్రతినిధుల పాత్ర మరువలేనిదని, ఆదివాసి ప్రజల కోసం మనుగడ కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎంతోమంది మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలు ఈ ప్రాంతం వారే కావటం గర్వకరమని అన్నారు. బిసిఆర్ ట్రస్ట్ నెల నెల వైద్యంలో భాగంగా ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపు నిర్వహణను మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మీడియా బాబురావు, సిపిఐ ఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య లు పరిశీలించి రోగులను విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెడికల్ క్యాంప్ నిర్వహణపై సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ల తో మాట్లాడి పలు సూచనలను చేశారు.. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ నీరజారెడ్డి, డాక్టర్ తేజస్వినిలు పాల్గొని వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి ,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు కొలగాని రమేష్, నాదెండ్ల లీలావతి, అజయ్ కుమార్,జి జీవన్ జ్యోతి, ఉస్తెల జ్యోతి, సంద్ర భూపేంద్ర, ఐద్వా నాయకురాలు యర్రంశెట్టి పూర్ణిమ,నారాయణ తదితరులు పాల్గొని వాలంటరీ సేవలు అందించారు.

### తెలంగాణ రాష్ట్ర సాధనకు కొండా లక్ష్మణ్

# అలుపెరగని పోరాటం

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా

### ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు మంత్రి పదవికి రాజీనామా చేసిన త్యాగశీలి

### ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



ఖమ్మం సెప్టెంబర్ 27(మనం న్యూస్): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అవిరళ కృషి చేసిన అలుపెరగని పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా అన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, ఖమ్మం ఆధ్వర్యంలో లకారం ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా నిర్వహించగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా పాల్గొని కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా మాట్లాడుతూ₹ ప్రత్యేక తెలగాణ రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం చేశారని, సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కష్టపడి అభివృద్ధి చేసుకొని వారి ఆశయాలను నెరవేర్చాలని అన్నారు.

మాటలకు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కొరకు మంత్రి పదవిని సైతం 1969 ఉద్యమ సమయంలో రాజీనామా చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని, అటువంటి మహనీయుల త్యాగాల ఫలితాలు నేటి తరానికి బంగారు బాటలు వేశాయన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సామాజిక అభ్యున్నతి కొరకు కృషి చేసిన మహనీయుడని, ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరంతరం శ్రమించిన మహనీయుల జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోష కరమని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితంలో సమాజ శ్రేయస్సు కోసం అనేక త్యాగాలు చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకొని ముందుకు సాగాలని, ఆయన కీర్తిని, చేసిన పనులను ప్రజలలోకి విస్తృతంగా తీసుకొని వెళ్లాలని అన్నారు.

అంతకు ముందు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, బిసి సంఘ నాయకులు చిలకమర్రి శ్రీనివాస బాబు, జల్ల లక్ష్మీనారాయణ, పెండెం జనార్ధన్, కమర్థపు గోపాలరావు, బండారు శ్రీను , మల్కా సురేష్, పిల్లలమర్రి కొండలరావు, పులిపాటి సంపత్ కుమార్ , చందా వీరభద్రం, పెందోట సోమేశ్వర చారి, జొల్ల వెంకటేశ్వర్లు, లింగన బోయిన పుల్లారావు, బాసటి హనుమంతరావు కూరపాటి సతీష్, మసనం సీతా రాములు, వల్లపు సోమరాజు, కోమటి లింగమూర్తి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సూరంపల్లి దశాబ్దాల నిరీక్షణకు ఫలితం

### కొణిజర్ల-దొనబండ రోడ్డుకు రూ.21 కోట్ల అనుమతి

### రహదారి మంజూరుపై కాంగ్రెస్ నాయకులు, ప్రజల హర్షం




కొణిజర్ల,సెప్టెంబర్ 27 (మనం న్యూస్): కొణిజర్ల మండల ప్రజల దీర్ఘకాల డిమాండ్కు సంబంధించి కొణిజర్ల-తుమ్మలపల్లి-దొనబండ రహదారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. మొత్తం 10 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి పనులకు ఈ నిధులను కేటాయిస్తూ ప్రభుత్వం సెప్టెంబర్ 26న ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు మాట్లాడుతూ, రహదారి అవసరాన్ని దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పలుమార్లు వినతులు సమర్పించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనూ రహదారి నిర్మాణం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రహదారికి రూ.21 కోట్ల పరిపాలనా అనుమతి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ సహకారంతో రహదారికి అనుమతి లభించిందని రామారావు తెలిపారు. రహదారి అభివృద్ధికి సహకరించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రహదారి అభివృద్ధితో రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకోవడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు ప్రయోజనం కలుగుతుందని రామారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు.సర్పంచ్ గుదే పుష్పావతి మాట్లాడుతూ, రహదారి కోసం సూరంపల్లి రామారావు ఎన్నో సంవత్సరాలుగా ప్రజల అవసరాలను అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. రహదారికి అనుమతి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ రహదారి పూర్తయితే తుమ్మలపల్లి, దొనబండతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొనకంచి మోష, మాజీ సొసైటీ చైర్మన్ నెల్లూరి రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కామతం నాగేశ్వరరావు, కామతాల రేణుక, నాగేశ్వరరావు, విజ్జిగాని వెంకన్న, వివిధ పార్టీల నాయకులు గదల్ శ్రీను, బండారు సాంబయ్య, కట్ల సత్యం, బండారుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ అందుబాటులో: కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 27 (మనంప్రతినిధి): జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ మరో ఐదు రోజుల పాటు వర్ష హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

వర్షాలు, వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఐడీఓసీలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఐడీఓసీలోని జి-19 గదిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08744-241950 నంబర్తో 24x7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధులకు నియమించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారులకు చేరవేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్కు వచ్చే ప్రతి ఫోన్ కాల్ను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, సమస్యకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖ అధికారులకు వెంటనే తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాలు, వరదల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలు వర్షాలు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో 08744-241950 కంట్రోల్ రూమ్ నంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు.

# అభివృద్ధే మా అజెండా

ప్రజలతోనే కూటమి ప్రభుత్వం..
ప్రజల కోసమే పాలన
ప్రతి కుటుంబానికి సంక్షేమం..
ప్రతి గ్రామానికి అభివృద్ధి
హింసను ప్రేరేపించడం
మా విధానం కాదు
శీఫారం వద్ద 25 ఎకరాల్లో
త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీ
మహదేవపల్లిలో రూ.45 లక్షలతో
అభివృద్ధి పనులకు
త్వరలో భూమిపూజ



పెనుకొండ సెప్టెంబర్ 27 మనం న్యూస్: ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి అభివృద్ధి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. ప్రజలతోనే కూటమి ప్రభుత్వం.. ప్రజల కోసమే పాలన సాగుతోందని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం ప్రతి గ్రామానికి అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు శీఫారం, మహదేవపల్లిలో ఆదివారం మంత్రి సవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వివిధ పథకాల లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత రెండున్నరేళ్లుగా ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తున్నామని, ఎన్నికల సమయంలోనూ ప్రజలను ఓట్లు అడుగుతామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలకు సంబంధించి చట్టం తన పని తాను చేసుకుపోతోందని అన్నారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదని, చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎక్కడా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించలేదని, ఏ నాయకుడినైనా, కార్యకర్తనైనా హింసకు ప్రేరేపించేలా తమ నాయకులు మాట్లాడలేదని తెలిపారు. హింసను ప్రేరేపించడం తమ విధానం కాదని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులకు పెద్దపీట::**

పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి సవిత తెలిపారు. మహదేవపల్లిలో సుమారు రూ.45 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు త్వరలో భూమిపూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మహదేవపల్లికి సంబంధించిన బ్రిడ్జి సమస్యను త్వరలో పరిష్కరించి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇంటి పొజిషన్ పత్రాలను మంత్రి అందజేశారు. అమృత్ 2.0 పథకం ద్వారా పెనుకొండ మున్సిపాలిటీలో సుమారు రూ.100 కోట్లతో ఇంటింటికీ మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని మంత్రి తెలిపారు. శీఫారం వద్ద సుమారు 25 ఎకరాల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని చెప్పారు. ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం::కియా పరిశ్రమ కారణంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా 'తల్లికి వందనం' వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రచార ఆర్భాటానికి కాకుండా ప్రజలకు ఉపయోగపడే సేవలు, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా కొనసాగిస్తామని మంత్రి సవిత తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వాతి, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర నాయుడు, బిజెపి రామకృష్ణ, రియాజ్, డ్వాక్రా రామాంజనేయులు,, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డిమెట్ల గ్రామములో కార్డెన్ అండ్ సెర్చ్



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 27 మనం న్యూస్: మండల పరిధిలో ని కడిమెట్ల గ్రామంలో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ ఇంచార్జ్ పత్తికొండ డి.ఎస్. పి.వెంకట్రామయ్య పర్యవేక్షణలో కడిమెట్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను నియంత్రణ చేయడంలో భాగంగా ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ.చిరంజీవి పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు గారు, రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఓ. శ్రీనివాసులు పట్టణ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి నందవరం మండలము పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ s తిమ్మారెడ్డి మరియు రూరల్ సర్కిల్ పోలీస్ సిబ్బంది 40 మంది కలసి ఉదయము 06.00 గంటలకు కార్డెన్ అండ్ సెర్చ్ (గ్రామాన్ని చుట్టు ముట్టి తనిఖీ)నిర్వహించినారు. గ్రామములో అనుమానితులను మరియు వివాదస్పద వ్యక్తులను పిలిపించి వారికి కౌన్సెలింగ్( మంత్రణం )నిర్వహించి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ. చిరంజీవి ప్రజలకు మద్యం తాగుట, గంజాయి వాడటం, పేకాట, మట్కా వంటి జూదములు ఆడడము వంటి చెడు అలవాట్ల వలన కలిగే కష్ట నష్టాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి వాడటము వలన యువత భవిష్యత్తునాశనం అవుతుందని, వారి కుటుంబము ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అక్రమ మద్యం క్రయ విక్రయాలు గంజాయి లేదా అసాంఘిక కార్యకలాపాలు యొక్క సమాచారం ఉంటే మా దృష్టికి లేదా 1972 నెంబర్ కు ఫోన్ చేయాలని, అదే విధంగా సైబర్ నేరాలు గురించి అప్రమత్తంగా వుండాలని, సైబర్ మోసాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వ నిర్బంధం తగదు



జూపాడుబంగ్లా సెప్టెంబర్ 27 (మనం న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని శాంతియుత ఆందోళన కి పిలుపిస్తే మహిళ ఉద్యోగులు అని చూడకుండా అక్రమ అరెస్టులు నిర్బంధాలతో నిరసనలను అణచివేయడం తగదని ఏదైనా చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలి తప్ప ఇలాంటి ధోరణిలతో ఉద్యమాలను అనచలేరని తక్షణమే మరోసారి చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం అవుతుందని ఏఐటీయూసీ సచివాలయ వింగ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు అన్నారు.ఆదివారం స్థానిక కార్యాలయం లో వారు మాట్లాడుతూ.గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం వారిని అరెస్టు చేయించడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తున్నదని వారు అన్నారు.

# కాశీ విశ్వనాథుని సన్నిధిలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భీంరెడ్డి



మంత్రాలయం , సెప్టెంబర్ 27,మనం న్యూస్ గుజరాత్ రాష్ట్రంలో వెలిసిన కాశీ విశ్వనాథుని మంత్రాలయం వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భీమా రెడ్డి , మాజీ ఎంపిపి రాజేశ్వరి సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా వారు కాశీ విశ్వనాథుని పూజలు , అభిషేకాలు చేసి ,మొక్కులు తీర్చుకున్నారు.. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం ప్రజాసేవలో మరింత బలంగా ముందుకు సాగాలని పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అలాగే మంత్రాలయం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి, ఆనందం, సిరిసంపదలు నిండాలని ప్రత్యేకంగా ప్రార్థించారన్నారు.

# నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

**85 మంది లబ్ధిదారులకు రూ.95 లక్షల విలువైన చెక్కుల పంపిణీ: ఏపీ మంత్రి సవిత**



పెనుకొండ సెప్టెంబర్ 27 మనం న్యూస్: నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.95 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి సవిత పెనుకొండ క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వైద్య చికిత్సలు, ఇతర అత్యవసర అవసరాల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు పెనుకొండ నియోజకవర్గంలో 1,391 మంది లబ్ధిదారులకు రూ.15.09 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని మంత్రి సవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ భారతదేశ నిర్మాణం కోసం కృషి చేయాలి

- రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



అనంతపురం, సెప్టెంబర్ 27, మనం న్యూస్: శాస్త్రీయ భారత దేశ నిర్మాణం కోసం విద్యార్థులు కలిసికట్టుగా కృషి చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను నగరంలోని ఆరట్స్ కళాశాల డ్రామా హాలు నందు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కె.చిత్తప్ప అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాచపాలెం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతున్న సామాజిక పాఠ్యపుస్తకాలలో ఈ సృష్టికి మూలం మత గ్రంథాలు లేదా మతం అని ఎక్కడైనా ముద్రించబడిందా అని విద్యార్థులను ప్రశ్నించారు. అవేమీ సృష్టికి మూలానికి కారణం కాదని మనమంతా తెలుసుకొన్న, ఆలోచనలు మాత్రం అశాస్త్రీయ భావజాలం వైపు, వాటిని ప్రచారం చేస్తున్న బాబాల వైపు పరిగెడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సైన్స్ పట్ల ఆసక్తి కలిగి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకున్న ప్రతి ఒక్కరు కూడా జీవిత గమనంలో విజయం సాధిస్తారని, అలాంటి వారే శాస్త్రీయ భారత దేశ నిర్మాణం కోసం కృషి చేయగలరని మీరంతా ఆ వైపుగా ఆలోచించాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రశ్నించడం అలవాటు చేసుకోవడం ద్వారానే మనలోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన అన్నారు. ఈ భూమి మీద ఉండే పరిసరాలు ఎప్పుడు ఒకేలా ఉంటాయని మనమంతా భావిస్తామని ఇది ఎందుకు ఇలా ఉంది అని తనలోని ప్రశ్న వేసుకున్న వారే దాని రహస్యాన్ని చేదించగలరని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఆ రకమైన అలవాట్లను లవర్చుకోవాలని ఆమె విద్యార్థులను కోరారు. మొత్తం ప్రపంచం శాస్త్ర సాంకేతికత వైపు చూస్తుందని, ప్రజలు మతం మతాచారాల పట్ల కాకుండా శాస్త్రీయంగా ఆలోచించడం ప్రారంభించారని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.వంశీకృష్ణ అన్నారు. పాశ్చాత్య దేశాలలో నివసిస్తున్న ప్రజలు ఎక్కువగా శాస్త్రీయ భావజాలంపై మక్కువ చూపడం వల్ల అక్కడ ప్రస్తుతం అనేక దేవాలయాలు మూతపడుతున్నాయని దీన్ని బట్టి చూస్తే మతం దేవుడు కంటే సైన్సు గొప్పదని మనకర్థమవుతుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొన్న మీరంతా కూడా ఊహా జనితమైనటువంటి ఆలోచనలు వీడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేసుకోవాలని అప్పుడే మీ జీవితంలో మంచి విజయాలు సాధించగలరని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఆదివారం జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో జిల్లా వ్యాప్తంగా ముగ్గురు విద్యార్థులతో కూడిన 42 టీం లు పాల్గొన్నాయని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలిపారు. అనంతరం జిల్లాస్థాయి ప్రశ్నపత్రాలను డిప్యూటీ డిఇఓ శ్రీనివాసరావు చేత ఆవిష్కరించారు. చెకుముకి సంబరాల్లో జిల్లా స్థాయి విజయదులైన విద్యార్థులకు జే వి వి నేతలు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు నాయక్ రాజనీతి శాస్త్ర అధ్యాపకులు బి.గోపాల్ నాయక్, జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా నాయకులు మహమ్మద్ జిలాన్, కె.లక్ష్మీనారాయణ, ఎస్.గాంగే నాయక్, ఎస్. తిరుపాల్ కె.ప్రసాద్ రెడ్డి, ప్రసాద్ రామకృష్ణ, నాగ రంగ నాగరాజు,శివానంద,జగదీష్ తిప్పే స్వామి, నాగరాజు స్వామిలతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ ప్రైవేటు కళాశాల, పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల అరెస్టులను ఖండిస్తున్నాం



కర్నూలు సెప్టెంబర్ 27మనం న్యూస్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన 9 డిమాండ్ల సాధన కోసం చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో, శాంతియుతంగా విజయవాడలో ఉద్యమిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐ ఎఫ్ టి యూ) జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్ తీవ్రంగా ఖండించారు. సచివాలయ వ్యవస్థకు వెన్నెముక లాంటి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు గత కొన్నేళ్లుగా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా ఉద్యోగ భద్రత కల్పించాలి, ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలి వేతన సవరణ చేయాలి.బదిలీలలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి అదనపు పనిభారాన్ని తగ్గించాలిసర్వీస్ రూల్స్ సక్రమంగా అమలు చేయాలి.

# క్లెయిమ్లు మరియు అభ్యంతరాలపై సూపర్‌చెక్



అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 27 : మనం న్యూస్:అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఆదివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026)పై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలిసి క్లెయిమ్లు మరియు అభ్యంతరాల సూపర్చెక్ (క్లెయిమ్లు మరియు అభ్యంతరాల ధృవీకరణ)ను అనంతపురం జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ నిర్వహించారు. జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ రెండవ విజిట్ లో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ లాగిన్ లో వచ్చిన 181 సూపర్చెక్ క్లెయిమ్స్ ని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ క్షుణ్ణంగా పరిశీలించి ఈఆర్వోలకి దిశా నిర్దేశం చేశారు. ఇందులో చేర్పులు (అడిషన్స్) కు సంబంధించి 97 క్లెయిమ్స్ ని, మార్పులుకు సంబంధించి 75 క్లెయిమ్స్ ని, తొలగింపు (డిలిషన్)నకు సంబంధించి 9 క్లెయిమ్స్ కలుపుకొని మొత్తం 181 క్లెయిమ్స్ ని సూపర్చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వోలకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ జి.సి.కిషోర్ కుమార్.. సర్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన చర్యలకు సంబంధించిన పలు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ రికార్డులు ఈఆర్ఓల వారీగా యాదృచ్ఛికంగా (ర్యాండంగా) తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఈఆర్ఓలకు పలు సూచనలు చేశారు. బల్క్ గా పెద్ద ఎత్తున ఫారం 6,7,8 లు జరగరాదని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును నమోదు కాకుండా వదలరాదన్నారు. ఓటరు జాబితాలో అనర్హులకు స్థానం కల్పించరాదన్నారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కి సంబంధించి ఓటరుగా అర్హతకు సంబంధించి సమర్పించాల్సిన డాక్యుమెంట్ల వివరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పంచనామ, స్పీకింగ్ ఆర్డర్ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో బాగా చేపట్టారని జిల్లా కలెక్టర్ ను జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026) లో భాగంగా పలు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ కు సంబంధించిన వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ఓలు అనంతపురం ఆర్డీఓ ప్రేమంతకుమార్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, ఎస్డీసిలు రామ్మోహన్, రమేష్ రెడ్డి, వెంకట నారాయణ, రవిశంకర్ రెడ్డి, కిరణ్మయి, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎలక్షన్ డిటిలు, పాల్గొన్నారు.

# భారత ఎన్నికల కమిషన్ తీసుకున్న రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు అమానుషం

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన
- హాజరైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి



మడకశిర, సెప్టెంబర్ 27,మనంన్యూస్: భారత ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న రాజ్యాంగ వ్యతిరేఖ నిర్ణయాలకు వ్యతిరేఖౌగా మడకశిరలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మడకశిర ఎంపీడీఓ కార్యాలయం ఎవరణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు,స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రఘువీరారెడ్డి హాజరయ్యారు. తొలుత అయన గాంధీ విగ్రహంనకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేఖ నిర్ణయాలు,ఇసి వైఖరి పట్ల పెద్ద ఎత్తున నినాదాలు చేసారు.స్థానిక మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంగులవాయిపాళ్యం ప్రభాకర్ రెడ్డి తదితరులతో కలసి భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పెద్దాయన రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కుతో ఇసి చెలగాటం ఆడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. ఎన్నికల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలన్నారు.కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఓటు హక్కుపై వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అయన డిమాండ్ చేసారు. ఎన్నికల్లో పూర్తి పారదర్శకత కల్పించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు.ఇవిఎంలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలన్నారు.ఓట్ల దొంగతనం ఆరోపణలకు తెరదించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిందిగా రఘువీరారెడ్డి డిమాండ్ చేసారు. ఎన్నికల సంఘం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మన ఓటు, మన హక్కు అన్న నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మరో ఉద్యమానికి సన్నద్ధమవుతుందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు రఘువీరారెడ్డి స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజక వర్గంలోని 5 మండలాలకు చెందిన పార్టీ మండల కన్వీనర్లు, రాష్ట్ర, జిల్లా, పార్లమెంట్, మండల, గ్రామ స్థాయి నాయకులు అధికసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజాధనంతో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్ను నిరుపయోగంగా ఉంచడం బాధాకర



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 27 మనం న్యూస్: పట్టణంలో ప్రభుత్వ 100 పడకల హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ ను తక్షణమే పునర్ ప్రారంభించి రోగులకు నిరంతరం ప్రాణవాయువు ను అందించాలని కోరుతూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రోజు నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచాన్ని కరోనా కుదిపేస్తున్న నేపథ్యంలో ప్రాణవాయు లేక అనేక మంది ప్రజలు మరణించడం జరిగిందని వారు గుర్తు చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి హాస్పిటల్ లో ఆక్సిజన్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగింది, అయితే ఎమ్మిగనూరు ప్రభుత్వ హాస్పిటల్ లో 2022 జనవరి 10వ తేదీన 35 లక్షల రూపాయలు ప్రజాధనాన్ని వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఇప్పటివరకు ఆక్సిజన్ ప్లాంటును ఉపయోగించకుండా నిరుపయోగంలో ఉంచడం అత్యంత బాధాకరమని వారు తెలిపారు.

# సర్ ప్రక్రియ ముగిసే వరకు బాగా పనిచేయాలి

- క్షేత్రస్థాయిలో జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ జి.సి.కిషోర్ కుమార్ పర్యటన



అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 27 : మనం న్యూస్: అనంతపురం జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మరియు ఆంధ్రప్రదేశ్ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణ గోదావరి కెనాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సి.కిషోర్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆదివారం అనంతపురం రూరల్ పరిధిలోని ఏ.నారాయణపురం - 2 స్వర్ణ గ్రామం సచివాలయంలో, విద్యారణ్యానగర్ లోని జెడ్పి ఉన్నత పాఠశాలలో, పాపంపేటలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తో కలసి జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - 2026)పై క్షేత్రస్థాయిలో పర్యటించి పలు వివరాలు ఆరా తీశారు. ముందుగా రూరల్ పరిధిలోని ఏ.నారాయణపురం - 2 స్వర్ణ గ్రామం సచివాలయంలో ఎస్ఐఆర్ లో ఏం చేస్తున్నారు అనేది విఆర్వో/బిఎల్వో ను అడగగా, ఎస్ఐఆర్ కు సంబంధించిన క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల గురించి తెలియ చేస్తూ ఫారం 6,7,8 పై పలు వివరాలు స్పష్టంగా విఆర్వో/ బిఎల్వో తెలియజేయగా, ఎస్ఐఆర్ పైన బాగా అవగాహన ఉందని, బాగా పనిచేస్తున్నారని రోల్ అబ్జర్వర్ సదరు బీఎల్వో ను అభినందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మూగిసే వరకు బాగా పనిచేయాలని సూచించారు. అనంతరం విద్యారణ్యానగర్ లోని జెడ్పి ఉన్నత పాఠశాలలో పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని బిఎల్ఓలతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి, వాటిని ఎలా పరిష్కరిస్తున్నారని రోల్ అబ్జర్వర్, జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు జారీ చేశారు. బిఎల్వో యాప్ తదితర అంశాల వివరాలను అబ్జర్వర్ కి బీల్వోలు తెలిపారు. తదనంతరం పాపంపేటలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో 75 నుంచి 86 వరకు పోలింగ్ కేంద్రాలలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు వివరాలు అడిగి తెలుసుకొని, బిఎల్వోలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేసి వారికి రోల్ అబ్జర్వర్, జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రేమంత కుమార్, ఈఆర్ఓ వెంకటనారాయణ, తహసిల్దార్ రాజా, ఎఈఆర్ఓ ఎంపీడీవో దివాకర్, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# కోహ్లీ కొట్టుడు... తేలిపోయిన బౌలర్లు



తిరువనంతపురం లోని గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో వెస్టిండీస్తో జరిగిన తొలి వన్డే మ్యాచ్లో టీమిండియా అద్భుతమైన ఆధిపత్య ప్రదర్శన కనబరిచింది. కరేబియన్ జట్టు నిర్దేశించిన 296 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు అలవోకగా ఛేదించి, 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్ల వన్డే సిరీస్లో భారత్ 1-0 తేడాతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**కోహ్లీ రికార్డు.. గిల్ సెంచరీతో భారత్ ఈజీ చేజ్:**

196 పరుగుల లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్కు ఓపెనర్ రోహిత్ శర్మ చక్కటి ఆరంభాన్నిచ్చాడు. కెప్టెన్ శుభ్మన్ గిల్ తో కలిసి ఇన్నింగ్స్ ముందుకు నడిపించాడు. ఈక్రమంలో రోహిత్ 35 బంతుల్లో 32 పరుగులు చేసి అల్జారి జోసెఫ్ బౌలింగ్లో వెనుదిరిగాడు. హిట్ మ్యాన్ పెవిలియన్ చేరిన తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ తో కలిసి గిల్ మ్యాచ్ను పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకున్నారు. శుభ్మన్ గిల్ బాధ్యతాయుతంగా ఆడుతూ అద్భుతమైన శతకం (101 పరుగులు)తో చెలరేగగా.. మరోవైపు విరాట్ కోహ్లీ ( 10 ఫోర్లు, 9 సిక్సులతో 139 పరుగులు) తనదైన శైలిలో దూకుడైన శతకంతో రెచ్చిపోయాడు. ఈ నేపథ్యంలో కరేబియన్ బౌలర్లను పూర్తిగా నిలువరించి భారత జట్టుకు కింగ్ కోహ్లీ విజయాన్ని అందించాడు.

**15 వేల మైలురాయిని అందుకున్న విరాట్:**

ఈ మ్యాచ్లో విరాట్ కోహ్లీ తన అద్భుతమైన కెరీర్లో మరో చరిత్రాత్మక మైలురాయిని అందుకున్నారు. అంతర్జాతీయ వన్డే క్రికెట్లో 15,000 పరుగుల మార్కు పూర్తి చేశారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ అరుదైన ఘనత సాధించిన రెండో భారత బ్యాటర్గా కోహ్లీ చరిత్ర సృష్టించారు. వన్డే ఫార్మాట్లో ఆయన చూపుతున్న అసాధారణ నిలకడకు ఈ రికార్డే నిదర్శనం.

## 24 గంటల్లో 3 మ్యాచ్‌లు..
# సింధు అసంతృప్తి



ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు ఓటమి పాలయ్యారు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో చెన్ యు ఫీ (చైనా) చేతిలో 11-12, 21-18, 21-10 తేడాతో ఓడిపోయారు. అనంతరం మాట్లాడుతూ.. ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ షెడ్యూల్ సరిగ్గా లేదని విమర్శించారు. తగినంత విశ్రాంతి సమయం ఇవ్వకుండా వెను వెంటనే మ్యాచ్‌లు నిర్వహించారని పేర్కొన్నారు. 24గంటల వ్యవధిలో మూడు సింగిల్స్ మ్యాచ్‌లు నిర్వహించడంపై అసంతప్తి వ్యక్తం చేశారు. '24 గంటల వ్యవధిలో మూడు మ్యాచ్‌లు ఆడడం అనేది కేవలం మానసిక సన్నద్ధతకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. సుదీర్ఘమైన మ్యాచ్‌లు జరిగినప్పుడు.. కచ్చితంగా శరీరానికి విశ్రాంతి అవసరం. ఆటలో మంచి స్థితిలో ఉన్నప్పటికీ విశ్రాంతి లేకపోవడం వల్ల అలసటతో కాళ్లు కదలవు. నేను మెరుగైన ఆటతీరు కనబర్చానని అనుకుంటున్నాను. కానీ మ్యాచ్‌ల నిర్వహణ సమయాలు మరింత మెరుగ్గా ఉంటే బాగుండేది' అని సింధు పేర్కొన్నారు. శనివారం సింధు రెండు మ్యాచ్‌లు ఆడగా.. రెండో మ్యాచ్ అర్ధరాత్రి దాటాక (స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 1 గంటలకు) ముగిసింది. ఆ తర్వాత చైనాకు చెందిన చెన్ యు ఫీతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యాహ్నం 1:30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ప్రారంభమైంది. ఆ మ్యాచ్‌లో ఓడిపోయారు. మరో భారతీయ షట్లర్ ఉన్నతి హుడా సైతం మ్యాచ్ షెడ్యూలింగ్ పట్ల అసంతప్తి వ్యక్తం చేశారు. ఒకే రోజు రెండు, మూడు మ్యాచ్‌లు ఆడాల్సి రావడం వల్ల క్రీడాకారులు అలసిపోయారని పేర్కొన్నారు. అయితే..క్వార్టర్ ఫైనల్స్‌లో తన ఓటమికి దీనినే కారణంగా చూపబోనని అన్నారు.

## నాలుగు సిరీస్‌లుగా 'రణబాలి' డాక్యుమెంటరీ.. ప్రకటించిన మేకర్స్



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఎందయ్యా సామి' సాంగ్ మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఈ సానుకూల స్పందనని మరింతగా పెంచేందుకు మేకర్స్ సరికొత్త ప్రమోషనల్ స్ట్రాటజీతో ముందుకొచ్చారు. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన ఓ స్పెషల్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేయనున్నారు. మొత్తం నాలుగు ఎపిసోడ్‌లుగా రానున్న ప్రమోషన్ సిరీస్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న, దర్శకుడు రాహుల్ సాంకత్యాన్ స్వయంగా పాల్గొననున్నారు. సినిమా గురించి, ఆ కథ వెనుక ఉన్న ఎన్నో ఆసక్తికరమైన విషయాలను వారు ఇందులో పంచుకోనున్నారు. ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తోంది. వివాహం తర్వాత విజయ్, రష్మిక కలిసి నటించిన తొలి చిత్రమిదే. దసరా కానుకగా అక్టోబర్ 16న థియేటర్లలో ఈ మూవీ భారీ స్థాయిలో విడుదల కానుంది.

## 'వారణాసి' తర్వాత మహేష్ నెక్ట్స్..
# రూమర్స్‌పై లేటెస్ట్ క్లారిటీ!



సూపర్ స్టార్ మహేష్ బాబు ఇపుడు టాలీవుడ్ నుంచి గ్లోబల్ మార్కెట్ కి తన వారణాసి సినిమాతో వెళ్లబోతున్న సంగతి అందరికీ తెలిసిందే. దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి కలయికలో చేస్తున్న ఈ బిగ్ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ బాబు నెక్ట్స్ ఏంటి అనే చర్చ ఎప్పుడు నుంచో ఉంది. ఆల్రెడీ తన పార్ట్ పూర్తి చేసేసుకున్న మహేష్ బాబు ఇప్పుడు రెస్ట్ మోడ్ లో ఉన్నారు. అయితే ఈ సినిమా తర్వాత మహేష్ బాబు లైనప్ లో కోలీవుడ్ సెన్సేషనల్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ వచ్చాడు అని పలు రూమర్స్ ఇప్పుడు ఒక్కసారిగా వైరల్ గా మారాయి. అయితే ఈ రూమర్స్ పై లేటెస్ట్ క్లారిటీ తెలుస్తోంది. మహేష్ నెక్ట్స్ వస్తున్న ఆ రూమర్స్ లో ప్రస్తుతానికి ఎలాంటి నిజం లేదట. కేవలం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, మహేష్ నడుమ ప్రాజెక్ట్ కోసం ఇద్దరూ పలుమార్లు చర్చలు అయితే జరిపారు కానీ ప్రస్తుతానికి సందీప్ కి ఉన్న కమిట్మెంట్స్ రీత్యా వీరి కాంబినేషన్ సెట్ అవ్వడానికి కూడా సమయం పడుతుంది అని తెలుస్తోంది. సో మహేష్ బాబు తదుపరి సినిమా విషయంలో ఇంకా ఏది కన్ఫర్మ్ కాలేదు అని చెప్పొచ్చు. ఏమైనా ఉంటే అధికారికంగానే బయటకి వస్తుంది. అప్పటి వరకు వారణాసి యుఫోరియాలో మునిగి తేలడమే.




## సాలిడ్ బీట్స్‌తో 'ఆదర్శ కుటుంబం' నుంచి నారాయణమ్మ.!

ఎనర్జిటిక్ సీనియర్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్ హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించిన అవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రమే ఆదర్శ కుటుంబం. ఫామిలీ ఆడియెన్స్ లో మంచి అంచనాలు ఉన్న ఈ సినిమా నుంచి అవైటెడ్ ఫస్ట్ సింగిల్ నారాయణమ్మ ను ఎట్టకేలకు కొంత ఆలస్యం తర్వాత రివీల్ చేశారు. అయితే మొదటి నుంచీ హైప్ ఇస్తున్నట్టు గానే ఈ ఫుల్ సాంగ్ ఒక సాలిడ్ చార్ట్ బస్టర్ అని చెప్పొచ్చు. సంగీత దర్శకుడు థమన్ మరోసారి త్రివిక్రమ్ టేస్ట్ కి తగ్గట్టుగా సాలిడ్ వర్క్ ని డెలివరీ చేశారు. రామజోగయ్య శాస్త్రి సంగీతం, ఫీమేల్ వోకల్స్ పర్ఫెక్ట్ గా ఈ సాంగ్ కి సెట్ అయ్యాయి. ఇక విజువల్ గా కూడా సాంగ్ హీరోయిన్స్ శ్రీనిధి, డింపుల్ అలాగే నివేతా లు ఇందులో మంచి డాన్స్ మూమెంట్స్ తో అదరగొట్టారు. ఇక తర్వాత వెంకీ మామ ఎంట్రీ ఇచ్చి మరింత ఎనర్జీ ఈ సాంగ్ కి యాడ్ చేశారు. సో మొత్తానికి కొంచెం లేట్ చేసినా ఒక బ్లాక్ బస్టర్ సాంగ్ ని డెలివరీ చేసారు. ఇక ఈ సినిమాకి హారిక హాసిని వారు నిర్మాణం వహించారు. అలాగే ఈ అక్టోబర్ 9న గ్రాండ్ గా విడుదల కాబోతోంది.



**సామాజిక మాధ్యమాల్లో స్త్రీ ద్వేషపూరిత చర్చను.. స్త్రీ, పురుషుల మధ్య పోరాటంగా చూడకూడదని అన్నారు హిందీ నటి కతిసనన్. ఇటీవల బిహార్‌లోని జముయి జిల్లాలో ఓ మైనర్ విద్యార్థినిని చుట్టుముట్టి లైంగికంగా వేధించిన ఘటనపై సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాల నేపథ్యంలో.. ఆ సంఘటనను ప్రస్తావించకుండానే కతి ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఇది స్త్రీ, పురుషుల మధ్య పోరాటం కాదు. స్త్రీలను తక్కువగా చూసే పురుషులకు, అలాగే పితస్వామ్యాన్ని ఒక సాంస్కతిక విలువగా భావిస్తున్న స్త్రీలకు మధ్య జరుగుతున్న పోరాటం. లైంగిక హింస నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో మహిళలకు ఇంకెంత కాలం బోధిస్తూనే ఉంటారు? పురుషులకు మహిళలను వేధించవద్దని ఎందుకు చెప్పడం లేదు? ఒక మైనర్‌పై అత్యాచారం జరిగినప్పుడు ఆ దారుణానికి**

# ఆ భారాన్ని మహిళలపై మోపడం ఆపండి!

**పాల్పడిన వ్యక్తి మనస్తత్వం ఎలాంటిది అని ఎందుకు ప్రశ్నించరు? దానికి బదులుగా అందరూ ఆ అమ్మాయి ఏ దుస్తులు వేసుకుంది, ఎక్కడ ఉంది, ఎవరితో ఉంది, ఎందుకు బయటకు వెళ్లింది, ఆమె కుటుంబం ఎందుకు అనుమతించింది అని అడుగుతూనే ఉంటారు. తమను తాము సురక్షితంగా ఉంచుకునేందుకు మరింత జాగ్రత్తగా ఉండాలని మహిళలకు ప్రతిసారీ చెప్పడం ఆపండి. పురుషులకు మహిళలను గౌరవంగా చూడటం, తమ హద్దుల్లో ఉండడం నేర్పించాలి.**

**వారి ప్రవర్తనకు బాధ్యత వహించడం, అంగీకారం, గౌరవం అంటే ఏమిటో తెలియజేయాలి. తప్పుగా ప్రవర్తించే పురుషుల తప్పుల భారాన్ని మహిళలపై మోపడం ఆపండి అని క్రితిసనన్ పేర్కొన్నారు.**

## ఓటీటీ డేట్ ఫిక్స్ చేస్తున్న మమితా బైజు ఇండస్ట్రీ హిట్!



వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ తో ఈ ఏడాది తన నామ సంవత్సరంగా మార్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ మమితా బైజు దాదాపు దక్షిణాదిన అన్ని ఇండస్ట్రీలలో సినిమాలు చేయడం అవి ఒకోకటి భారీ గ్రాసర్ లు గా కూడా నిలిచాయి. ఇక వీటిలో మలయాళ ఇండస్ట్రీ హిట్ సినిమా 'బెత్లెహామ్ కుటుంబ యూనిట్' కూడా ఒకటి. ప్రేమమ్ హీరో నివిన్ పౌలి హీరోగా దర్శకుడు గిరీష్ తెరకెక్కించిన ఈ రోమ్ కామ్ డ్రామా అక్కడ 300 కోట్లకి పైగా రాబట్టి ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది.

మాసివ్ లాంగ్ రన్ తర్వాత ఇక ఫైనల్ గా ఓటీటీలో విడుదలకి ఫిక్స్ అయ్యింది. ఈ సినిమాని జియో హాట్ స్టార్ వారు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అందులో రూమర్స్ గా వినిపించిన డేట్ అక్టోబర్ 2 నుంచే పాన్ ఇండియా భాషల్లో విడుదల చేస్తున్నట్టు హాట్ స్టార్ వారు కన్ఫర్మ్ చేశారు. సో అప్పుడు మిస్ అయ్యిన వారు ఉంటే ఇప్పుడు గాంధీ జయంతి హాలిడేలో చూడొచ్చు.

# పేదల 'కల' కలేనా..!!

దశాబ్ది దాటిన...దయరాదే..!
హుజూర్‌నగర్ రామస్వామి గుట్ట
ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం లేదా
మంత్రి ఉత్తమ్ ఇలా ఖాలో దుస్థితి ఇది
లబ్ధిదారుల ఆశలు ఫలించేది ఎప్పుడో
అప్పుడు...ఇప్పుడు అంటూ
మభ్యపెడుతున్న వైనం
ఆశగా ఎదురు చూస్తున్న
నిరుపేద కుటుంబాలు





**సూర్యాపేట, సెప్టెంబర్ 27 (మనం ప్రతినిధి):** దారిద్ర రేఖకు దిగునున్న పేదల సొంత ఇంటి కల... కలగా మిగిలిపోవాల్సిందేనా! అనే ప్రశ్నకు జవాబు మాత్రం కనిపించడం లేదు.... అధికారంలో ఉన్న పార్టీకి మాత్రం దయ... కనికరం రావటం లేదు.... రేపు ...మాపో మీ కలలను సఫలం చేస్తామంటూ దశాబ్ది కాలంగా మభ్యపెడుతున్న దుస్థితి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలిస్తున్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ గృహాలు ఈ నాటికి అంటే సుమారు 13 సంవత్సరాలేనా లబ్ధిదారులకు పంపిణీ చేయలేని పరిస్థితి దాపురించింది.. తెలంగాణ ఏర్పాటు అనంతరం అధికారంలోకి తొలిసారిగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కూడా ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి నడుం బిగించిన విషయం తెలిసిందే. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను నిర్మించి వదిలేయటం.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని దశాబ్ది కాలం తర్వాత అధికారంలోకి రావడం. మళ్లీ ఆ గృహాల నిర్మాణ ల విషయం తెరపైకి వచ్చింది. ఇప్పటికైనా నిర్మాణం దాదాపుగా పూర్తయిన ఇందిరమ్మ గృహాలను పంపిణీ చేయాలనే ఆలోచనకు ప్రస్తుతం వచ్చినప్పటికీ.. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇల్లును లబ్ధిదారులకు అందజేస్తామంటూ మభ్యపెట్టి మాయ చేస్తున్న పరిస్థితి కొంతకాలంగా ఇక్కడ కొనసాగుతుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో అగ్ర నాయకున్ని రప్పించి ఆయన చేత గృహాల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో చేపడతామంటూ ఇప్పుడు మాట మార్చిన ఆ నేత పరిస్థితి చూసి లబ్ధిదారులు విస్తూ పోతున్నారు ...తమపట్ల దయ చూపండి అంటూ లబ్ధిదారులు చేతులు జోడించి ఆ నేతను అర్థిస్తున్న ఆ నేత.. మనసు మాత్రం కరగటం లేదు.... విషయంలోకి వెళితే...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలలో కొన్ని ఎలా అయితే అబాసుపాలు అవుతున్నాయో ... అలాగే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి

ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గ కేంద్రం లోని రామస్వామి గుట్ట ఇందిరమ్మ మోడల్ కాలనీ ఇండ్లు వ్యవహారం అలాగే మారింది.. ఎంపికైన లబ్ధిదారుల గోడు మాత్రం అటు ప్రభుత్వం కానీ ఇటు మంత్రి గానీ పట్టించుకోవడం లేదు. వారిని గాలికి వదిలేశారు.. ఇండ్ల సముదాయం నిర్మాణాల పనులు పూర్తి అవుతున్న మంచి మాట పంపిణీ విషయంలో కిక్కు మీకు అనటం లేదు.2013లో మంత్రిగా కొనసాగినా ఉత్తమ్ కుమార్ రెడ్డి 110 ఎకరాల్లో జి ప్లస్ వన్..135 బ్లాక్ లలో ఒక్కో ఇంటికి 217 చదరపు అడుగుల చొప్పున 21 60 ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం అందరికీ విధితమే... తెలంగాణ రాష్ట్రం వచ్చాక అప్పటి బి ఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కనీసం ఈ నిర్మాణాలను పట్టించుకున్న పాపాన పోలేదు... మన విమర్శ మూట కట్టుకుంది... తిరిగి 2023 డిసెంబర్ లో మళ్లీ కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోవడం తెలిసిందే దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది...రాష్ట్ర క్యాబినెట్లో హుజూర్నగర్ శాసనసభ్యులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్. పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్ర క్యాబినెట్లో కీలక మంత్రిగా వ్యవహరిస్తూ వస్తున్నారు... ఇది ఇలా ఉండగా ఎన్నికల ప్రచారంలో హస్తం పార్టీ నిరుపేదలకు ఇచ్చిన ముఖ్యమైన హామీలలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మించి ఇస్తామని ప్రత్యేకంగా చెప్పుకొచ్చారు... దీనిలో భాగంగానే మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద గతంలో పెండింగ్లో పడ్డ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పునరుద్ధించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు... అందులో భాగంగానే ఇందిరమ్మ మోడల్ కాలనీగా నామకరణం చేసి రాష్ట్ర ప్రభుత్వం నుండి 172 కోట్ల 80 లక్షల నిధులను ప్రత్యేకంగా కేటాయించి నిర్మాణం చేపట్టారు.. ఇప్పటివరకు.. 74 కోట్ల 80 లక్షల రూపాయలను మంజూరు చేయించి పనులు కొనసాగిస్తూ వస్తున్నారు... అదేవిధంగా మౌలిక వసతులు కల్పన కోసం మరో 20 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే... అయితే మొదటి విడతగా నిరుపేద లబ్ధిదారులకు అందించేందుకు.. గాను..నేటి వరకు... 1800 ఇండ్లు అన్ని మౌలిక వసతులు పూర్తిచేసి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి...

మిగిలిన 370 పైచిలుకు ఇండ్లు ఇంకా మౌలిక వసతులు ఇతర చిన్న చిన్న నిర్మాణాలు పూర్తి కావలసి ఉంది.. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకొచ్చి మూడు సంవత్సరాలు గడిచిన హుజూర్నగర్ ఇందిరమ్మ ఇండ్ల మోడల్ కాలనీ నిరుపేదలకు అందించేందుకు... నేటి వరకు ప్రభుత్వానికి మోక్షం లభించలేదు... అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల కేటాయింపు జరగాలనే ప్రధాన లక్ష్యంగా చేసుకున్న.. నేటికీ లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం గమనార్థం... ఇప్పటికే గత సంవత్సర కాలంగా ఇండ్లు లేని నిరుపేదలను దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం అధికార యంత్రాంగం ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించింది... ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 5000 మంది దరఖాస్తులు చేసుకోవడం జరిగింది.. ఇందులో... మొదటిగా పంపిణీకి సిద్ధంగా... ఉన్న మొదటి విడత గాను 1800 ఇండ్లు లబ్ధిదారులకు అందజేసేందుకు.. 1800 మందిని..ఎంపిక చేసి.. వీటిలో ఏమైనా సందేహాలు ఉంటే తెలపండి వాటిని పరిశీలించి ఆ తర్వాత ఫైనల్ జాబితాను విడుదల చేస్తామని అధికారం యంత్రంగం చెబుతుంది... మిగిలిన 370 ఇండ్లు అన్ని మౌలిక వసతులు పూర్తిచేసి రెండో విడత జాబితాలో లబ్ధిదారుని ఎంపిక చేసి పంపిణీ చేయనున్నట్లు వినికిడి.. సంవత్సర కాలంగా ఇటు స్థానిక ఎమ్మెల్యే మంత్రి ఉత్తమ్ జిల్లా అధికార యంత్రాంగం ఇప్పుడు అందజేస్తాం.. అప్పుడు పంపిణీ చేస్తాం.. ఉగాది పండగ రోజు కంపెనీకి శ్రీకారం చుడతామని.. చెప్పిన ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు... దీనికి తోడు ఒకసారి ముఖ్యమంత్రి... మరోసారి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రారంభించేస్తారని... చెప్పుకుంటూ వస్తు కాలం గడపడం..

నిరుపేద ప్రజలను అసహనానికి గురిచేస్తుంది...నిరుపేద లబ్ధిదారులు..తమ సొంత ఇంటి కల నెరవేర్చుకునేది ఎప్పుడో అనే ... ఆత్రుతతో లబ్ధిదారులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది... మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇలకాలో ఇలాంటి దుస్థితి ఎదురవుతే... మిగిలిన నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం అవుతుందని స్థానిక ప్రజలు చెవులు కోరుకుంటాడం కోసం మెరుపు...

## పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలి



- ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు

**సూర్యాపేట, సెప్టెంబర్ 27 (మనం ప్రతినిధి):** ఉమ్మడి ఖమ్మం నల్గొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, పట్టభద్రులు తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎం.జెడ్. ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జనసేన పార్టీని బలోపేతం చేయడంతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు అందకపోవడం, పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తనను శాసనమండలికి పంపితే పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రశ్నిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మిరియాల రామకృష్ణ, సాయి శిరీష, ఎడమ రాజేష్, సరికొప్పుల విజయలక్ష్మి, నాగేశ్వరరావు, రామగిరి శివసాయి, అరవింద్ కుమార్, పసుపులేటి రామారావు, సాయినాయుడు, ఏవీ రావు, అజయ్,4 నియోజకవర్గాలకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ పథకం దేశానికే ఆదర్శం

- బిజెపి పాలిత రాష్ట్రాలలో ఇవ్వలేకపోయారు
- పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్నబియ్యం పథకం సంతృప్తినిచ్చింది
- రాహుల్ గాంధీ ప్రధాని కానున్నారు
- గత పదేళ్లలో బిఆర్‌యస్ ప్రభుత్వం ఒక్క రేషన్ మంజూరు చేయలేదు
- స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన పౌర సరఫరాల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






**నేరేడుచర్ల, సెప్టెంబర్ 27 మనం న్యూస్:** స్వతంత్ర భారతదేశ చరిత్రలో పేదలకు సన్నబియ్యం అందించి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించిందని పేదలకు కడుపునిండా అన్నం పెట్టే సన్న బియ్యం పథకం ఎంతో సంతృప్తినిచ్చిందని రాష్ట్ర పౌర సరఫరాల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఆదివారం నేరేడుచర్ల పట్టణం ఎస్వైఎస్ ఫంక్షన్ హాల్ లో నేరేడుచర్ల,గరిడేపల్లి, పాలకవీడు మండలాల తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఎస్పీ నర్సింహతో కలిసి ఆదివారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నేరేడుచర్ల మండల పార్టీ అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్కతో మాట్లాడి మన రైతులు పండించే సన్న ధాన్యానికి అదనంగా 500 బోనస్ అందించి కొనుగోలు చేసి రాష్ట్రంలోని పేదలకు రేషన్ ద్వారా తలా ఆరు కేజీల సన్నబియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని దేశంలో బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పథకం అమలులో లేదని గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క తెల్ల రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు .కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 16.32,810 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో మొత్తం కలిపి1.06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, దీంతో 3,42,57,109 మంది ఆహార భద్రత లబ్ధి పొందనున్నట్లు తెలిపారు.సూర్యాపేట జిల్లాలో మొత్తం కలిపి 3,72,658 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయం అని బిజెపి గత 12 ఏళ్లలో ఓటు చోరీకి పాల్పడి,ఎన్నికల్లో గెలుస్తుందని ఆరోపించారు.దేశంలో బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలను మోసం చేస్తుందన్నారు.రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పేరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు,రాష్ట్ర అగ్రికల్చర్ కమిటీ సభ్యులు చెవిటి వెంకన్న, జిల్లా ఎస్పీ నరసింహ,డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు,నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి,పాలకవీడు మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారావు,మాజీ ఎంపీపీ గోపాల్,మాజీ జెడ్పీటీసీ మోతిలాల్,గరిడేపల్లి మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, కటకం రమేష్ నేరేడుచర్ల,పాలకవీడు,గరిడేపల్లి,తహసిల్దార్ సైదులు గౌడ్ వాజిద్,స్రవంతి,మున్సిపల్ కమిషనర్ నాగరాజు, బొలిశెట్టి లక్ష్మయ్య పొనుగోడు గరిడేపల్లి సర్పంచులు కటకం వేణు, మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాల సర్పంచులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎన్నికలలో తన పేరును పరిశీలించాలి

- పౌరసరఫరాల భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి
- టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టికూటి రామారావు గౌడ్



**నేరేడుచర్ల సెప్టెంబర్ 27 మనం న్యూస్:** నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తన పేరును పరిశీలించాలని రాష్ట్ర పౌరసరఫరాల మరియు భారీ నీటిపారుదల శాఖ మంత్రి హుజూర్నగర్ ఎమ్మెల్యే ఉత్తంకుమార్ రెడ్డి ని కలిసి బయోడేటా ఇచ్చి, అవకాశం కల్పించమని విజ్ఞప్తి చేసిన టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ గరిడేపల్లి మండలం తాళ్ల మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వట్టి కూటి రామారావు గౌడ్ గత మూడు దశాబ్దాలుగా విద్యార్థి నాయకుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాల యం నుండి తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడిగా జైలుకు వెళ్లి, అనేక కేసులు ఎదుర్కొన్నాను. ఈనాడు, ఆంధ్ర జ్యోతి, టివి9లలో జర్నలిస్టు గా, హైకోర్టు న్యాయవాదిగా, సుప్రీంకోర్టు ఎన్ రోల్ అడ్వకేట్ గా పనిచేశారు . అనేక సామాజిక, వామపక్ష ఉద్యమాల్లో క్రియాశీలక పోరాటా లు సైతం చేశారు. జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులుగా పని చేస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ గా ఒక అవకాశం ఇవ్వగలరని మంత్రి కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదు సత్యం గౌడ్ తదితరులు ఉన్నారు.

## సురేష్ నాయుడుపై చేసిన ఆరోపణలు అవాస్తవం

హిందూ వ్యతిరేకి అని దేవాలయాల నిర్మాణాలను అడ్డుకుంటున్నాడని నేను గతంలో చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
అక్రమ నిర్మాణమైన బ్రిడ్జిని అడ్డుకున్నాడు తప్ప దేవాలయాల నిర్మాణాన్ని కాదు
దేవాలయాల నిర్మాణానికి స్థలం వితరణ చేసింది కూడా శెట్టి వారి వంశస్తులే
శెట్టి వారికి కృతజ్ఞతగా ఆర్చి నిర్మాణం చేసి శెట్టి వారి పేరు పెడతాం...
గ్రామస్థులు,మీడియాతో కూచిపూడి దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు



**కోదాడ, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** మండల పరధిలోని కూచిపూడి గ్రామంలో దేవాలయాల నిర్వాహకులు కందికొండ సాయిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కందికొండ సాయిబాబు మాట్లాడుతూ కూచిపూడి గ్రామంలో నూతనంగా నిర్మాణ దశలో ఉన్న దేవాలయాలు గత రెండు సంవత్సరాలుగా నిర్మాణ పనులు నిలిచిపోవడం జరిగింది. అందుకు ప్రధాన కారణం అంతరగంగా వాగుపై పట్టాదారులైన శెట్టి వారి వంశస్థుల అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణం చేస్తున్న బ్రిడ్జిని మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు మరియు వారి వంశస్థులు అడ్డుకోవడం జరిగింది. ఆ సందర్భంగా మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, వారి వంశస్థులు దేవాలయాల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని వారిపై అసత్య ఆరోపణలు చేయడం ఈ విషయాన్ని నేను స్వయంగా సోషల్ మీడియాలో షేర్ చేయడం జరిగింది. అదేవిధంగా స్థలం దాతలు ఇచ్చిన భూమి వారి పట్టా భూమి కాదని ప్రభుత్వ భూమి అని అధికార నాయకులను అడ్డంపెట్టుకుని విశ్వ ప్రయత్నాలు చేయడం, శెట్టి వారి వంశస్థులపై తప్పుడు కేసులు పెట్టడం, తప్పుడు ప్రచారాలు చేయడం జరిగింది. ఆనాటి నుండి దేవాలయాల నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోవడం జరిగింది. కానీ నేను నా తప్పును తెలుసుకుని ఆత్మపరిశీలన చేసుకుని స్థలం వితరణ చేసిన వారి పట్ల దురుసుగా ప్రవర్తించడం, అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని భావించి ఎవరి ఒత్తిడి ప్రొద్బలం లేకుండా నా ఆత్మసాక్షిగా గ్రామపెద్దలు, మీడియా సమక్షంలో నా తప్పుని ఒప్పుకుని మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు, శెట్టి వారి వంశస్థులపై నేను చేసిన తప్పుడు ఆరోపణలు,అసత్య ఆరోపణలు అవాస్తవమని వారు ఎప్పుడూ దేవాలయాల నిర్మాణానికి అడ్డు పడలేదని ఉద్దేశ్యపూర్వకంగానే నేనే వారిపై అసత్య ఆరోపణలు చేశానని అదేవిదంగా దేవాలయాలకు స్థల వితరణ చేసిందే శెట్టి వారు అని ఇది శెట్టి వారి పట్టా భూమి అని వారి పేరు శాశ్వతంగా ఉండేలా దేవాలయాల ఆర్చి ఏర్పాటు చేసి శెట్టి వారి వంశస్థుల పేరు పెడతామని ఆలయ చైర్మన్ గా శెట్టి వారిని చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు వారి వంశస్థులకు గ్రామస్థులు, మీడియా సమక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పడం జరిగింది. అనంతరం నూతన దేవాలయాల వద్ద ఏర్పాటు చేయబోయే ఆర్చి నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నాణ్యత ప్రమాణాలు పాటించకుండా
## పెద్ద చెరువు కట్ట నిర్మాణ పనులు



**తిరుమలగిరి, సెప్టెంబర్ 27 (మనం న్యూస్):** తిరుమలగిరి పెద్ద. చెరువు కట్ట పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసైన కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలని జిఎం పి ఎస్ జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య ఆరోపించారు. ఆదివారం తిరుమలగిరి పెద్ద చెరువు కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద మూడుకోట్ల 20 లక్షల రూపాయలు పెద్ద చెరువు కట్ట నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. పెద్ద చెరువు కట్ట కాంట్రాక్టర్ దారి కనీస నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిలో కట్ట పనులు .చేశారని, పనిలో నాణ్యత లేదని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయిన స్పదించలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలన చేసి కాంట్రాక్ట్ కు బిల్లులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ కట్ట మీద మట్టి పోయకుండా పాత కట్టను నున్నగా చేసి బిల్లును ఎత్తు ఎత్తుకున్నాడని, మట్టి పోసి కట్టను రోలర్ తో తొక్కించలేదని ఆరోపించారు.కట్ట సైడు సోలింగ్ గ్రానైట్ పరిచి సిమెంటు కూడావేయలేదన్నారు. పెద్ద చెరువు కట్ట కింద ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకు పోయిన అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం విచకరమన్నారు. మున్సిపల్ కమిషనర్,తహసిల్దార్ , ఐబి ఏఈ, జేఈఈ లో ద్వారా లిఖిత పూర్వకంగా పిర్యాదులు చేసిన పట్టింపులేదన్నారు. అధికారులు వాటాల వారీగాడబ్బులు పంచుకున్నారే తప్ప పనిలో నాణ్యత పరిశీలించలేదని ఆరోపించారు. కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్య తీసుకుని బిల్లులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల రైతులతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బేతు సాంబయ్య, పులిమామిడి బిక్షం, కళ్యాలకు వీరన్న, రైమన్, వీరయ్య, శీను, కొమురెల్లి, తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలు చిరస్మరణీయం



- జిల్లా కలెక్టర్ అంకిత్
- తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 27 (మనంప్రతినిధి):** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమకారుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించారని, ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆదివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం దీక్ష చేపట్టడంతో పాటు తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకుని ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. సమాజంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన ఆస్తులను సైతం దానం చేసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆయన చూపిన సేవా, త్యాగ మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.విజయలక్ష్మి , వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, బీసీ సంఘ నాయకులు చిప్పా శ్రీనివాస్, ఇమ్మడి ఉదయ్ కుమార్, మోత్కూరి ధర్మారావు, బి సత్యనారాయణ, గమలాపురం సత్యనారాయణ, కొదుమూరు సత్యనారాయణ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు వార్తలు సరికావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27(మనంన్యూస్):** జిట్రాన్స్కో లో వాటా విక్రయం, టీజీట్రాన్స్కో ప్రైవేటీకరణకు సంబంధించి వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ విషయంలో, టీజీట్రాన్స్కో ను ప్రైవేటీకరించాలని గానీ, టీజీట్రాన్స్కో లో ఏదైనా వాటాను విక్రయించాలని గానీ, లేదా దాని ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేయాలని గానీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేయడమైనది. ఇందుకు భిన్నంగా సూచించే వార్తలు సరైనవి కావని ట్రాన్స్మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ప్రకటనను విడుదల చేసింది. టీజీట్రాన్స్కో ఇంతకు ముందు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది. టీజీట్రాన్స్కో లో పెట్టుబడుల ఉపసంహరణకు లేదా పబ్లిక్ ఇష్యూ తీసుకురావడానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మరోసారి స్పష్టం చేయడమైనది. పరిశీలనలో ఉన్నది కేవలం రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితిని అధ్యయనం చేసి, వాటిని బలోపేతం చేసే మార్గాలను సూచించడానికి ఒక ఆర్థిక సలహాదారుని నియమించే ప్రతిపాదన మాత్రమే. అధిక వడ్డీ రుణాల భారాన్ని తగ్గించడం, మెరుగైన షరతులపై అప్పుల పునర్వ్యవస్థీకరణ, నిర్వహణ మూలధనం మరియు క్రెడిట్ రేటింగ్లను మెరుగుపరచడం వంటివి ఇందులో ఉన్నాయి. ఏ సంస్థను కన్సల్టెంట్గా నియమించాలని కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాంటి అధ్యయనంలో చేసే ఏ సూచన అయినా కేవలం సిఫారసు మాత్రమే అవుతుంది, అది ప్రభుత్వ నిర్ణయం కాదు. ప్రైవేటీకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోనందున, రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై గానీ, వివిధ వర్గాల వినియోగదారులకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీలపై గానీ ఎలాంటి ప్రభావం ఉండే ప్రసక్తే లేదు. ఈ విషయంలో సాధారణ ప్రజలు, విద్యుత్ వినియోగదారులు మరియు టీజీట్రాన్స్కో ఉద్యోగులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యుత్ సంస్థలో పెట్టుబడుల ఉపసంహరణ లేదా ప్రభుత్వ వాటాలో మార్పుకు సంబంధించిన ఏ నిర్ణయమైనా యజమానిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం అని కూడా గమనించాలి. అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు విద్యుత్ సంస్థలను బలమైన ఆర్థిక పునాదిపై నిలబెట్టడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో, వినియోగదారులు, ఉద్యోగులు మరియు సాధారణ ప్రజలలో ఎలాంటి అపార్థాలు రాకుండా ఉండేందుకు ఈ వివరణ జారీ చేయడమైనది.

# అసలే సిగ్నల్ ఉండదు.. ఇప్పుడు షార్ట్ సర్క్యూట్

## షార్ట్ సర్క్యూట్‌తో బీఎస్ఎన్ఎల్ టవర్ కంటైనర్ దగ్ధం

## రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం.. సేవలు పునరుద్ధరించాలని స్థానికుల డిమాండ్



**కన్నాయిగూడెం, సెప్టెంబరు 27 (మనం న్యూస్):** కన్నాయిగూడెం మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఆదివారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. టవర్ ఆవరణలోని కంటైనర్లో మంటలు చెలరేగడంతో స్థానికులు పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. కంటైనర్ మాత్రమే దగ్ధమైందా, టవర్కు కూడా ఏమైనా నష్టం జరిగిందా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**పిచ్చిమొక్కలతో ప్రమాదకరంగా టవర్ పరిసరాలు...**

బీఎస్ఎన్ఎల్ టవర్ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెట్లు విపరీతంగా పెరిగి ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టవర్ నిర్వహణపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అప్పుడప్పుడు తాత్కాలిక పనులు చేపట్టి వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**అసలే సిగ్నల్ సమస్య.. ఇప్పుడు సేవలకు అంతరాయం...**

కన్నాయిగూడెం మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఇతర నెట్వర్క్ సేవలు సరిగా అందుబాటులో లేకపోవడంతో బీఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు కీలకంగా ఉన్నాయి. అసలే సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ అగ్ని ప్రమాదం మరింత ఇబ్బందికరంగా మారింది. అత్యవసర సమయంలో ఫోన్ ద్వారా సమాచారం చేరవేయడంలో ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బీఎస్ఎన్ఎల్ టవర్కు జరిగిన నష్టాన్ని పరిశీలించి, మరమ్మతులు చేపట్టి సేవలను తక్షణమే పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# ఎన్నికల సంఘం తీరుపై నేడు కాంగ్రెస్ ర్యాలీ

**ములుగు, సెప్టెంబర్ 27, మనం ప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారాలపై నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ములుగులో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టర్కు వినతిపత్రం సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ర్యాలీని విజయవంతం చేసేందుకు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ పిలుపునిచ్చారు.

# ఓట్ల చోరీకి నిరసనగా ఈ నెల 28న జనగామలో కాంగ్రెస్ మహా ధర్నా



## నెహ్రూ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

**జనగామ, సెప్టెంబర్ 27 (ప్రతినిధి):** ఓట్ల చోరీ వ్యవహారం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పై కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఈ నెల 28న జనగామ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ ప్రకటించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా జనగామలో 28న ఉదయం 10 గంటలకు నెహ్రూ పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వోట్ చోరీ అంశాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చి అవకతవకలపై నిరంతరం పోరాడుతున్నారన్నారు.

ప్రధాన డిమాండ్లుగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని, ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పుల వివరాలను వెల్లడించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైటీడీఏ సభ్యుడు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలపై కాంగ్రెస్ ప్రజల తరపున ప్రశ్నిస్తోందన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్ చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, నాయకులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, లోకుంట్ల ప్రవీణ్, బోనాసి క్రాంతి, జాయ మల్లేష్, గాదె మహేందర్ రెడ్డి, చింతకింది మల్లేష్, లోనే శ్రవణ్ బాబు, పోకల శ్రీనివాస్, మేడిపల్లి మహేష్, కోట నాయక్, మోతె జనార్దన్, మచ్చ ప్రవీణ్, గుంటుక దామోదర్ రెడ్డి, బాల్దే శ్రీశైలం, మారబోయిన నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక లడ్డూకు భారీ ధర

## శ్రీ ఏకదంతాయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా లడ్డూ వేలం



**తూర్పుతండా ఏనుగల్లు , సెప్టెంబర్ 26:** శ్రీ ఏకదంతాయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలం పాటలో భక్తుల ఉత్సాహం వెల్లువెత్తింది. వేలం పాటలో లడ్డూకు భారీ ధర పలకడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

భక్తులు ఉత్సాహంగా వేలం పాటలో పాల్గొనగా, చివరకు బానోతు రవి-విజయ మాజీ సర్పంచ్ గారు ₹99,000/-లకు వినాయక లడ్డూను దక్కించుకున్నారు. భక్తి, సంప్రదాయాల పట్ల ఆయనకున్న నమ్మకానికి ఇది నిదర్శనమని కమిటీ (అధ్యక్షుడు)

1) బాదావత్ వినోద్ కుమార్
2)( ట్రెజరీ) బానోత్ సచిన్ కమిటీ సభ్యులు
3) రమేష్, తరుణ్, వెంకటేష్, ప్రవీణ్, గుణశేఖర్, రాకేష్

మరియు గ్రామ సర్పంచ్ బానోత్ దశరథ్ గారు తెలిపారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని కమిటీ కార్యక్రమాలు మరియు భక్తి కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, దాతలకు మరియు కమిటీ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

# ఏటూరునాగారంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణం



**ఏటూర్ నాగారం, సెప్టెంబర్ 27, మనం ప్రతినిధి:** మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వార్డులో నూతనంగా నిర్మించనున్న 60 మీటర్ల సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్బాబు గురువారం శ్రీకారం చుట్టారు. వరప్రసాద్ ఇంటి వద్ద కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు మాధర మధు, గుండాలె శ్రీనివాస్యాదవ్, కొండాయి చిన్ని, గండేపల్లి నాగరాజు, కాళ్ల రామకృష్ణ, ఎంపెల్లి రాజు, ఎస్.కె. బాబా, కాకులమర్రి అరుణమ్మ, పంచాయతీ ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన మహిళ సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా: ఎమ్మెల్యే జారె

**దమ్మపేట, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** ఆదివాసీ మహిళలకు శిక్షణ అందించి స్వయం ఉపాధి కల్పించే కార్యక్రమానికి సంబంధించి తమకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ పలువురు మహిళలు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,ని గండుగులపల్లి, క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యను సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు. ఆదివాసీ మహిళలు సభ్యులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వివిధ ప్రభుత్వ సంస్థల సహకారంతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా(ఎం ఎస్ ఎం ఈ) ఐ టీ డీ ఏ,సంస్థల ఆధ్వర్యంలో శిక్షణ పొందడంతో పాటు స్వయం ఉపాధి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకున్నామని వివరించారు. శిక్షణ అనంతరం తమకు ఉపాధి



అవకాశాలు కల్పించడంతో పాటు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు ప్రభుత్వం ద్వారా అందుతున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని తాము ప్రయత్నిస్తున్నామని అయితే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు అవసరమైన సహకారం మార్కెటింగ్ ఉత్పత్తుల విక్రయం తదితర అంశాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని వారు ఎమ్మెల్యే, దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలకు ఉపాధి కల్పించడం ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచవచ్చని తెలిపారు.తమకు శిక్షణ ఇచ్చిన సంస్థల ద్వారా అందాల్సిన సహకారం ప్రాజెక్టుకు సంబంధించిన అవసరాలు మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలను ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునేలా చూడాలని ఎమ్మెల్యే,నుని అభ్యర్థించారు.

ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందితే తాము శిక్షణ పొందిన నైపుణ్యాలతో ఉపాధి కార్యక్రమాన్ని కొనసాగించి ఇతర మహిళలకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగగలమని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,మహిళలు వివరించిన సమస్యలను విని వారి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెరగడం శిక్షణ పొందిన వారికి తగిన అవకాశాలు అందడం ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# జిల్లాలో వైద్య పోస్టుల భర్తీ పరీక్ష సజావుగా నిర్వహణ



**● 233 మంది అభ్యర్థులు హాజరు**

**జనగామ, సెప్టెంబర్ 27 (మనం ప్రతినిధి):** జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 11 పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిసింది. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 11 పోస్టులకు 281 దరఖాస్తులు రాగా 233 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 48 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేటగిరీల వారీగా చూస్తే ఫిజీషియన్ ఒక పోస్టుకు 12 దరఖాస్తులు రాగా 7 మంది హాజరయ్యారు, 5 గురు గైర్హాజరయ్యారు. ఎంఎల్హెచ్పీ 6 పోస్టులకు 166 దరఖాస్తులు రాగా 130 మంది హాజరై 36 మంది గైర్హాజరయ్యారు. ల్యాబ్ టెక్నీషియన్ 2 పోస్టులకు 96 దరఖాస్తులు రాగా 90 మంది హాజరయ్యారు. సైకియాట్రిస్ట్ ఒక పోస్టుకు ఒక్కరే దరఖాస్తు చేయగా ఆ అభ్యర్థి గైర్హాజరయ్యారు. ఆప్థాల్మిక్ అసిస్టెంట్ ఒక పోస్టుకు 6 దరఖాస్తులు రాగా 6 గురు హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి, సంబంధిత అధికారులు పర్యవేక్షించారు.

# రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 26 పతకాలు

**పాల్వంచ, సెప్టెంబర్ 27(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ముగిసిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. మొత్తం 26 పతకాలు సాధించి, జిల్లా పేరు రాష్ట్రస్థాయిలో నిలబెట్టారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే మహీధర్ తెలిపారు. ఇందులో 12 బంగారు, 8 రజత, 6 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ సందర్భంగా పతక విజేత లను అథ్లెటిక్స్ కోచ్ లు పి నాగేందర్, మల్లికార్జున్ రావు, భద్రాచలం కోచ్ గిరి ప్రసాద్ లను రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె సారంగపాణి, జాతీయ కోచ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్, జిల్లా క్రీడల అధికారి పరంధామ్ రెడ్డి అభినందనలు తెలిపారు. చర్లకు చెందిన ఎం. శ్రీ విద్యా దొర 100 మీటర్ల హర్డిల్స్ లో బంగారు పతకొా, సక్. ముబీన్ షాట్ పుట్ లో బంగారు పతకం, కరకగూడెంకు చెందిన తోలేం శ్రీ తేజ 100 మీటర్లు హర్డల్స్ లో బంగారు పతకం సాధించారు. కొత్తగూడెంకు చెందిన రియాజ్ పాషా షాట్పుట్లో బంగారు పతకం, డిస్కస్ త్రో లో రజిత పతకం, మధు ప్రియ జావిలిన్ లో బంగారు పతకం, వేదశ్రీ షాట్ పుట్ లో కాంశ్య పతకం సాధించారు.

దుమ్ముగూడెం కు చెందిన సాయి ఆదిత్య 600 మీటర్లు పరుగు పందెం లో బంగారు పతకం, పాల్వంచ కు చెందిన అభినవ్ నాయక్ హై జంప్, డెకతలాన్ లో రెండు బంగారం పతకాలు, పవన్ హై జంప్ లో బంగారు పతకం, 400 మీటర్ల హర్డల్ లో కాంశ్య పతకం, దివ్య లాంగ్ జంప్ లో బంగారు పతకం, 400 మీటర్ పరుగు పందెం లో కాంశ్య పథకం, అక్షిత డిస్కస్ త్రో లో బంగారం పథకం, జావిలిన్ లో రజిత పతకం, సిద్ద వినయ్ హై జంప్




లో రజిత పతకం, బి పల్లవి హై జంప్ లో రజిత పతకం, బి సౌమ్య జావిలిన్ త్రో లో కాంశ్య పతకం, భద్రాచలం కు చెందిన ఎస్కే అమ్రిన్ షాట్ పుట్ లో బంగారు పతకం, జావెలిన్ త్రో లో రజిత పతకాలు సాధించారు. కె నవ్య జావిలిన్ త్రో లో రజిత పతకం, పృథ్వీక జావెలిన్ త్రో లో కాంశ్య పతకం, అశ్వారావుపేట కు చెందిన గౌరి డిస్కస్ త్రో లో రజిత పతకం, గోవింద్ కుమార్ షాట్ పుట్ లో కాంశ్య పతకం, ఇల్లందుకు చెందిన హర్షిని హై జంప్ లో రజిత పథకం గెలుచుకున్నారు.



ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ కాన్వాయ్ వెనుక, కేవలం ప్రతిష్ట కోసం మాత్రమే కాకుండా, రక్షణ, దృఢత్వం, సురక్షితమైన రాకపోకల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సాయుధ వాహనాలు, విలాసవంతమైన కార్లు, ధృడమైన సుదీర్ఘ **SUV** శ్రేణి ఉంది. ప్రభుత్వాధినేతకు, రాజకీయ నాయకులకు, ఇతర సెలబ్రిటీలకు కాన్వాయ్ ఒక చలనశీల భద్రతా కవచం, ఒక సమాచార కేంద్రం. కాన్వాయ్ అనేది అక్షరాలా ఒక రక్షణ శ్రేణిగా పనిచేస్తుంది. మోడీ కాన్వాయ్‌లోని వాహనాలను కేవలం వాటి బ్యాడ్జ్లు, లెదర్ ఇంటీరియర్లు లేదా రోడ్డుపై వాటి గంభీరమైన ఉనికి కోసం మాత్రమే ఎంచుకోరు. అవి విలాసవంతమైన జీవితానికి చాలా భిన్నమైన నిర్వచనం ఆధారంగా రూపొందించిన, అత్యంత భద్రత కలిగిన యంత్రాలు. ఆ నిర్వచనంలో విశాలమైన పైకప్పులు లేదా మసాజ్ సీట్ల కంటే బాలిస్టిక్ నిరోధకత, పేలుడు నుండి రక్షణ, రన్ ఫ్లాట్ టైర్లు, సీల్ క్యాబిన్లు, అత్యవసర వ్యవస్థలకు చాలా ఎక్కువ ప్రాధాన్యం

# ప్రధాని కాన్వాయ్ ఇదే!

ఉంటుంది. సంవత్సరాలుగా, ప్రధానమంత్రి **BMW 7** సిరీస్ హై సెక్యూరిటీ, భద్రత కలిగిన టయోటా ల్యాండ్ క్రూయిజర్ నుండి రేంజ్ రోవర్ సెంటినెల్, మెర్సిడెస్ మేబ్యాక్ **S650** గార్డ్ వరకు అనేక అత్యంత భద్రతా వాహనాలలో కనిపిస్తూనే ఉన్నారు. వారి చుట్టూ ఎస్కార్ట్, వ్యూహాత్మక సహాయక వాహనాలతో కూడిన ఒక పెద్ద భద్రతా వ్యవస్థ పనిచేస్తుంది. దీని ఫలితంగా ఏర్పడే మోటార్కేడ్‌లో ప్రతి వాహనానికి ఒక ప్రయోజనం ఉంటుంది, భద్రత, చలనశీలతపై ఉండే తీవ్రమైన ప్రాధాన్యత ముందు ఆడంబరమైన విలాసం తరచుగా ద్వితీయ స్థానంలో ఉంటుంది.



## మెర్సిడెస్ మేబ్యాక్ S650 గార్డ్

మోదీ ప్రస్తుత కాన్వాయ్‌తో ముడిపడి ఉన్న, సులభంగా గుర్తించగలిగే వాహనాల్లో మెర్సిడెస్ మేబాక్ ఎస్650 గార్డ్ ఒకటి. 2021లో ఆయన భద్రతా సిబ్బందిలోకి ప్రవేశపెట్టిన ఈ అత్యంత కట్టుదిట్టమైన భద్రత గల విలాసవంతమైన లిమోసిన్, గతంలో ఉపయోగించిన రేంజ్ రోవర్ వోగ్, టయోటా ల్యాండ్ క్రూయిజర్ల కన్నా గణనీయమైన ఉన్నతీకరణను సూచిస్తుంది. మెర్సిడెస్, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ మధ్య విస్తృత చర్చల అనంతరం ఈ వాహనాన్ని కొనుగోలు చేశారని, భద్రతా సంస్థ ఆదేశాల మేరకు రక్షణ ఫీచర్లను పరిశీలించారని ప్రముఖ పత్రికా కథనాల ద్వారా తెలుస్తోంది. **S650** గార్డ్, మేబాక్ తాలూకు సంప్రదాయ విలాసవంతమైన ప్రాధాన్యతను, పటిష్టమైన రక్షణ ఇంజనీరింగ్‌తో మిళితం చేస్తుంది. ఇటీవలి నివేదికల ప్రకారం, ఇది **VR10** స్థాయి బాలిస్టిక్ రక్షణ, పేలుడు నిరోధకత, రన్ ఫ్లాట్ టైర్లు, స్వతంత్ర గాలి సరఫరా వ్యవస్థను అందిస్తుంది. ప్రధానమంత్రి కాన్వాయ్ సందర్భంలో, ఇది వాస్తవానికి అత్యంత పటిష్టమైన మొబైల్ కమాండ్ వ్యవస్థగా పనిచేస్తుంది.

## రేంజ్ రోవర్ సెంటినెల్

రేంజ్ రోవర్ సెంటినల్ ప్రధాని కాన్వాయ్‌కి ఒక విభిన్నమైన రూపాన్ని తెస్తుంది. మేబ్యాక్ ఒక సాయుధ లిమోజిన్ అయితే, సెంటినల్ ఒక లగ్జరీ ఎస్‌యువి తాలూకు సుపరిచితమైన నిష్పత్తులను తీసుకుని, వాటిని ఒక భద్రతా వాహనంగా మారుస్తుంది. మోడీ పాల్గొనే ప్రధాన బహిరంగ కార్యక్రమాలతో సెంటినల్‌కు దగ్గరి సంబంధం ఉంది.

## టయోటా ఫార్చ్యూనర్, ల్యాండ్ క్రూయిజర్

కాన్వాయ్‌లోని ప్రతి వాహనం ప్రధానమంత్రిని తీసుకువెళ్లాల్సిన అవసరం లేదు. మొత్తం కదలిక సురక్షితంగా, నిరంతరాయంగా సాగేలా చూసుకోవడానికి కొన్ని వాహనాలు ఉంటాయి. సాయుధ టయోటా ఫార్చ్యూనర్లు **SPG** ఎస్కార్ట్, వ్యూహాత్మక సహాయక వాహనాలుగా వీటికి విస్తృత ప్రచారం లభించింది. టయోటా ల్యాండ్ క్రూయిజర్లు కూడా ప్రధానమంత్రి భద్రతా కదలికలతో, ముఖ్యంగా నమ్మకమైన సహాయక వాహనాలుగా సంబంధం కలిగి ఉన్నాయి. వాటి మన్నిక, అన్ని రకాల భూభాగాలపై ప్రయాణించగల సామర్థ్యానికి ఉన్న ఖ్యాతి, విశ్వసనీయత అనేది విలాసంగా కాకుండా, అవసరమైన పాత్రకు వాటిని తార్కిక ఎంపికలుగా నిలుపుతుంది.







## రక్షణ చుట్టూ నిర్మితమైన కాన్వాయ్

నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, దానిలోని విలాసం దాదాపు యాదృచ్ఛికం. మెర్సిడెస్ తాలూకు అత్యంత ఖరీదైన బ్రాండ్లలో ఒకటైన మేబ్యాక్‌కు దాని స్పష్టమైన ప్రతిష్ట ఉండవచ్చు, అలాగే బ్రిటన్‌కు చెందిన అత్యంత ప్రసిద్ధ లగ్జరీ ఎస్‌యువి అయిన రేంజ్ రోవర్‌కు పేరు ప్రఖ్యాతులు ఉండవచ్చు, కానీ వాటి అసలు ఉద్దేశ్యం భద్రత. ఈ కాన్వాయ్ ఖరీదైన కార్ల సమాహారం కాకుండా, అంతిమంగా జాగ్రత్తగా సమన్వయం చేయబడిన ఒక వ్యవస్థ. కొన్నిసార్లు అత్యంత అధునాతన విలాసం అంటే స్టైయిల్‌గా గమ్యస్థానానికి చేరుకోవడం కాదు, ప్రయాణం సురక్షితంగా ఉండేలా చూసుకోవడమే!

\- కల్కి







కాన్వాయ్ జామ్మర్, వాహనాల సమూహాలు లేదా ఒంటరి ప్రయాణికులపై జరిగే **RCIED** దాడులను నివారించడానికి పనిచేస్తుంది. రిమోట్ కంట్రోల్ ఆయుధాలను ఎదుర్కోవడానికి కాన్వాయ్ జామ్మర్‌ను వాహనాల సమూహాలలో లేదా ఒకే వాహనంలో ఉంచవచ్చు. జామ్మర్ల నిర్మాణం సాధారణంగా మాడ్యులర్ లేదా మోనోలిథిక్ సిస్టమ్-బిల్డ్‌లను, లేదా రెండింటినీ కలిగి ఉంటుంది, ఇవి ఒక కాన్వాయ్‌లోని వాహనాల నుండి రేడియో అంతరాయాన్ని విడుదల చేస్తాయి. ఒంటరిగా ఉపయోగించినా, లేదా ఇతర **IED** జామ్మర్లతో కలిపి ఉపయోగించినా, కాన్వాయ్ రక్షణకు కనీసం ఒక క్రియాశీల జామ్మర్ అవసరం. ఇది **IED** ఆయుధాలు ఉపయోగించే రేడియో ట్రిగ్గర్లపై దాడి చేయడానికి రేడియో అంతరాయాన్ని విడుదల చేస్తుంది. బహుళ **IED** జామ్మర్లను ఉపయోగించడం ద్వారా, **IED**లపై ఉండే రేడియో ట్రిగ్గర్ల వైపు వెళ్తున్నప్పుడు లేదా వాటి నుండి దూరంగా వెళ్తున్నప్పుడు కాన్వాయ్ జామింగ్ పరిష్కారం రక్షణ పరిధిని పెంచగలదు. కాన్వాయ్ వాహనాలపై **IED** జామ్మర్లతో ఒక పరిధిని ఏర్పాటు చేయడమన్నది, రిమోట్ కంట్రోల్ **IED** ముప్పులను (**RCIED** ఆయుధాలు) కాన్వాయ్ కదలిక

# ఎలక్ట్రానిక్ యుద్ధభేరి

నుండి ఎదుర్కోవడానికి అత్యంత సురక్షితమైన మార్గాలలో ఒకటి. కాన్వాయ్‌లోని విధ్వంసానికి గురైన వాహనాల దగ్గర లేదా లోపల రోడ్డు పక్కన బాంబులు, రేడియో ద్వారా పేల్చే మందుపాతరలు, దాచిపెట్టిన రిమోట్ కంట్రోల్ పేలుడు పదార్థాల వరకు **RCIED** ముప్పులు విస్తరించి ఉన్నాయి. కాన్వాయ్‌లపై జరిగే దాడులలో అత్యధిక శాతం, **RF IED** (రేడియో ఫ్రీక్వెన్సీ ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) ద్వారా పేల్చబడే రేడియో



నియంత్రిత ఆయుధాల వల్లే జరుగుతున్నాయి. ఉగ్రవాదులు నిర్దిష్ట బాధితులను లక్ష్యంగా చేసుకున్నప్పుడు రిమోట్ లేదా ఆన్-కమాండ్ రేడియో ట్రిగ్గర్లను ఉపయోగిస్తారు. ఒక **IED**ని యాదృచ్ఛికంగా పేలేలా వదిలివేయడానికి బదులుగా, కచ్చితమైన దాడి పద్ధతుల కోసం, ముఖ్యంగా ప్రముఖులను లేదా ప్రభుత్వ లక్ష్యాలను ఛేధించేటప్పుడు, ఆన్-కమాండ్ రిమోట్ డిటోనేటర్‌ను ఉపయోగిస్తారు. కాన్వాయ్ జామ్మర్, **RCIED** ముప్పులను ఎదుర్కోవడానికి పనిచేస్తుంది. ఇది కాన్వాయ్‌గా కలిసి ప్రయాణించే వాహనాల సమూహాలు ప్రమాదకర ప్రాంతాల గుండా, విడివిడిగా ప్రయాణిస్తున్నప్పుడు వాటి చుట్టూ ఒక 'రక్షణ వలయాన్ని' సృష్టిస్తుంది.

\- అభిరామి

సాధారణంగా నగరాల్లో నివసించే మధ్యతరగతి ప్రజల్ని కదిలిస్తే మనకు తరచూ వినిపించే మాటలు 'ట్రాఫిక్.., కాన్వాయ్‌ల గోల'! అసలు కాన్వాయ్ అనే మాట చరిత్రలో కొన్ని విపత్కర పరిస్థితుల్లో ఒక భద్రతా చర్యకు సంబంధించిందిగా ఉంటుంది, కానీ ఆధునిక కాలంలో ఈ పదం అధికారానికి, దర్పానికి ఆనవాలుగా మారిపోయింది. భద్రత అవసరమే కానీ, కొందరు వ్యక్తుల భద్రత జనసామాన్యం భుజాల మీద మోయరాని బరువు కారాదు. అదే సమయంలో కాన్వాయ్‌ల్లో వినియోగించే ఇంధనం, తదితర అంశాలు పర్యావరణ సమస్యల్ని కూడా సృష్టిస్తున్నాయి.

# భద్రతా, బరువా?!

## శాపంగా మారిన వివిఐపి కాన్వాయ్ సంస్కృతి

విఐపి కాన్వాయ్‌లంటే ట్రాఫిక్ గందరగోళం అని అర్థం కాదు. మేఘాలయ నుండి హైదరాబాద్ వరకు ప్రజా రహదారుల న్యాయమైన వినియోగం ఎలా ఉండాలనే దానిని చురుకుగా పునఃసమీక్షిస్తున్న ఐదు భారతీయ రాష్ట్రాలు/నగరాల గురించి తెలుసుకుందాం. నగరాల్లో రద్దీ పెరుగుతున్న కొద్దీ, విఐపి కాన్వాయ్‌ల వల్ల కలిగే ట్రాఫిక్ ఆలస్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు వివిధ మార్గాలతో ప్రయోగాలు చేస్తున్నాయి.

2026 జూన్ 1వ తేదీ సాయంత్రం, కర్ణాటక గవర్నర్ కాన్వాయ్‌కి వీలు కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు దాదాపు 30 నిమిషాల పాటు అన్ని రాకపోకలను నిలిపివేయడంతో, బెంగళూరు నివాసి ఒకరు నిరసనగా ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు మధ్యలో కూర్చున్నారు. ఆ వ్యక్తి తన గర్భిణీ భార్యను కారులో కూర్చోబెట్టి, 'సాధారణ పౌరులను ఎందుకు వేచి ఉండేలా చేస్తున్నారని' ప్రశ్నించడానికి తన వాహనం నుండి బయటకు వచ్చాడు. 'గవర్నర్ ఒక విఐపి అయినంత మాత్రాన మేము అనామకులమా?'అని ఆయన పోలీసు అధికారులను ప్రశ్నించారు - ఈ మాటలు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించి, విఐపిల రాకపోకలు, ప్రజల అసౌకర్యం చుట్టూ ఉన్న సుపరిచితమైన చర్చను మళ్లీ రాజేశాయి. ఈ సంఘటన అరుదైనదేమీ కాదు. కేవలం వారం రోజుల క్రితమే, బీహార్‌లోని మోతిహారిలో దాదాపు 42ఒఇ ఉష్ణోగ్రతల నమోదవుతున్న తరుణంలో, ఒక అధికారిక కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను నిలిపివేయడంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. విసుగు చెందిన ప్రయాణికులు నిరసనగా నిరంతరంగా హారన్లు మోగించారు. చాలా మంది భారతీయులకు ఈ దృశ్యాలు సుపరిచితమే! అంబులెన్సులు ఆలస్యం కావడం, అపాయింట్మెంట్లు తప్పిపోవడం, పిల్లలను స్కూలుకు తీసుకువెళ్లే ప్రక్రియ నిలిచిపోవడం, వాహన శ్రేణులు వెళుతుండగా, కూడళ్ల వద్ద సుదీర్ఘంగా వేచి ఉండాల్సి రావడం వంటివన్నీ సామాన్య ప్రజల నిత్యజీవితాన్ని నరకప్రాయం చేస్తున్నాయి. కానీ భారతదేశంలోని అనేక నగరాలు, రాష్ట్రాల్లో అధికారులు భద్రతను కాపాడుతూనే, అంతరాయాలను తగ్గించేందుకు వివిధ మార్గాలతో ప్రయోగాలు చేస్తున్నారు.

### ఐజ్వాల్

బహుశా అత్యంత అసాధారణమైన ఉదాహరణ ఐజ్వాల్ నుండి వచ్చింది, అక్కడ ట్రాఫిక్ నిర్వహణ కాన్వాయ్ ప్రోటోకాల్స్ కంటే ఒక ఉమ్మడి సూత్రంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ప్రజా రహదారులు ప్రజా రహదారులుగానే ఉండాలి. విఐపిల రాకపోకలకు ముందు కూడళ్లను ఖాళీ చేసే అనేక నగరాలకు భిన్నంగా , ఐజ్వాల్‌లో అధికారులు ప్రత్యేక కారిడార్ల గుండా కాకుండా సాధారణంగా ట్రాఫిక్ ప్రవాహంలోనే ప్రయాణిస్తారు. దీని ఫలితంగా రోడ్లపై అంతరాయాలు తగ్గి, ప్రయాణికులకు కలిగే ఇబ్బంది కూడా తగ్గుతుంది.

### హైదరాబాద్

తెలంగాణ మరింత ప్రత్యక్ష ట్రాఫిక్ నిర్వహణ చర్యను చేపట్టింది. తన కాన్వాయ్ రాకపోకల కోసం ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను ఆదేశిస్తూ, 'నేను ముఖ్యమంత్రిని - సామాన్యుడిని, వీఐపీని కాదు' అని అన్నారు.

### షిల్లాంగ్

షిల్లాంగ్‌లో ప్రభుత్వం అధికారిక నియమాలను ఎంచుకుంది. సైరన్లు, ఫ్లాషర్లు, విఐపి ప్రత్యేక హక్కుల గురించి పదేపదే ఫిర్యాదులు రావడంతో, అనవసరమైన అంతరాయాన్ని తగ్గించే లక్ష్యంతో మేఘాలయ 2025 నవంబర్‌లో ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎస్‌ఓపి ప్రకారం, ముఖ్యమంత్రి వాహనానికి కూడా ఫ్లాషర్ల కోసం లిఖితపూర్వక అనుమతి అవసరం. సైరన్లు అత్యవసర సేవలు, పోలీసు వాహనాలు,నియమిత వ్యక్తుల పైలట్ ఎస్కార్ట్‌లకు మాత్రమే పరిమితం చేయబడ్డాయి.

### కేరళ

కేరళ విధానం అధికారిక కదలికల పరిధిని తగ్గించడంపైనే దృష్టి సారించింది. పదవీ బాధ్యతలు స్వీకరించడానికి ముందు, కాన్వాయ్‌ల పరిమాణం కనిష్టంగా ఉండాలని, అలాగే రాకపోకల వల్ల వీలైనంత తక్కువ అసౌకర్యం కలిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను బహిరంగంగా ఆదేశించారు. ఎస్కార్ట్ వాహనాల సంఖ్యను తగ్గించడం, అలాగే విస్తృతమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అవసరమయ్యే భారీ వాహన శ్రేణులను పరిమితం చేయడంపై దృష్టి సారించారు.

### కర్ణాటక

కాన్వాయ్ కదలిక సమయంలో అంబులెన్సులు ఆలస్యం కావడంపై ప్రజల విమర్శల తర్వాత కర్ణాటకలో అత్యంత ముఖ్యమైన సంస్కరణలలో ఒకటి ఆవిర్భవించింది. కాన్వాయ్ వెళ్తుండగా అంబులెన్స్ సుమారు 15 నిమిషాల పాటు వేచి చూసిందన్న ఘటన నేపథ్యంలో, విఐపిల రాకపోకలతో సంబంధం లేకుండా అత్యవసర వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం ట్రాఫిక్ పోలీసులను ఆదేశించింది. కర్ణాటక పోలీసులు కాన్వాయ్ కదలిక సమయంలో వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడమని అధికారులను ప్రోత్సహిస్తూ, ఎస్కార్ట్ వాహనాల సైరన్ల వాడకాన్ని కూడా పరిమితం చేశారు. రహదారులను పాక్షికంగా తెరిచి ఉంచడం, అంబులెన్స్‌లకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలతో, విభిన్నమైన విధానంతో పెరుగుతున్న సంఖ్యలో ప్రభుత్వాలు ప్రయోగాలు చేయడమన్నది ఆశించదగిన పరిణామం.

\- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.